
ఆంధ్రపత్రిక
సచిత్ర వార పత్రిక
4 అణాలు
2-5-'56
ANDHRA PATRIKA
ILLUSTRATED WEEKLY



మూతిబిగింపు

—ఫోటో: కె. గురుమూర్తి

సంవత్సర చందా
రు. 12-0-0
విడిప్రతిక 4 అ.




సచిత్రవారపత్రిక

Founder : K. NAGESWARA RAO

సంపుటము 49
సంచిక 35
2-5-56

దుర్ముఖి చైత్ర బహుళ సప్తమి బుధవారం




హైదరాబాదు రాష్ట్ర సంస్కృత విద్యా మండలికి ముఖ్యమంత్రి డా॥ బూర్గుల రామకృష్ణరావు ఏప్రిల్ 17న ప్రారంభోత్సవం చేశారు. దీనికి తిరుపతి దేవస్థానం దోహదం చేసింది. ప్రారంభోత్సవానికి ఆంధ్రదేవాదాయ మంత్రి శ్రీ కల్లూరి చంద్రమౌళి అధ్యక్షత వహించారు.

విషయానుక్రమణిక

ముఖచిత్రం :

రాజశ్రీ వారి "జయం మనదే" చిత్రంలో అంజలీ దేవి.



భారత ప్రధాని పండిట్ నెహ్రూ ఇటీవల ఉత్పత్తిదారుల సభలో మాట్లాడుతూ ప్రజాస్వామ్యం అనేది విశిష్టమైన జీవిత విధానం అని స్పష్టంచేశారు. గడచిన నాలుగేళ్లలో ఆయన కుల, మత, రాష్ట్రీయ తత్వాలను విసుగు, విరతి లేకుండా ఖండించడమే పనిగా పెట్టుకున్నారు. అయినా రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ సంఘం నివేదికను చూసిన వారికి ఈ దేశంలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యం కేవలం వేషధారణగామాత్రమే పనికి వస్తోందని స్పష్టపడుతుంది. "భారతీయులు కుటుంబం, తెగ, మతం మొదలయిన చిన్న చిన్న శాఖలమీద ఏర్పరచుకున్నంత అభిమానం, నగరంమీదగాని, దేశంమీదగాని తగినంతగా ఏర్పరచుకోలేరని విదితమవుతోంది. సార్వజనీనశ్రేయస్సుకు కృషి చేయాలనే సార్వజనీనభావం ఈ దేశంలో ముఖ్యం" అని ఆ నివేదికలో ఉంది.

ఇది సమస్యలో ఒక భాగంమాత్రమే. అసలు ప్రజాస్వామ్యం అంటే కేవలం అధికసంఖ్యాకుల పరిపాలనమే కాదు; తలకాయల్ని లెక్కపెట్టి నిర్ణయం చెయ్యడమే కాదు. అసలు ఇలా తలకాయల్ని లెక్కపెట్టాలనే సూత్రంవల్లనే మనదేశం విభక్తం కావలసివచ్చింది. ఇప్పుడది హిందీ విషయములో మళ్ళీ తలెత్తుతోంది

ఇంగ్లీషుస్థానంలో హిందీని ప్రవేశపెట్టడము హిందీభాష మాట్లాడేవారుకాక, తదితరులు నిర్ణయించాలని, ఇటీవల విద్యాశాఖ బడ్జెట్ పై చర్చలలో శ్రీ అవినాశిలింగం చెట్టి వాదించారు. బాబూ పురుషోత్తందాస్ టాండన్ అలా వీల్లేదన్నారు. హిందీ ఎక్కువమంది మాట్లాడతారు గనుక, అర్థం చేసుకోగలరు గనుక, అల్పసంఖ్యాకులకు అర్థంకాకపోయినా వారి నెత్తిన అది రుద్దాలని దీని భావం.

వెనకటికి ఐరిష్ స్వాతంత్ర్య సమరం సందర్భంలో కార్సన్ ప్రభువు దక్షిణ ఐర్లెండు తనను పరిపాలించడానికి అంగీకరించనన్నాడు. దానివల్ల దేశంవిభక్తమైపోయింది. భారతదేశంలో జిన్నా "అధికసంఖ్యాకుల" ప్రజాస్వామ్యాన్ని జయప్రదంగా ఎదుర్కొని మాట నెగ్గించుకున్నాడు. అధిక సంఖ్యాక ప్రజాస్వామ్యవాదులు బోర్బన్ వంశీయులకు మల్లే మరిచిపోరు, నేర్చుకోరు. శ్రీ రాజగోపాలాచారి అభిప్రాయాలనుబట్టి, మద్రాసు ప్రభుత్వ అభిప్రాయాలనుబట్టి, దక్షిణాదివారిపై హిందీ రుద్దితే ఏంజరిగేదీ తెలుస్తుంది. టాండన్ ఎండ్ కోవారి శాసనానికి దక్షిణభారతదేశం లొంగేదిలేదని స్పష్టమవుతోంది.

ప్రజాస్వామ్యంలో తిరుగులేని నిర్ణయాలుండవనేమాట నిజమే. కాని ప్రజాస్వామ్యం అంటే నిర్ణయరాహిత్యం అని అర్థంకాదు. ప్రజాస్వామికంగా తీసుకున్న నిర్ణయాలను ప్రజాస్వామికంగానే మార్చడానికి వీలున్నదని మాత్రమే. నేను చెప్పేది భారత రాజ్యాంగాన్నిగూర్చి. రాజ్యాంగసూత్రాలను మార్చనంతవరకూ అవి విధిగా చెలామణీ కావలసిందే.

శ్రీ కృష్ణ
(ఆంధ్రపత్రిక ప్రతినిధి)

రాజ్యాంగాన్ని నిర్ణయించింది ముఖ్యంగా కాంగ్రెసు పార్టీ. తదితరులతోపాటు మౌలానా ఆజాద్ కూడా దానిమీద సంతకం చేశారు. అయినా రాజ్యాంగాన్ని త్రోసిరాజనడంలో ఆయన శాఖ ముందంజవేసింది. ప్రాథమికోపాధ్యాయుల జీతాలకు సబ్సిడీ ఇవ్వడం రాజ్యాంగాన్ని కాదని వ్యవహరించారనడానికొక నిదర్శనం.

రాజ్యాంగాన్ని అలా ఉంచి, అసలు విద్యాశాఖ పనిచేసే తీరు చూస్తే, నిష్పాక్షికంగా వ్యవహరించగల వ్యక్తులచేత విచారణ చేయించడం అవసరమనిపిస్తోంది. ఈ శాఖ మతాభిమానప్రాతిపదికపై పనిచేస్తోంది. మంచి కాలేజీలోగాని, స్కూలులోగాని స్వదేశీయుల పిల్లలకు ప్రవేశం దొరకడం దుర్లభమైపోతోంది. విదేశీయుల పిల్లలకు సంస్కృతిపేరిట సీట్లేకాదు, పెద్ద పెద్ద అలవెన్సులుకూడా లభ్యమవుతున్నాయి.

ఢిల్లీలో కొన్ని పాఠశాలల్లోకి ప్రవేశం లభించాలంటే, "పగ్రీ" (లంచం) అవసరమవుతోంది. ఇది బహిరంగ రహస్యం. బేసిక్ విద్యావిధానంలోని లాభాలనుగూర్చి గంటల తరబడి ఉపన్యసించే మహామహులు తమ పిల్లలను యూరోపియన్ పాఠశాలలకు పంపిస్తారు. ఉపాధ్యాయులు డబ్బు సంపాదించే యంత్రాలుగా తయారయ్యారు. ఒక్కొక్కరు ఇరవైదాకా ట్యూషనులు చెబుతున్నారు. పుస్తకాల బెడద మరొకటి. స్వార్థపరుల లాభంకోసమని పాఠ్య పుస్తకాల్ని తరుచు మార్చేస్తూఉంటారు. పాఠశాలలో ప్రవేశించే అదృష్టం పట్టిన తరువాత విద్యార్థి ఏం నేర్చుకుంటున్నాడో అతీగతీ కనుక్కునే నాథుడు లేడు.

భారతదేశంలో విద్యావ్యాప్తికి విద్యాశాఖ చేసిన పనులట ఇవి:—

కలకత్తా ఆలీపూర్ వద్ద బెల్వెడీర్ లో జాతీయ గ్రంథాలయాన్ని 1953 ఫిబ్రవరి 1 వ తేదీన స్థాపిస్తూ మౌలానా అబుల్ కలాం ఆజాద్ మహాశయుడు ఇలా అన్నారు.

"కర్జన్ ప్రభువు రాజకీయ చర్యల

> "ఒరేయ్! తప్పు. అలా పిల్లితోక పట్టుకు లాగకూడదు."
>
> "నేను లాగటం లేదమ్మా. నేనూరికే తోకపట్టుకున్నానంతే. అదే లాగుతోంది."


మే 4 తేది
విడుదల
రాజశ్రీ వారి
జయం మనదే
నిర్మాత
సుందర్‌లాల్ నహాతా....
దర్శకుడు
టి.యస్. ప్రకాశరావు
BHARAT STUDIO

గూర్చి మనం ఏమనుకున్నప్పటికీ 1903 జన వరి 30 న ఇంపీరియల్ లైబ్రరీని ప్రారంభిస్తూ ఆయన చెప్పినమాటలు మనం స్మరించుకోవడం అవసరం.

"నేను కలకత్తా వచ్చినప్పుడు గ్రంథాలయం అని పిలవదగిన దొక్కటీ ఇక్కడ లేదు. నేను వెళ్ళిపోతూ ఇక్కడ ఒకటోరకం గ్రంథాలయాన్ని ప్రారంభించి మరీ వెళ్ళిపోతున్నాను. ఇది నాకెంతో గర్వ కారణం," అని కర్జన్ అన్నారు.'

ఎనిమిదేళ్ళ క్రిందట విద్యాశాఖ సింహాసనాన్ని మౌలానా ఆజాద్ అధిష్టించినప్పుడు కూడా న్యూఢిల్లీలో మంచి గ్రంథాలయం లేదు. భారతీయ గ్రంథాలయాల పట్టిక చూస్తే పబ్లిక్ లైబ్రరీలు మొత్తం 185 దేశంలో ఉన్నాయని తెలుస్తోంది. ఇందులో ఢిల్లీలో ఉన్నవి ఢిల్లీ పబ్లిక్ లైబ్రరీ, హార్డింజ్ లైబ్రరీ, మహావీర్ జైన్ లైబ్రరీ—ఈ మూడే. ఇందులో మొదటిదాన్ని ఐ రా. విద్యా, సాంఘిక, సాంస్కృతిక సంఘం ఏర్పాటు చేసింది. న్యూఢిల్లీకి గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయడంకోసం మౌలానా సంకల్పించిన విధానం ఈ దిగువ ఇవ్వబడింది.

ఈ దిగువ విషయాలు విద్యాశాఖ వార్షిక నివేదికనుండి, కేంద్ర బడ్జెట్ వివరణ నివేదిక సంగ్రహింపబడినవి. జాతీయ గ్రంథాలయానికి ఇవ్వబడిన ప్రాముఖ్యం ఏపాటిదో దీన్నిబట్టే తెలిసిపోతుంది:—

జాతీయ చిత్రవస్తు ప్రదర్శనశాల భవనం:- నేషనల్ మ్యూజియం భవనానికి 1955 మే 12 న భారతప్రధాని శంకుస్థాపన చేశారు. పని చురుగ్గా సాగుతోంది. 1956-57 సం॥ బడ్జెట్‌లో దీనికి 10 లక్షలు కేటాయించబడింది.

ప్రస్తుత సంవత్సరం 2½ లక్షలు కేటాయించగా 1956-57 సం॥ బడ్జెట్‌లో నేషనల్ మ్యూజియముకు 3 లక్షలు కేటాయించబడింది.

జాతీయ నాటకశాల భవనం:—అన్నింగులా ఉన్న జాతీయ నాటకశాలను ఢిల్లీలో స్థాపించాలని నిశ్చయింపబడింది. పాశ్చాత్యదేశాల్లో నాటకశాలలు, సంగీత నాటకశాలలు ఎలా ఉంటాయో చూసి, మన అవసరాలకు తగిన ఏర్పాట్లు ఏం చెయ్యాలో నివేదించడానికి ఇద్దరు శిల్పులను విదేశాలకు పంపడమైనది. వీరు తిరిగి వచ్చారు. కీరి నివేదిక ఇంకా అందలేదు.

నేషనల్ అకాడమీల భవనం:—క్వీన్ విక్టోరియా రోడ్డు కెదురుగా ఉన్న మూడు ఎకరాల స్థలంలో మూడు జాతీయ పరిషత్తుల భవనం నిర్మాణానికి నిశ్చయింపబడినది. 1956-57 బడ్జెట్ అంచనాలలో 6 లక్షలు ఇందుకు కేటాయింపబడినది.

సంగీత నాటక అకాడమీ :—ఈ అకాడమీ ప్రస్తుత సంవత్సర కార్యక్రమంలో నాట్య, నాటక, చలన చిత్ర, జానపద నాట్య, సంగీత కళలలో బహుమతులు ఇవ్వడం, జాతీయ నృత్యోత్సవం ఏర్పాటు చేయడం, చలనచిత్ర గోష్ఠి, నాటకగోష్ఠి, సంస్థలకు గ్రాంట్లు ఇవ్వడం ఉన్నాయి.

ప్రస్తుత సంవత్సరం 4,45,800 రూ. ఇవ్వగా 1956-57 సం॥ బడ్జెట్‌లో ఇందుకోసం 4,85,800 రూ. కేటాయింపబడింది.

సాహిత్య అకాడమీ :—ఈ అకాడమీ చేయదలచిన పను లివి: భారతీయ సాహిత్య సర్వస్వం ప్రచురణ; భారతీయ సాహిత్య కర్తల వివరాల ప్రచురణ; కాళిదాసు గ్రంథాల ప్రచురణ; వివిధ రచయితల రచనలలో కొన్నిటిని కలిపి సంపుటాలుగా ప్రచురించడం; ఒక భారతీయభాషనుండి మరొక భారతీయభాషలోకి పుస్తకాలను అనువదించడం; 1956 లో భారతీయ సాహిత్య ప్రదర్శనం ఏర్పాటు చేయడం; గడచిన మూడేళ్ళలో భారతీయభాషలలో ప్రచురింపబడిన ఉత్తమగ్రంథాలకు బహుమతులివ్వడం; ఐక్యరాజ్య, విద్యా, సాంఘిక, సాంస్కృతిక సంఘం వారు ప్రచురించే నిమిత్తము కొన్ని భాగాలను ఎన్ని ఇంగ్లీషులోకి అనువదింపజేయడం.

దీనికి 1956-57 సం॥ బడ్జెటులో ఇందుకు 8 లక్షల 30 వేల రూ. కేటాయించ బడింది.

లలితకళా అకాడమీ : ప్రస్తుత సంవత్సరంలో భారతదేశంలోను, విదేశాలలోను కళాప్రదర్శనలు ఏర్పాటు చేయడం, జానపద కళలను చేతిపనులను సమగ్రంగా పరిశోధించడం, కళా గ్రంథాలు ప్రచురించడం జరుగుతుంది. ఈ అకాడమీ ఇప్పటికే (1) మొగల్ కళ (2) సమకాలిక చిత్రకళ (3) 12 వర్ణచిత్రాలు ప్రచురించింది. 1956 ఫిబ్రవరిలో కళా విద్యాభ్యాసంపై గోష్ఠి ఏర్పాటు చేయబడింది.

1956-57 బడ్జెట్‌లో 2 లక్షల 86 వేల రూ॥ కేటాయించబడింది.

సాంస్కృతిక కార్యక్రమాలు:- ఇతర దేశాలతో సాంస్కృతికసంబంధాలను అభివృద్ధి చేయడంకోసం, పరస్పర సుహృద్భావం అభివృద్ధి చేయడంకోసం సాంస్కృతిక కార్యక్రమాల నిమిత్తం భారత ప్రభుత్వం 15 లక్షల రూ॥ కేటాయించింది. ఇతరదేశాలలో కళాప్రదర్శనలు ఏర్పాటు చేయడం, ఇతర దేశాలలో విద్యా, సాంస్కృతిక పరిషత్తులకు గ్రాంట్లు ఇవ్వడం, అంతర్జాతీయ సభాదేశాలలో పాల్గొనడం, విద్యార్థులను, పండితులను, ఉపాధ్యాయులను పంపించడం, రప్పించడం, గ్రంథాలను తెప్పించడం, పంపించడం, ఇతర దేశాలకు వెళ్ళగోరే వర్తకులకు, గాయకులకు కళాకారులకు సహాయం చేయడం, ఇతరదేశాలకు పుస్తకాలు బహూకరించడం, ఆటల జట్టులను ఇతర దేశాలకు పంపడం, ఇతరదేశాల జట్టులను రప్పించడం, సంచార గ్రంథాలయాలను ఏర్పరచడం, ఇతర దేశాలకు చిత్రనిర్మాణ బృందాలను పంపడం, హిందీవ్యాప్తి మొదలైనవి యీ కార్యక్రమంలో అంశాలు.

ఇందుకోసం 1956-57 బడ్జెట్‌లో 15 లక్షలు కేటాయించబడింది.

సాంస్కృతిక రాయబారాలు : పై ఆశయాలు నెరవేర్చేందుకు ఇతర దేశాలకు సాంస్కృతిక ప్రతినిధివర్గాలను పంపించడంకోసం, విదేశీయులను రప్పించడంకోసం 10 లక్షల రూ॥ ప్రత్యేకంగా కేటాయింపబడింది.

1956-57 సం॥ బడ్జెట్‌లో 10 లక్షల రూ॥ కేటాయింపబడింది.

కేంద్ర పరిశీలన గ్రంథాలయం : దీన్ని న్యూఢిల్లీలో స్థాపించేందుకు మొదటి పంచవర్ష ప్రణాళికలో 25 లక్షలు కేటాయింపబడింది. అంచనాలు ఇప్పుడు తయారయినాయి. వీటినిబట్టి భవనానికి 40 లక్షల రూ॥ అవుతుందని అంచనా వేయబడింది. 1956-57 బడ్జెట్‌లో గ్రంథాలయ భవనానికి 5 లక్షల రూ॥ కేటాయించబడింది.

ఈ గ్రంథాలయం దేశానికంతకూ ప్రధానమైన జాతీయగ్రంథాలయంగా పనికివస్తుంది. గ్రంథాలయ కార్యక్రమాన్ని జాతీయ స్థాయిలో సమన్వయం చేయడానికి ఇది కృషిచేస్తుంది. జాతీయ సర్వస్వబృందం (దీనికి ఏటా లక్ష రూ. అవుతుంది) ఇప్పుడు ప్రారంభమైంది. ఇది ప్రస్తుతానికి కలకత్తా

(56 పేజీ చూడండి)

ఉపాధ్యాయుడు : అన్నీ తప్పులే! నాలుగు లెక్కలు వేసుకురమ్మంటే ఇన్నితప్పులు చేసినవాణ్ణి నిన్నొక్కణ్ణే చూశాను.

శిష్యుడు : అదికాదండి. లెక్కలు నేనొక్కణ్ణే చెయ్యలేదు. మా నాన్న తరవాత మావయ్య కూడా సాయం చేశారండి.

డిటెక్టివ్ సీరియల్

మూలం: ఎడ్గార్ వాలెస్

అరుణ వలయం

అనువాదం: "ప్రద్యుమ్న"

3. జాక్ ప్రేయసి థాలియా

జాక్ బియర్డ్ మోర్ ఉదయభోజనం అయిన తరవాత పచ్చిక బయలులో బరువెక్కిన హృదయంతో మెల్లిగా నడుస్తున్నాడు. తమ ఇంటికి సుమారొక మైలు దూరంలో ఉన్న చిన్న లోయకేసి అతడు అప్రయత్నంగా నడిచిపోతున్నాడు. లోయ మధ్యలో బియర్డ్ మోర్ భూములకు, బ్రాయంట్ భూములకు సరిహద్దుగా పొదల కంచె ఉన్నది. ఆ ఉదయసమయం చాలా ఆహ్లాదకరంగా ఉన్నది. క్రిందటిరాత్రి కురిసిన వర్షానికి, గాలికి మైదానమంతా కడిగేసినట్టు శుభ్రంగా కనిపిస్తోంది. లోకమంతా సూర్యకాంతిలో స్నానం చేస్తున్నట్టుంది. దూరాన హార్వే బ్రాయంట్ పెద్ద భవనం తెల్లగా తళతళలాడుతూ కనిపించింది రాత్రి కురిసిన వానకి నేల బురద అయింది. పచ్చిక అంతా తడిసిపోయింది. కలుసుకుంటప్పుడు ఆమె బయటికి వస్తుందా అని జాక్ సంశయించాడు.

కంచెదాకా వెళ్ళి చూచాడు. కనుచూపు మేరలో ఎవరూ కనిపించలేదు. నిరుత్సాహపడ్డాడు. కంచెలో ఒకచోట అతడు కొంత భాగం తొలగించి అదివరకే దారిచేసుకున్నాడు. ఒక పది నిమిషాల్లో అక్కడికి చేరుకున్నాడు. అక్కడికి దగ్గర్లోనే హార్వే బ్రాయంట్ పూర్వీకులు కట్టించిన వేసవి గృహం ఉన్నది. కంచెదాటి లోపలికి వెళ్ళాడు.

అతని అలికిడికి ఆమె వెనుదిరిగిచూసింది. విసుక్కుంటూ లేచింది.

ఆమె చాలా అందంగా ఉంది. అలలు అలలుగా కేశాలు నిగనిగమెరుస్తున్నాయి మచ్చుకైనా మచ్చ కనిపించని నవనీతశరీరం కేవలం పోతపోసినట్లుంది. అతని కేసి నడిచి వచ్చిందిగాని, అతన్ని చూసి సంతోషపడిన సూచనలేమీ ఆమె ముఖంలో కానరాలేదు.

"ఓ, నువ్వా?" అన్నది ముభావంగా.

"ఆ, నేనే, థాలియా!" అన్నాడు జాక్.

"ఎందుకొచ్చావు?" అన్నదామె. ఆమె విసుక్కుంటున్నట్లు అతడు గ్రహించాడు. తనమీద ఆమెకింత విముఖత ఎందుకో అతని కర్థంకాలేదు. ఆమెలో జీవనోత్సాహం పొంగి పొరలుతోంది. ఒకసారి ఆమె పొలంలో ఒక కుందేలును తరుముతుండగా అతడు చూశాడు. ఆమె చిన్న సుకుమార పాదాలు గాలిలో తేలిపోతున్నట్లు పచ్చిక మీద వాలీవాలకుండా పరుగెత్తాయి ఆమె పాట పాడుకోవడంకూడా అతడువిన్నాడు. ఆమె కంఠస్వరంలోకూడా జీవనసంతోషం పెల్లుబికింది. కాని తనను చూడగానే ఆమె ముఖంలో ఎందుకింత నిరుత్సాహం ప్రవేశించింది? ఒకవేళ అస్వస్థతగా ఉన్నదేమో!

"నన్ను చూడగానే ఎందుకిలా దిగులు ముఖం పెడతావు?" అన్నాడు జాక్.

"ఎందుకంటే నేను పుస్తకాలు చదివాను. నాకు తెలుసు. ఏదో ఉద్యోగం చేసి పొట్టపోసుకునే యువతులు నీలాంటి లక్షాధికారుల కొడుకులతో చనువుగా ప్రవర్తిస్తే కథ విషాదాంతం అవుతుంది"

ఆమె ఎప్పుడు మాట్లాడినా సూటిగా, ఉన్నదున్నట్లు చెప్పేస్తుంది.

"అదీగాక, నీతో అంత చనువుగా ఎందుకుండాలి? ఇష్టంలేనివాళ్ళతో ఎవరూ చనువుగా వుండరు. నువ్వంటే, నాకు పెద్ద ఇష్టమేమీ లేదు," అనికూడా ఆమె కుండబద్దలుకొట్టినట్టు చెప్పింది.

యువకుని ముఖం సిగ్గుతో ఎర్రబడింది.

"మిస్టర్ బియర్డ్ మోర్! నీకు మరో విషయం చెపుతాను విను. ఎవ్వరూలేని నిర్జనమైన ఎడారిద్వీపంలో ఒక యువకుడూ, యువతీ నివసిస్తున్నారనుకో యువకుడు,ఆ యువతి తప్ప ప్రపంచంలో మరో యువతే లేదనిసహజంగాభావిస్తాడు. అతనిదృష్టిలో, ఆలోచనలూ ఆమెమీదే కేంద్రీకరిస్తాడు. రోజులు గడుస్తున్న కొద్దీ అతని దృష్టిలో ఆమె మరింత ఆకర్షవంతంగా, అత్యద్భుతంగా కనబడుతుంది. ఈ మాదిరి ఎడారిద్వీపాల కథలు నేను చాలా చదివాను; అలాటి చిత్రాలు చాలా చూశాను. అందుచేత నాకీసంగతి బాగా తెలుసు. నువ్వు అలాంటి ఎడారిద్వీపంలో ఉన్నావు—ఎప్పుడూ ఈ గ్రామంలోనే ఉంటావు. నీకు కనిపించేవల్లా కుందేళ్ళు,పక్షులూ,థాలియాడ్రమండ్-ఇంతే. నువ్వు పట్నానికి పోయి, నీ అంతస్తుకు తగిన వాళ్ళతో తిరగడం మంచిది."

ఆమె యజమాని బ్రాయంట్ వారికేసే వస్తున్నాడు. అతనిరాకను పక్కవాటుగా గమనించింది. యజమానికి కొంచెం కోపం వచ్చిందనికూడా ఆమె గమనించింది.

"జమాఖర్చులు సరిచూస్తున్నావనుకున్నాను. మిస్ డ్రమండ్! ఇదా నువ్వు చేసే పని?" అన్నాడు బ్రాయంట్.

యాభైయేళ్లు పైబడిన మనిషి. బట్టతల. కొంచెం బక్కగా ఉన్నాడు. ఏదన్నా ప్రశ్న అడిగి సమాధానంకోసం ఎదురుచూస్తూ పచ్చటి పొరపళ్లు బయటపెట్టడం అతని అలవాటు.

"హలో, నువ్వా బియర్డ్ మోర్!" అని అయిష్టంగా పలకరించి, తన సెక్రెటరీకేసి తిరిగాడు.

"మిస్ డ్రమండ్! నువ్వు ఊరికే పనిపాటా లేకుండా కబుర్లు చెబుతున్నావన్నమాట!" అన్నాడు బ్రాయంట్.

"నేనేం కబుర్లు చెప్పడంలేదు మిస్టర్ బ్రాయంట్! పద్దులుచూడటం అయిపోయింది." అంటూ పద్దు పుస్తకం చూపించింది.

"నా ఆఫీసుగదిలో పద్దులు చూడడానికి గాను నేనుంచుకుంటాను దానికోసం ఇంతదూరం రానవసరంలేదు," అంటూ చుఱుక్కున నలుపుకుని యువతిని, మౌనం వహించిన యువకుణ్ణి పరిశీలనగా చూశాడు.

"సరే, మంచిది. బియర్డ్ మోర్! నేను మీ యింటికి వెడుతున్నాను. మీ తండ్రిగారితో మాట్లాడాలి. నాతో వస్తావా?"

థాలియా డ్రమండ్ అప్పటికే పెద్దఇంటి వైపు తిరిగి నడుస్తోంది. అందుచేత జాక్ తానింక అక్కడ తచ్చాడవలసిన పని లేదనుకున్నాడు.

ఫ్రాయంట్‌కు ఘాటుగా ఏదన్నా సమాధానం ఇద్దామనుకున్నాడు. కాని ఎందుకులే అని ఊరుకున్నాడు. హార్వే ఫ్రాయంట్ మీద మొదటినుంచి అతనికి సదభిప్రాయం లేదు. అందులో తన ప్రియురాలిపై అధికంగా అధికారం చెలాయించడం అతనికి మరీ కష్టం కలిగించింది.

కంచె వెంబడే గేటువైపు నడుస్తూ ఫ్రాయంట్ "ఈ భూపతు అమ్మాయిలున్నారే, వీళ్ళు" అంటూ మొదలు పెట్టాడు. ఇంతలో చటుక్కున ఆగి "అరె, ఈ కంచె ఎవరిలా పాడుచేసింది?" అని క్రతో దాపిస్తూ అరిచాడు.

"నేనే" అని జాక్ నెమ్మదిగా సమాధానమిచ్చాడు. "ఈ కంచె మాది. అన్ని మైలు దూరం చుట్టు తిరిగి రావడం ఎందుకని నేనే ఇక్కడ దారి చేసుకున్నాను. రండి, రండి."

హార్వే ఫ్రాయంట్ మారుమాట్లాడకుండా కంచెలోనుంచి దూరి ఇవతలికి వచ్చాడు.

లోయగట్టుమీదికి ఎక్కారు. కొంత దూరం మౌనంగా నడిచారు. జాక్ హఠాత్తుగా నిలిచిపోయి, ఫ్రాయంట్‌ను చెయ్యి పట్టుకుని ఆపాడు. జాక్ చూస్తున్న వంకే ఫ్రాయంట్ కూడా చూశాడు. వారి ఎదురుగా ఉన్న వృక్షకాండంమీద భయంకరమైన అరుణవలయం కనిపించింది. దానిమీద ఇంకా తడి ఆరలేదు. అది చూసీ చూడగానే ఫ్రాయంట్ మొహం తెల్లగా పాలిపోయింది.

4

ఫెలిక్స్ మార్ష్

జాక్ ఓయస్టర్ మోర్ చుట్టూ కనిపించినంత మేరా కలయ చూశాడు. దూరాన ఎవరో ఒక వ్యక్తి చేతిలో ఒక సంచీ పట్టుకునిపోతున్నాడు. జాక్ అతన్ని కేకేశాడు. ఆ వ్యక్తి వెనక్కి తిరిగాడు.

"ఎవరు నువ్వు? ఏం చేస్తున్నావిక్కడ?" అని జాక్ గద్దించాడు.

ఆ అపరిచిత వ్యక్తి పొడుగ్గా, లావుగా ఉన్నాడు. సంచీ బరువుగా ఉన్నదేమో కొద్దిగా ఆయాసపడుతున్నాడు. అందుచేత వెంటనే సమాధానమివ్వలేకపోయాడు.

"నా పేరు మార్ష్. ఫెలిక్స్ మార్ష్. నా పేరు నువ్వు విని ఉంటావు. నువ్వు జేమ్స్ ఓయస్టర్ మోర్ గారి అబ్బాయివి కదూ?" అని కొత్త వ్యక్తి అడిగాడు.

"అవును. మీ రిక్కడేం చేస్తున్నారు?"

"రైలుస్టేషనునుంచి వస్తున్నాను. ఇది అడ్డదారి అని చెప్పారు. కాని ఇది అనుకున్నంత దగ్గరదోవ కానట్లున్నది. మీ

★ అరుణవలయం ★

నాన్నగారిని చూడడానికే వెడుతున్నాను," అన్నాడు కొత్త వ్యక్తి.

"ఆ చెట్టుదగ్గిరికి వెళ్ళారా మీరు" అని జాక్ ప్రశ్నించాడు.

"అక్కడ నాకేంపని? నేను పొలాల కడ్డంపడి వస్తున్నాను,"అని అతడు కొంచెం కోపంగా అన్నాడు.

ఈ లోగా హార్వే ఫ్రాయంట్ వారిని సమీపించాడు. అతడు కొత్తవ్యక్తిని గుర్తుపట్టాడు.

"ఓహో, మార్! ఆ చెట్టుదగ్గిర ఎవర్నయినా చూశావా?"

మార్ల్ లేదన్నట్లు తలతిప్పాడు. ఆ చెట్టు రహస్యం అతనికి అర్థం కానట్లే ఉంది.

"అక్కడొక చెట్టున్నట్లే నేను చూడలేదే! ఏం జరిగింది?" అని మార్ల్ ప్రశ్నించాడు.

"ఏమీ లేదు" అని హార్వే ఫ్రాయంట్ ముక్తసరిగా జవాబిచ్చాడు.

బియర్డ్ మోర్‌ల ఇంటికి వచ్చారు. కొత్త వ్యక్తి సంచీని జాక్ పట్టుకున్నాడు. కొత్త వ్యక్తిమీద జాక్‌కి సదభిప్రాయం కలగలేదు. అతని కంఠం కర్కశంగా, మాట్లాడే తీరు కొంచెం వికిలిగా, అతిచనువు తీసుకుంటున్నట్లుగాఉంది. ఈ వెకిలిమనిషితో తన తండ్రికి పనేముంటుందా అని జాక్ ఆశ్చర్యపడ్డాడు.

ఇల్లు సమీపిస్తున్నారు. ఇంతలో అకస్మాత్తుగా, దాదాపు అకారణంగా ఫెలిక్స్ మార్ల్ భయకంపితస్వరంతో కెవ్వుమని వెనక్కి అడుగువేశాడు. మనిషి నిలువునా కంపిస్తున్నాడు. జాక్ అదిరిపడి చూశాడు. ఫ్రాయంట్ ఉలికిపడి "ఏం జరిగింది? ఎందుకల్లా భయపడ్డావ్?" అని అడిగాడు.

"ఏం...ఏం లేదు. నేను...నేను..."

"బాగా తప్పతాగి వచ్చినట్లున్నావు?" అని హార్వే ఫ్రాయంట్ వెటకారంగా అన్నాడు.

ఫెలిక్స్‌మార్ల్‌ను ఇంట్లోకి పంపించి జాక్ డిటెక్టివ్ యేల్ కోసం వెదికాడు. తోటలో పొదలదగ్గిర పేముకుర్చీలో చేతులుకట్టుకుని కూర్చున్నాడు యేల్.

యువకుని అడుగుల సడికి యేల్ తలెత్తి చూశాడు.

"ఉహు, నాకు తెలియదు." జాక్ అడగబోయే ప్రశ్న జాక్ నోట్లో ఉండగానే యేల్ అన్నాడు. జాక్ ఆశ్చర్యార్థకంలాగా మొహంపెట్టడం చూసి నవ్వాడు. "మార్ల్ ఎందుకు భయపడ్డాడనికదూ నువ్వడగదలచింది?" అన్నాడు.

"అవును. ఎంత చిత్రమైన మనుషులండీ మీరు! మీరు చూశారా అతను భయపడడం?"

యేల్ తలఊపాడు. "సరిగ్గా అతడు కెవ్వుమనేముందే చూశాను. మీరు వచ్చిన దారి ఇక్కడినించి బాగా కనిపిస్తుంది" అంటూ ముఖం చిట్లించాడు. "అతన్ని చూస్తే ఎవరో జ్ఞాపకంవస్తున్నారు. ఎవరైందీ సరిగా చెప్పలేను. ఇక్కడికతను తరుచు వస్తూంటాడా? మీ తండ్రిగారు అతడు వస్తున్నాడని ఇందాక చెప్పారు. అతడే ఇతడని నేనూహించాను."

"నేనితన్ని ఇదే మొదటిసారిగా చూడడం. ఇప్పుడు జ్ఞాపకమొస్తోంది. మా నాన్నగారికి, ఫ్రాయంట్‌కీ మార్ల్ అనే వ్యక్తితో ఏదో వ్యాపారసంబంధం ఉన్నది. ఈ మార్ల్ భూములవ్యాపారి అనుకుంటాను. మా నాన్నగారికి ప్రస్తుతం భూములపిచ్చి పట్టుకుంది. అన్నట్లు అరుణ వలయం మళ్ళీ కనిపించింది," అని తను చెట్టుమీద చూసిన ఎర్రని వలయం వైనమంతా చెప్పాడు.

యేల్ కొత్తవ్యక్తి సంగతి మరిచిపోయి, శ్రద్ధగా వింటున్నాడు.

"నేను లోయవైపు వెడుతున్నప్పుడు అది లేదు. నేను ఫ్రాయంట్ ఇంటి సమీపానికి వెళ్ళిన సమయంలోనే దాన్నెవరో అక్కడ ముద్రకొట్టి ఉంటారు. నేను నా స్నేహితురాలితో మాట్లాడుతున్న చోటికి ఆ చెట్టు కనిపించదు. అందుచేత ఎవరూ చూడకుండా ఆముద్ర కొట్టడానికి వీలుంది. మిస్టర్ యేల్! ఆ వలయం అక్కడెందుకు వేశారంటారు?"

"ఏదో ప్రమాదసూచకమే!" అన్నాడు యేల్.

లేచి అటూ ఇటూ తిరుగుతూ ఆలోచిస్తున్నాడు డిటెక్టివ్ యేల్. కొంతసేపు చూసి, జాక్ ఇంట్లోకి వచ్చేశాడు.

ఫెలిక్స్‌మార్ల్‌కి ఇందాక తగిలిన భయాఘాతం ఇంకాపోలేదు. అతను భూముల వ్యాపారి. క్రయవిక్రయాలకు సంబంధించిన చర్చలకోసం వచ్చాడు. కాని ఎంత తంటాలు పడినా అతను చెప్పదలచిందేదో చెప్పలేకపోతున్నాడు.

"ఏమిటో, నాకే తెలియకుండా ఉంది. చెప్పలేకపోతున్నాను. ఇవ్వాళ నాకు మనస్సేమీ బాగాలేదు," అన్నాడు మార్ల్.

"ఏం?"

మార్ల్ కారణం చెప్పలేకపోతున్నాడు.

ఇవ్వాళ నేనేమీ చెప్పలేను. రేపటికి వాయిదా వేద్దాం."

ఫ్రాయంట్ గుర్రుమన్నాడు.

"ఈ మాట వింటానికే వనున్నావా నేనివ్వాళ పనులన్నీ చెడగొట్టుకునివచ్చింది. మిస్టర్ మార్ల్! ఇవ్వాళ మన వ్యవహారం ఫైసలయిపోవల్సిందే. మీరేమంటారు మిస్టర్ బియర్డ్ మోర్!"

జేమ్స్ బియర్డ్ మోర్ వ్యవహారం ఇప్పుడు ఫైసలయినా, ఇంకో వారం తరవాత ఫైసలయినా లక్ష్యంలేనట్లు నవ్వాడు.

"మార్ల్‌కు మనసు బాగా లేనప్పుడు మనమెందుకు అతన్ని ఇబ్బంది పెట్టడం? ఈరాత్రికి ఇక్కడే ఉండిపోరాదా మిస్టర్ మార్ల్!" అని జేమ్స్ బియర్డ్ మోర్ అడిగాడు.

"అబ్బే. నేనిక్కడ ఉండను. ఎంతమాత్రం ఉండను," అని పిచ్చిగా అరుస్తున్నట్లు మాట్లాడాడు మార్ల్.

"సరే నీ ఇష్టం" అని బియర్డ్ మోర్ నిర్లక్ష్యంగా అని దస్కతులకోసం తీసిన కాగితాలన్నీ మళ్ళీ మడిచిపెట్టాడు.

ముగ్గురూ లేచి హాల్లోకి వెళ్లారు. అక్కడ జాక్ ఉన్నాడు.

ఫెలిక్స్ మార్ల్ బియర్డ్ మోర్ కారులోనే స్టేషనుకు వెళ్ళాడు. స్టేషనుకు వెళ్ళిన తరువాత మార్ల్ చిత్రంగా ప్రవర్తించాడు. తన సంచీని లండనుకు రిజిస్టరుచేసి పడేశాడు. తానుమాత్రం పక్కస్టేషనులో దిగిపోయాడు. నడిక అతని కేమాత్రం పడదు. అయినా, లేని ఉత్సాహం తెచ్చుకుని తొమ్మిదిమైళ్ళ దూరంలో ఉన్న బియర్డ్ మోర్ ఎస్టేటుకు నడకసాగించాడు. ఈ సారి అడ్డదారినికూడా నడవలేదు. మామూలు రోడ్డునే వచ్చాడు.

బియర్డ్ మోర్ ఎస్టేటుపొలిమేరవద్ద ఉన్న చిట్టడవిని సమీపించేసరికి చీకటి పడింది. బాగా పొద్దుపోయి, సద్దుమణిగేవరకూ అతడు ఒకచోట దాక్కున్నాడు. అప్పుడప్పుడు తనతో తెచ్చుకున్న పిస్తోలు బయటికి తీసి చూస్తూ చాలాసేపు గడిపాడు.

5. పరుగెత్తిన యువతి

"ఆ పెద్దమనిషి ఇంకా రాలేదేమిటో? అని జేమ్స్ బియర్డ్‌మోర్ విసుగుదలనూచించే కంఠంతో గొణిగాడు.

"ఎవరు?" అని జాక్ నిర్లక్ష్యంగా అడిగాడు.

"అతనే, ఫెలిక్స్ మార్ల్."

"నిన్న మీ ఇంటికి వచ్చిన లావాటి మనిషేనా?" అని డెరిక్ యేల్ ప్రశ్నించాడు.

ముగ్గురూ డాబామీద పిట్టగోడవద్ద నుంచున్నారు. అక్కడినించి చుట్టుప్రక్కల చాలా దూరందాకా స్పష్టంగా కనిపిస్తుంది.

ఆ ఉదయం వచ్చే రైలు రావడం, పోవడం కూడా జరిగింది. రైలు తొమ్మిదిమైళ్ళ అవతల ఉన్న కొండలచాటుకు వెళ్ళిపోతోంది. అది వదిలిపెట్టిన తెల్లని ధూమరేఖమాత్రం ఇంకా అలాగే కనిపిస్తోంది.

"అవును. అతనే. ఫ్రాయంట్‌కు ఫోను చేసి మార్ల్ రాలేదు కనుక అతడు రానక్కర్లేదని చెబుతాను" అన్నాడు జేమ్స్ బియర్డ్‌మోర్.

గడ్డం నిమురుకుంటూ మళ్ళీ ఇలా అన్నాడు:

"మార్ల్ ప్రవర్తన చిత్రంగావుంది. మంచి తెలివైనవాడు. ఇదివరకు దొంగతనాలు చేసేవాడు. ఇప్పుడు బాగుపడ్డాడనుకుంటాను. కాని నిన్న ఎందుకలా భయపడ్డాడో తెలియలేదు. సాగడిలోకి అతడు వస్తుంటే చూశాను. మొహం దప్పగా పాలిపోయింది. నీకు తెలుసా జాక్?"

"నాకూ తెలియదు," అన్నాడు జాక్. "బహుశా గుండెజబ్బేమో. ఇలా అప్పుడప్పుడు జరుగుతూ ఉంటుందని అతనే చెప్పాడు."

జేమ్స్ బియర్డ్‌మోర్ మెల్లిగా నవ్వుకున్నాడు. ఇంట్లోకి వెళ్ళి చేతికర్ర తెచ్చుకున్నాడు.

"నేనలా షికారుపోయి వస్తాను. ఊహూ. నువ్వు రానక్కర్లేదు. కొంచెం తాపీగా, ఒంటరిగా ఆలోచించుకోవలిసినవి ఉన్నాయి. మిస్టర్ యేల్! మీరేమీ కంగారు పడవద్దు. నేను నా ఎస్టేటు దాటి అవతలికి వెళ్ళను. అయినా ఈ కాడీల బెదిరింపుకు మీరెందుకింత ప్రాముఖ్యం ఇస్తున్నారో?"

యేల్ అసమ్మతిసూచకంగా తలఊపి "చెట్టుమీద అరుణవలయం సంగతి మరిచిపోయారా?" అన్నాడు.

జేమ్స్ బియర్డ్‌మోర్ నిర్లక్ష్యంగా నవ్వి, "ఈ వలయాలకీ గిలయాలకీ భయపడి నేను డబ్బు వదులుకుంటాననుకున్నారా?" అని సమాధానమిచ్చాడు.

వీడ్కోలు సూచనగా చేయి ఊపి, జేమ్స్ తోట దాటి నడవసాగాడు.

"మా నాన్నగారికి నిజంగా ప్రమాదం ఉందంటారా? అని ప్రశ్నించాడు జాక్.

జేమ్స్ వెళ్ళినవైపే చూస్తూ నిలబడిన యేల్ కొంతసేపటికి దృష్టి మళ్ళించుకుని "ప్రమాదమా? అవును. ఒకటి, రెండు రోజుల్లో ఆయన కేదన్నా ప్రమాదం సంభవిస్తే సంభవించవచ్చును," అన్నాడు.

దూరాన అంతర్ధానమవుతున్న తండ్రికేసే రెప్ప వాల్చకుండా చూస్తున్నాడు జాక్. కొంతసేపాగి "మరి మా నాన్నగారు మీరు మీరు భయపడినంతగా అదుర్దాపడటం లేదే," అన్నాడు.

"మీ తండ్రికి ఇలాంటి వాటిలో బొత్తిగా అనుభవం లేదు. ఆయన చీఫ్ ఇన్స్పెక్టరు పార్‌ను కలుసుకున్నారట. ప్రమాదం ఉన్నదనే పార్ కూడా చెప్పాడట."

"పోలీసుశాఖకి మీలాంటి ప్రైవేటు డిటెక్టివ్‌లు పనికిరారేమో?" అన్నాడు జాక్.

"పార్ అంటే నాకు చాలా గౌరవం ఉంది," నెమ్మదిగా మొదలుపెట్టాడు యేల్. "పార్ కొంచెం నెమ్మదస్తుడు. తాపీగా పనిచేస్తాడుగాని, దమ్ములేకుండా చేస్తాడు. పోలీసుశాఖలో ఉన్నవాళ్ళలోకల్లా అతనొక్కడే కాస్త నిజాయితీగా పనిచేస్తాడని విన్నాను. కిందటిసారి జరిగిన అరుణవలయం నేరం సందర్భంలో అతన్నిపై అధికారులు బాగా చివాట్లు వేశారట. అరుణవలయం ముఠాని పట్టుకోలేకపోతే రాజీనామా ఇచ్చెయ్యవలసి వుంటుందని చెప్పారట."

వీరిద్దరూ ఇలా మాట్లాడుకుంటుండగా జేమ్స్ బియర్డ్‌మోర్ ఆకృతి చెట్లమధ్య చీకటిలో కలిసిపోయింది. అది గమనిస్తూ డెరిక్ యేల్ తిరిగి చెప్పసాగాడు: "కిందటిసారి హత్యకేసులో నేను పార్‌తో కలిసి పని చేశాను. నా ఉద్దేశం......"

హఠాత్తుగా ఆపివేశాడు. ఇద్దరూ ఒకరొకర్ని చూసుకున్నారు.

సందేహంలేదు. స్పష్టంగా వినిపించింది పిస్తోలు శబ్దం. అడవివైపునుంచి ధ్వని వినిపించింది. వెంటనే జాక్ గబగబ కిందికి దూకి అడవికేసి పరిగెత్తాడు. అతని వెనుక డెరిక్ యేల్ పరిగెత్తాడు.

అడవిలో ఇరవై అడుగులు వేసేసరికి మార్గమధ్యంలోనే జేమ్స్ బియర్డ్‌మోర్ శవం కనబడింది. బోర్లగిలా పడిఉన్నాడు. జాక్ భయభ్రాంతుడై తండ్రికేసి చూస్తున్నాడు. అదే సమయంలో అడవి అవతలికొసను ఒక యువతి పొదలచాటునుండి బయటికి వచ్చింది. ఆమె చేతిమీద ఏదో ఎర్రగా ఉన్నది. పచ్చికతో చేతులు తుడుచుకున్నది. తరవాత అతి త్వరితంగా సరిహద్దు కంచె దాటి ఫ్రాయంట్ గృహంకేసి పరుగెత్తింది. అసలు గృహానికి దూరంగా ఉన్న చిన్నయింటిని చేరేవరకూ ఆమె వెనుదిరిగి చూడకుండా పరిగెత్తింది. ఒకక్షణం గుమ్మంలో ఆలోచిస్తూ నిలబడింది. అడవివైపు ఒకసారి చూసింది. వెంటనే ఇంట్లో ప్రవేశించి నేలమీద బల్లచెక్క ఒకటి పెరికివేసింది. ఒక చిన్న రంధ్రం ఏర్పడింది. మరొక క్షణం సందేహించింది. తరవాత చేతిలో ఇంతసేపూ పట్టుకున్న రివాల్వరును ఆ రంధ్రంలో పడవేసింది. దానిమీద చెక్కను యథాప్రకారంగా అమర్చి నొక్కివేసింది.

(ఇంకా ఉంది)

రాజమాత

౧

మహాభారత సంగ్రామం సమాప్తమైపోయిన పిమ్మట ౧౫ సంవత్సరాల పర్యంతము గాంధారీ ధృతరాష్ట్రు లిద్దరు ధర్మరాజసన్నిధినే ఉండిపోయారు. ధర్మరాజు అంధదంపతు లిద్దరికీ ఏవిధమైనలోపము రానీయకుండా క్షణక్షణము కంటికి రెప్పలా కాపాడుతూండేవాడు. అంతేగాక అనుక్షణము వారి కనుసన్నలలోనే మెలగుతూ కుమారులు లేకపోయారే అనే భావముకూడా వారిమనస్సులలో పొడసూపనీయలేదు. ధృతరాష్ట్ర మహీపతి అభ్యనుజ్ఞ లేనిదే తానై స్వయంగా ఏ రాజ్యకార్యము నిర్వహించలేదు. సామ్రాజ్యాధికారభారం ధర్మరాజు భుజస్కంధాలపైనే నిలిచినా హస్తినాపుర పౌరజానపదులందరు ధృతరాష్ట్రుడే రాజ్యరక్షణ భారం వహిస్తున్నాడని భావించేవారట! ఆ ౧౫ సంవత్సరాలు ధర్మరాజు ఈవిధంగా మసలుకుంటూ అనేకవిధాలుగా గాంధారీధృతరాష్ట్రుల మన్ననలకు పాత్రుడైనాడు. ఇక కుంతీదేవి, ద్రౌపదీదేవి మొదలయినవా స్త్రీజనంకూడా గాంధారీ ధృతరాష్ట్రుల కిద్దరికీ రాత్రింబగళ్ళేమరకుండా పరిచర్యలు చేస్తూ వేయివిధాలుగా వారిని కనిపెట్టిచూచారు.

మిగిలిన పాండవులందరు ధర్మరాజు అభీష్టప్రకారమే ప్రవర్తిస్తూ గాంధారీ ధృతరాష్ట్రుల మనస్సు నొవ్వకుండా వారియెడల భయభక్తులతో మెలగుతూ ఉండేవారు. అయితే ఈ విషయంలో భీమసేనుని పంథా మాత్రం బాగా మారిపోయింది.

అతడు ధృతరాష్ట్రునికి వినబడీ వినబడనట్లుగా దూరదూరంగా నిలబడి సూటీపోటీ మాటలెన్నో విసురుతూండేవాడు. ఒకనాడు 'ఆహా ఈ భుజద్వయంవల్లకదా! దుర్యోధనాదిదుష్టులందరు నిర్ధూమధామమైయారు!' అని తన భుజబలాన్ని కొంతైనా మరిచిపోయాడు! ఈ మాటలు కఠోరంగా ధృతరాష్ట్రుని శ్రవణాలలో పడ్డాయి. ఇంకా ఇలాంటివే ఎన్నెన్నో సూటీపోటీమాటలు అంధనృపతిదాకా వెళ్ళిపోయాయి. పాపం ధృతరాష్ట్రుడా ఎత్తిపొడుపు మాటలు భరించలేక లోలోపల ఎంతైనా కుమిలి కృశించిపోయేవాడు.

ఒకనాడతనికి హస్తినాపురం విడిచి వనవాసానికి వెళ్ళిపోవాలనీ ఇక ఆయుశ్శేషం అంతా అరణ్యవాసంలోనే గడపివెయ్యాలనీ సంకల్పం కలిగింది.

పిమ్మట ఒకనాడు ధర్మజునికి తన సంకల్పం తెలియజేశాడు. ధర్మరాజెంతమాత్రము దాని కంగీకరించలేదు. కాని అటు పిమ్మట కొంతకాలానికి హస్తినాపురం సందర్శించిన వ్యాసమహర్షి గాంధారీ ధృతరాష్ట్రులకిక అరణ్యవాసమే సముచిత ధర్మమని ఆదేశించాడు. వ్యాసమహర్షి ఆదేశించినపిమ్మట ధర్మరాజుకూడా వారి వనవాసాని కంగీకరింప తప్పలేదు.

ప్రాచీన గాథాలహరి

అనంతరం ధృతరాష్ట్రునికి యుద్ధంలో మృతులయిన భారతవీరులందరికీ తిరిగీ ఒకసారి యథావిధిగా పైతృక కర్మలాచరించి అటుపిమ్మట గాంధారీదేవితో కలసి వనవాసానికి వెళ్ళిపోవాలనే సంకల్పం కలిగింది. వెంటనే విదురునికి తన సంకల్పం తెలియజేశాడు. విదురుడు ధర్మరాజసన్నిధికి వెళ్ళి ఆయనకు ధృతరాష్ట్రుని సంకల్పం ఎరుకపరిచాడు. ధర్మరాజు సంకల్పాని కెంతో ఆనందించాడు. ధృతరాష్ట్రునికి పైతృక కర్మలకు కావలసినంత సువర్ణము పుష్కలంగా ఇవ్వవలెననీ ఆయనచేత ఎన్నెన్నో దానధర్మాలు చేయించవలెననీ అనుకొన్నాడు.

కాని భీమసేనుడు దాని కంగీకరించలేదు. దుర్యోధనాదులు చేసిన దుష్కృత్యాలన్నీ తలుచుకోగానే అతని హృదయం అంతా ఒక్కమారుగా దహించుకుపోయింది! ధృతరాష్ట్రునికి కాణీసంగా సువర్ణం అర్పింపరాదని నిష్కర్షగా చెప్పివేశాడు!

అర్జును డాతనిమాటలకీ విధంగా ప్రత్యుత్తరం ఇచ్చాడు.

"భీమా! వృద్ధనరపతి భీష్మాది కురువీరులందరికీ పరలోకక్రియ లాచరింపవలెనని సంకల్పించాడు. పృథివి కంతటికీ ఏకచ్ఛత్రాధిపత్యం వహించిన చక్రవర్తి ఆత్మబంధువులకు పితృకర్మలు చెయ్య సంకల్పించి మనలను సువర్ణం యాచిస్తున్నాడు. పూర్వం ఒకప్పుడాయన్ని మనం అయిదు ఊళ్ళైనా ఇవ్వవలసిందని యాచించాము. అలాంటి ఏకచ్ఛత్రాధిపతే మనల నిప్పుడు కేవలం పితృకర్మల కోసం సువర్ణం కావలెనని యాచిస్తున్నాడు! ఆహా! ఎంతటి కాలవిపర్యయం సంప్రాప్తమైంది! అందువల్ల ఇంత స్వల్పవిషయం కాదని తిరస్కరించడం ధర్మం కాదు! దీనికి నీ వంగీకరించవలెను!"

అయినా భీమసేనుని హృదయం కరగలేదు!

భీష్మద్రోణాదులైన బంధువర్గానికి తామే పితృకర్మలాచరించవచ్చుననీ ఇక మిగిలిన దుర్యోధనాదులెవరికీ పితృకర్మ లాచరింపరాదనీ వారంతా అధోలోకాలలో పడి మ్రగ్గిపోవాలనీ చెప్పి తన లోపలి ఆక్రోశమంతా వెళ్ళగక్కాడు! అంతటితో ఊరుకోక దుర్యోధనాదులు తమయెడల నెరపిన దుశ్చేష్టితాలన్నీ వరసగా ఏకరువు పెట్టాడు.

అనంతరం అర్జునుడతనికి అనేకవిధాలుగా చెప్పి చూచాడు. అయినా భీమసేనుడు దాని కంగీకరించలేదు.

అప్పుడు ధర్మరాజిక ఏమిచెయ్యడానికీ పాలుపోక స్వయంగా స్వీయకోశాగారంలోనించి ధృతరాష్ట్రునికి ధనం సమర్పింపగలననీ భీమసేనుడన్న మాటలకు కినియవద్దనీ ధృతరాష్ట్రునికి సందేశం పంపించాడు.

విదురుడా సందేశం యథాతథంగా ధృతరాష్ట్రునికి తెలియజేశాడు. ధర్మరాజార్జును

పి. గణపతిశాస్త్రి

అన్నివిధాలా అతని సంకల్పం నెరవేర్చగల మని అన్నారనీ, భీముడుమాత్రం మొట్ట మొదట దాని కెంతమాత్రము అంగీకరించ లేదనీ అయితే అన్నగారావిధంగా ప్రత్యుత్తరం ఇచ్చిన తరవాత ఒక్క నిట్టూర్పు విడిచి తన అర్ధాంగీకారంమాత్రం తెలియ జేశాడనీ విన్నవించాడు. భీమసేనుని మాటల కన్యథా భావించవలదని ధర్మపుత్రుడు ప్రత్యేకంగా పంపించిన విజ్ఞప్తికూడా అతనికి తెలియజేశాడు.

ధృతరాష్ట్రుడటుపిమ్మట ధర్మరాజు సమర్పించిన పుష్కల సువర్ణ ధనరాసులతో భీష్మద్రోణాది బంధుజనుల కందరికీ యథావిధిగా పైతృకకర్మ లాచరించి మరునాటి ప్రభాతవేళ అరణ్య వాసానికి ప్రయాణమైనాడు.

2

ధృతరాష్ట్రుడ్వృపతివల్కలాజినాలు ధరించి గాంధారీదేవితో కలిసి అరణ్యవాసానికి బయలుదేరి పోతున్నాడనే వార్త నాలుగు వైపులా వ్యాపించగానే హస్తినానగరం అంతటా ఒక మహాకోలాహలం బయలుదేరింది. పౌరులందరు అశ్రుపూరిత నేత్రాలతో హస్తినాపుర రాజవీధులలో నిలబడి, అరణ్యవాసానికి తరలి పోతున్న వృద్ధ ధృతరాష్ట్ర చక్రవర్తి వైపు రెప్పపాటు లేకుండా విలకించారు. ధృతరాష్ట్రుడు దోసిలి ఒగ్గి నెమ్మది నెమ్మదిగా సాగిపోతూ తాను, తన కుమారులు చేసిన అపరాధాలన్నీ మన్నించవలసినదని పౌర జానపదులందరినీ సవినయంగా అభ్యర్థించాడు. చక్రవర్తి అభ్యర్థన వినగానే పౌర జానపదులనేకులు పెద్దపెట్టున విలపించారు.

ధృతరాష్ట్రుని అరణ్యవాస యాత్రలో రాజమాత కుంతీదేవి ముమ్ముందుగా సాగిపోయింది. ఆమెభుజం అవలంబనంగా గ్రహించిన గాంధారిదేవి, ఆమెభుజం అవలంబనంగా గ్రహించిన ధృతరాష్ట్రుడు కుంతీదేవి అడుగుల్లో అడుగులు వేసుకుంటూ నెమ్మదిగా సాగిపోయారు. వారి వెంట పాండవులు, ద్రౌపది, సుభద్ర, ఉత్తర మొదలయిన రాజకాంతలంతా నడిచి వెళ్ళారు. ధృతరాష్ట్రచక్రవర్తి అరణ్యవాసయాత్రవేళ అంతవరకు ఎండ కన్నెరగని మహిళలెందరో అశ్రుపూరిత నేత్రాలతో రాజవీథులలో పాదచారిణులై సాగిపోయారు.

క్రమక్రమంగా వారందరు హస్తినాపుర వర్ధమాన ద్వారందాటి వెళ్ళిపోయారు. ధృతరాష్ట్రుడు పౌరజానపదుల నందరినీ తిరిగి స్వగృహాలకు మరలిపోవలసిందని ప్రార్థించాడు. క్రమక్రమంగా పౌరులందరు స్వభవనాలకు మరలిపోయారు. అయితే సంజయుడు, విదురుడు కూడా ధృతరాష్ట్రునితో బాటే వనవాసానికి తరలిపోయారు.

కాని కుంతీదేవి మాత్రం ఆ అంధ వృద్ధ దంపతులిద్దరికీ మార్గం చూపిస్తూ ముమ్ముందుగా అలాగే సాగిపోయింది.

ధర్మపుత్రుని కా క్షణంలోనే ఆమె వారితో కలిసి అలాగే వనవాసానికి సాగి పోగలదేమో అన్న అనుమానం పట్టుకుని వేధించసాగింది.

కుంతీదేవి అంతకుపూర్వం ఎన్నడు అరణ్యవాసానికి బయలుదేరిపోయే సంకల్పమైనా వ్యక్తపరచి ఉండలేదే! ద్రౌపదీదేవి మొదలయిన వధూజనంతోనైనా ఆవిషయం ముచ్చటించి ఉండలేదే! అయినా ఆమె కా సమయంలో హఠాత్సంకల్పమైనా కలిగిందా? అని ధర్మరాజ నేకవిధాలుగా మథన పడినాడు.

ఇలాంటి అనుమానం మిగిలిన పాండవులకుగాని ద్రౌపదిదేవి, సుభద్ర మొదలయిన అంతఃపురస్త్రీలకుగాని అణుమాత్రమైనా కలగలేదు.!

రాజమాత కుంతీదేవి ఒకమారైనా వెనుకకు తిరిగిచూడకుండా అలాగే ముందుకుసాగిపోతున్నది. ధృతరాష్ట్రాదులంతా అప్పటికే హస్తినాపురందాటి కొంత దూరం సాగిపోయారు. ధృతరాష్ట్రుని ప్రయాణవేళ మహారాజప్రాసాదాలలో మ్రోగించిన ప్రయాణ భేరీధ్వను లింకా మంద్ర మంద్రంగా మారుమోగుతూనే ఉన్నాయి! ప్రాతఃకాల ప్రయాణవేళ ధౌమ్యాదిపురోహితులు పఠిస్తున్న స్వస్తిమంత్రాలు తూర్యధ్వనులలో స్పష్టాస్పష్టంగా స్ఫురించాయి. బాలభానుకిరణాలు వారి మార్గంలో సువర్ణాక్షతలవలె తళతళ మెరిశాయి. అప్పుడే మేలుకొన్న పక్షుల కలకలారావాలు వారందరికీ ఉపచారవాక్యాలవలె వినిపించాయి.

వారందరు ఇంకా చాలా దూరం సాగిపోయినా కుంతీదేవి ఆ వృద్ధదంపతులకు దారి చూపిస్తూ గంభీరంగా అలాగే సాగిపోయింది. ధర్మపుత్రునికి ఆమె మరి వెనుకకు మరలివచ్చే సూచనలే స్ఫురించలేదు.

3

నెమ్మదిగా ఆమెను సమీపించి దోసిలి ఒగ్గి నిలబడి —"అమ్మా! నేను మహారాజును అనుసరించి చాలాదూరంవరకు వస్తున్నాను. నీవు పరిజనంతో కలిసి వెనుకకు మరలిపోవలసింది." అని ప్రార్థించాడు.

దానికి కుంతీదేవి ఏమి మారుపలకలేదు. ఆమె నేత్రాలనుండి కన్నీరు అవిరళధారగా ప్రవహించింది. ఆమె ఇంకా కొంతదూరం వరకు అలాగే సాగిపోయింది. ధర్మరాజు తిరిగి సవినయంగా ఆమెను సమీపించి తన ప్రార్థన మన్నించవలసిందని బ్రతిమాలు కొన్నాడు.

దానితో ఆమె ఒక నిమిషం నిలబడింది. ఆమె భుజం ఆనుకొని నడక సాగిస్తున్న గాంధారి, గాంధారి భుజం ఆనుకొని యాత్ర సాగిస్తున్న ధృతరాష్ట్రుడు కూడా నిలబడి పోయారు. కుంతీదేవి గద్గదస్వరంతో నెమ్మదిగా సమాధానం చెప్పింది.

"నాయనా! సహదేవుని మనస్సెన్నడు నొప్పించవద్దు! అతడు నన్నెన్నడు వదిలి ఉండలేదు. ఇక నీవే అతని కేమగడ!

ధర్మరాజా! నాహృదయం వజ్రనిర్మితం! కనక నే కర్ణకుమారుణ్ణి ఆవిధంగా నేల పాలు చేసుకొన్నాను! అతనినిగూర్చి ఇంకా ఎన్నెన్నో మహాదానా లర్పించవలసినది.

ధర్మపుత్రా! ద్రౌపదీదేవికి అభీష్టమైన మార్గంలోనే నడుముకో! భీమార్జునాదుల నందరినీ ఇకనించి నీచేతిలోఅప్పగిస్తున్నాను.

ఈపైన ఈ అత్తమామ లిద్దరికీ పరిచర్య చేసుకుంటూ నేనుకూడా వారితోబాటే వనవాసం చెయ్యాలని సంకల్పించాను!"

అని చెప్పి మరి మారుమాటలేకుండా మళ్ళి వెనక్కైనా తిరిగి చూడకుండా కుంతీదేవి అలాగే నడిచిపోయింది.

ఈ ప్రత్యుత్తరం వినగానే ధర్మరాజు హృదయానికి వజ్రాఘాతం తగిలింది. అతని ముఖం వెలవెలబోయింది. ఒక్క నిట్టూర్పు విడిచిపెట్టి తిరిగి కుంతీదేవి కిలాగ విజ్ఞప్తి చేసుకొన్నాడు:

"అమ్మా! నీవిలా గడపం ధర్మంకాదు! వనవాసానికి నే ననుమతించేది లేదు! నీవ నేకవిధాలుగా మాలో ఉత్సాహ శౌర్యా లుద్రేకింపజేసి సంగ్రామరంగానికి పురికొల్పావు. నేను నీ ప్రోత్సాహం వల్ల శత్రువులందరినీ నిశ్శేషంగా సంహరించివేసి భూమండలానికి కంతటికీ ఏకచ్ఛత్రాధిపత్యంవహించి అకలంకమైన క్షాత్రధర్మం పరిపాలిస్తున్నాను. ఈ సమయంలో నీవు మమ్మల్ని విడిచి వెళ్ళడం న్యాయ్యంకాదు. అమ్మా! కొడుకులతోను కోడళ్ళతోను కలకలాడే రాజ్యం విడిచి పెట్టి వెళ్ళిపోవడానికి నీకు మనస్సెలా ఒప్పింది? నివు నిర్జనమైన అరణ్యంలో నివసింపలేవు! మామీద కనికరించు తల్లీ!"

ఒక్క నిమిషం సేపామె ధర్మరాజన్న మాటలన్నీ శ్రద్ధగా ఆలకించింది. తిరిగి ఆమె నేత్రాలనుండి ఉవ్వెత్తుగా బాష్పధారలు ప్రవహించాయి. అంతేగాని ధర్మరాజడిగిన ప్రార్థనకామె సమాధాన మేమీ చెప్పలేదు. జలజలరాలే బాష్పధారలతో అలాగే నడిచి పోయింది.

అటుపిమ్మట ఆమెతో ఆ విషయంప్రసంగించడానికి ధర్మజునికి మరి సాహసం

కలగలేదు. అయినా ఆమె వెనువెంటనే ఇంకా కొంతదూరంవరకు అలాగే సాగిపోయాడు.

ధర్మరాజు పార్శ్వభాగంలో నడుస్తున్న భీమసేను డీ ప్రసంగంఅంతా శ్రద్ధగా ఆలకిస్తూనే ఉన్నాడు. అతనితో కలిసి వెంట వెంటనే నడిచివస్తున్న మిగిలిన అర్జున నకుల సహదేవాదులందరు ఆప్రసంగం విన్నారు. అన్నగారే మరి మాటలాడడానికి సాహసించలేదన్న విషయం వారొక కంట కనిపెట్టి చూచారు. అందువల్లనే వారుకూడా ఇక మాటలాడడానికి సాహసించలేకపోయారు. భీమసేనునికి వారందరి ఔదాసీన్యము దుస్సహమైపోయింది. అదీగాక కుంతీదేవి వృద్ధులను అత్తమామలనడం కూడా అతనికి నచ్చలేదు! అతడు కొంత తొందరగా కుంతీదేవి పార్శ్వానికి నడిచి వెళ్ళిపోయాడు. ఆమె అతన్ని చూచీ చూడనట్టుగానే సాగిపోయింది. గాంధారి ధృతరాష్ట్రులకు మార్గంలో ఏ విధమైన తొట్రుపాటు సంభవించకుండా అత్యంత భద్రంగా వారిద్దనీ వెనువెంట తోడ్కొని పోయింది.

భీమసేనుడామె పక్కగానే అడుగులు వేసుకుంటూ కొంచెం ఉద్ధృతస్వరంతో ఇల్లాగన్నాడు:

"మహారాజ్ఞీ! నీ వీ సామ్రాజ్య వైభవం అంతా అనుభవించవలసిన శుభ సమయ మిది! ఈ సమయంలో ఇలాగ అరణ్యాలకు వెళ్ళిపోవడం ఏమీ సముచితంగా లేదు! చేజేతులా నీవే మా అందరిచేత జననాశనం చేయించావు! అలాంటిదానవిప్పు డిలాగ అరణ్యవాసానికి బయలుదేరిపోవడానికి కారణం నాకవగతం కావడం లేదు! నీవీవిధంగా అరణ్యవాసం చెయ్యడం న్యాయంకాదు! సుఖంగా యుధిష్ఠురుని సామ్రాజ్యవైభవం అనుభవిస్తూ హస్తినాపురంలో ఉండవలసిందని ప్రార్థిస్తున్నాను. మహారాజ్ఞీ! దయతో నా ప్రార్థనమన్నించవలసిందని కోరుతున్నాను." భీమసేనాదుల వెనువెంట ద్రౌపదీదేవి మొదలయిన అంతఃపురమహిళలుకూడా వస్తూనే ఉన్నారు. భీమసేను డీ విధంగా ప్రసంగించిన తరవాతనైనా వారికి మాటలాడడానికి సాహసం కలగలేదు. అలాగే కొంతదూరంవరకు నిశ్శబ్దంగా ఆమె వెనువెంటనే నడిచివెళ్లారు. వారి ముఖాలన్నీ విషాదంతో వివర్ణములైపోయాయి.

కుంతీదేవి మొదట కొంతసేపటివరకు భీమసేనునికి ప్రత్యుత్తరం చెప్పలేదు. వారందరి ముఖాలు కన్నీటిధారలతో తడిసిపోయిన విషయం ఆమె గ్రహించకపోలేదు. అయినా సంతతంగా ప్రవహిస్తున్న కన్నీటిధారలతో అలాగే నడిచిపోతూ చీరచెరగుతో ఒకేఒక్కసారి కన్నీరు తుడుచుకొని, ఒక నిమిషం ఆగి, ఎంతో ఆప్యాయంగా భీమసేనునివైపు జూచి నెమ్మదిగా ఇలాగన్నది:

"నాయనా! మీరందరు దుర్ద్యూతంలో పరాజితులై పరాభవఖిన్నులై నిస్తేజస్కులైపోయినారు. ఆ సమయంలో పాండుమహారాజ సంతతి నిర్వీర్యమైపోయిదే అనే విషాదంతోనే మీలో క్షాత్రధర్మం ఉత్తేజింపజేశాను. వెయ్యి ఏనుగులతో సమాన బలశాలివైన నీవు దైన్యంతో కుంగిపోతున్నావనే భయంతోనే నీలో పౌరుషాగ్ని ప్రజ్వలింపజేశాను! ధర్మసంరక్షకుడుగా నిలవబడవలసిన ధర్మజునికి వనవాస దుర్గతిపట్టకుండా అతనినీ యుద్ధోద్యోగానికి పురికొల్పాను. విజయునికి పరాజయం అనుచితమనే దృష్టితోనే అతనినీ విధంగా సముద్ధరించాను. ఇక నకుల సహదేవుల మాట వేరే చెప్పనే అక్కరలేదు గదా!

ద్రౌపదీదేవిని ఆనాడు నిండు పేరోలగంలో ఒక క్రీతదాసిగా అవమానించినప్పుడే నాకీ పాండవకులం నశించి పోగలదనే భయం కలిగింది. ఆ క్షణనించీ నీలో క్షాత్రవదుస్సహమైన శౌర్యాగ్ని జ్వాల ప్రజ్వలింపజేశాను! ఆ విధంగా మిమ్మల్ని అందరినీ సముద్ధరించడానికి గల కారణం ఇంతే!

అంతేగాని సామ్రాజ్యభోగాలనుభవించడం కోసమే నే నిదంతా చేసిఉండలేదు సుమా! పాండుమహారాజు జీవితకాలంలోనే నేను సమస్త సామ్రాజ్యభోగాలు అనుభవించాను! నాకు వాటితోనే సంపూర్ణ సంతృప్తి కలిగింది.

ఆయనలేని నాకీ సామ్రాజ్యభోగాలేల నాయనా!

తపస్సుచేసి భర్తృలోకం చేరుకోడానికే నే నరణ్యానికి వెళ్ళిపోతున్నాను.

వృద్ధులైన గాంధారీ ధృతరాష్ట్రులే నాకిక అత్తమామలు! వారిద్దరి శుశ్రూషతోనే నా శరీరం శుష్కింపజేయదలెనని సంకల్పించాను."

అని చెప్పి ఆమె యుధిష్ఠిరునివైపు చూచి ఇంకా ప్రశాంతస్వరంతో ఇలాగ చెప్పింది.

"నాయనా! ధర్మరాజా! నీవు మాతో చాలా దూరం వచ్చావు. ఇక నీవు భీమసేనాదులతోను, కోడళ్లతోను కలిసి వెంటనే హస్తినాపురానికి మరలిపో! ధర్మదేవత నీహృదయంలో సుప్రతిష్ఠితమై ప్రకాశించుగాక!"

అని చెప్పి మళ్ళీ తిరిగిచూడకుండా, ఆమె అలాగే నెమ్మదిగా అడుగులు వేసుకుంటూ వెళ్లిపోయింది.

కుంతీదేవి ప్రత్యుత్తరంతో భీమసేనునితోబాటు మిగిలినవారందరు తలలు వంచేసుకున్నారు. ఆ పిమ్మట వారెవ్వరు దించిన తలలిక ఎత్తనేలేదు.

అటుపిమ్మట అందరు నిశ్శబ్దంగా గాంధారీధృతరాష్ట్రులకు, కుంతీదేవికి ప్రదక్షిణనమస్కారాలాచరించి సన్నసన్నని రోదనధ్వనులతో హస్తినాపురానికి తరలిపోయారు. కాని కనిపించినంతవరకు వారి చూపులన్నీ కుంతీదేవివైపే ప్రసరించాయి.

అయితే మహారాజమాత కుంతీదేవి మరి వెనకకు దృష్టి మరల్చకుండా గాంధారీధృతరాష్ట్రుల నిద్దరినీ అదేవిధంగా తన వెనువెంటనే నడిపించుకుపోయింది.

పాండవులందరు గోవులేని గోవత్సాలవలె విషణ్ణవదనాలతో నిట్టూర్పులు విడుస్తూ నెమ్మది నెమ్మదిగా హస్తినాపురం చేరుకొన్నారు. ★

"అమ్మా" అని ఏడుస్తూ పరిగెత్తుకొచ్చాడు. ఎనిమిదేళ్ల అబ్బాయి.

"ఏం నాన్నా? ఎందుకు?" అంది తల్లి.


"నాన్నమో గోడకి మేకు కొడుతూ, వేలు చితకొట్టుకున్నాడు."

"నాన్న వేలికి చిన్న దెబ్బ తగిల్తే ఏడుస్తావుట్రా, పకపక నవ్వాలిగాని!" అంది అమ్మ నవ్వుతూ.

"ముందర ఏడవ లేదమ్మా... ముందర నవ్వేను...అందుకే" అన్నాడు చిట్టిబాబు.

పథేర్ పాంచాలి





(16 వ అధ్యాయం తరువాయి)

ఇంటికి తిరిగి వచ్చాక పదిహేను రోజుల వరకూ అపూ తన ప్రయాణానుభవాల్ని వర్ణించి చెప్పటం మొదలెట్టాడు. ఎన్నెన్ని వింతలు చూశాడీ కొన్నిరోజులలోనే! రైలురోడ్డు—నిజంగా రైలు వెళ్ళే రోడ్డు, మట్టితో చేసిన సీతాఫలం, పనసకాయ, దోసకాయలు: నిజమైనకాయల్లాగానే ఉన్నాయి. పొట్ట నొక్కితే మూర్ఛరోగిలా కాళ్ళూ చేతులూ నిగడతన్ని డప్పువాయించే బొమ్మ! అసలది? తాను ఎంతదూరం వెళ్ళాడో, తామరపూలతో నిండిన ఎన్ని చెరువులు చూశాడో, తనకు దాహమైందంటే అదేదో ఊళ్ళో నాన్న తనని వీధిప్రక్కన ఉన్న ఎవరింటికి తీసుకువెళ్ళాడో, వాళ్ళు తనను ఆప్యాయంగా లోపలికి తీసుకెళ్ళి పీటవేసి కూచోపెట్టి, పాలు, అటుకులు పెట్టారో—ఇవన్నీ ఏవి విడిచిపెట్టటం; ఏవి చెప్పటం!

రైలురోడ్డు కబుర్లన్నీ విని వాళ్ళ అక్క ముగ్ధురాలై పోయింది. "ఎంతెంత పెద్ద స్తంభాలు చూశావురా అపూ! తీగెలు వ్రేలాడుతూ ఉన్నాయికదూ! చాలా పొడుగు తీగెలు కదూ; రైలు చూశావా మరి! వచ్చిందా?" అని దుర్గ అడిగిన మాటే మళ్ళీ అడగటం మొదలెట్టింది.

ఊహూఁ—అపూ రైలు చూడలేదు. అదొక్కటే కొరవడి, వెలితి ఉండిపోయింది. అది నాన్న తప్పు. నాలుగైదు గంటలు వెదలకుండా అక్కడే కూర్చుంటే రైలు చక్కగా వచ్చేది! కాని ఎంత చెప్పినా నాన్న ఒప్పుకోలేదు మరి;

ప్రొద్దు ఎక్కిపోవటంతో సర్వజయ ఏదో గబగబ పరధ్యానంగా ఎదర గుమ్మం తలుపుతీసుకుని మెల్లాలో అడుగెట్టగానే ఏవో సన్నటి తీగెల్లాంటివి అడ్డం తగిలాయి ఆమెకి. అంతలోనే టప్‌న ఏవో తెగిన చప్పుడయి అటూ ఇటూ ఏవేవో పడిపోయాయి. అది ఏవిటో తెలుసుకునేలోపుగానే అంతా ఒక్క రెప్పపాటులో జరిగిపోయింది. తర్వాత కాసేపటికల్లా అపూ ఇంటికి వచ్చాడు. వీధిగుమ్మందాటి లోపల అడుగుపెడుతూ తప్పీమని ఆగిపోయాడు; తన కళ్ళని తాను నమ్మలేకపోయాడు; 'ఏమిటిది? ఎవరు నా టెలిగ్రాఫ్ తీగెలు త్రెంచేసింది;'

అంత దారుణం జరగటం, అదీ హఠాత్తుగా జరగడంతో వాడికి మొదట్లో అసలేమీ అంతుపట్టలేదు. తర్వాత కొంచెం తమాయించుకుని నిదానంగా అటూ ఇటూ పరీక్షగా చూస్తే, ఆ చిత్తడిగా ఉన్న నేలమీద అడుగుల గుర్తులు అలుక్కుపోకుండా ఇంకా అలాగే ఉన్నాయి. అవి అమ్మ

అనువాదం:

మద్దిపట్ల సూరి

అడుగులు తప్ప; ఇంకెవరివీ కావు అని వాడికెవరో మనసులో చెపుతున్నట్లుంది! ఎవరివీ కావు. అచ్చగా వాళ్ళ అమ్మవే! ఇంట్లోకి వెళ్ళి చూస్తే వాళ్ళ అమ్మ నిశ్చింతగా పనసగింజలు పొట్టు తీస్తూ కూచుని ఉంది. అపూ చటుక్కున అక్కడే ఆగి, నాటకంలో అభిమన్యుడిలాగా పోజుపెట్టి ముందుకువంగి, "నేను ఈ తీగలన్నీ కష్టపడి అడవి అంతా గాలించి తెచ్చినవి కావంటావా అమ్మా?" అని అడిగాడు పైస్థాయిలో.

సర్వజయ వెనక్కి తిరిగి చూసి "ఏం తీసుకువచ్చావ్? ఏం జరిగింది?" అని అడిగింది విసుపోతా.

"నాకు కష్టంగా ఉండదూ? ఆ తీగెల కోసం తిరుగుతూంటే నా కాళ్ళ నిండా ఎన్ని ముళ్ళు గ్రుచ్చుకున్నాయి?"

"ఏమిట్రా పిచ్చివాగుడూ నువ్వూ? ఏం జరిగింది?"

"ఏం జరిగిందా? నేనంతకష్టపడి టెలిగ్రాఫ్ స్తంభాలు పాతుకుని తీగెలు కట్టుకుంటే త్రెంచి పారెయ్యాలా నువ్వు?"

"నువ్వు ఏదో చెడద తెచ్చిపెట్టందే ఒక్క క్షణం ఊరుకోలేవురా! దారిలో ఏమిటో అడ్డంగా వ్రేలాడుతున్నాయి. టెల్లిగ్రాపో—ఏమో నాకేం తెలుసు? ఆదరాబాదరా వచ్చాను. తెగిపోయాయి. ఇప్పుడేం చెయ్యమంటావ్?" అని ఆవిడ మళ్ళీ తన పని చూసుకోసాగింది.

అబ్బ! ఎంత రాతిగుండె అంటేను! తానంటే అమ్మకి అంతులేని అపేక్ష అనుకుంటూ ఉండేవాడు అప్పటివరకు ఎన్నాళ్ళ నుంచో పేరుకుని ఉన్న ఆ భ్రాంతి ఎగిరిపోయిం దిప్పుడు. అయినా అమ్మ ఇంత కటికగుండె అని మాత్రం కలలోకూడా అనుకోలేదు అపూ. ఎక్కడి నీలమణి పెదనాన్నగారి నివేశనం, ఎక్కడి పాలిత్ గారి పెద్ద మామిడితోట, ఎక్కడి ప్రసన్న మాష్టారి వెదురుతోపు—నిన్న నల్లా ఆ భయంకరమైన అడవులన్నీ ఒక్కడూ తిరిగి తిరిగి, పై కొమ్మలమీద వేళ్ళాడే సన్న సన్న తీగెల నన్నిటినీ ఎంతో శ్రమపడి తెచ్చుకున్నాడు. రైలు ఆట ఆడుకోవాలని. ఇంకేముంది?...

అమ్మ మనస్సుకు బాగా గ్రుచ్చుకునే కటువైనమాట ఏదైనా అనాలని తోచింది వాడికి హఠాత్తుగా. కాసేపు నుంచుని ఆలోచిస్తే ఇంకేమీ తోచక, చివరి కిందాకటి కంటె పైస్థాయిలో "ఇవాళ నేను అన్నం తినను. చచ్చినా సరే తినను" అన్నాడు.

"తినను, తినను...తినకపోతే పో. నన్ను ఉద్ధరించటానికి తింటావా! అన్నం దించటమే తరువాయి ఇహ...తినకపోతే పో. ఆకలేస్తే ఎవరొచ్చి పెడతారో చూస్తాను" అన్నది వాళ్ళమ్మ.

బస్. అంతే, రెప్పపాటులో-ఎక్కడివాళ్ళక్కడ అందరూ ఉన్నారు, వాళ్లమ్మ పనసగింజలుపొట్టు ఒలుస్తూనే ఉంది-అపూ మాత్రం లేడక్కడ. ఏమయినాడో! ఉన్నవాడున్నట్లుండి మాయమైనాడు. సరీగ్గా ఆ సమయంలో దుర్గమాత్రం ఇంట్లోకివస్తూ, వాడిని తప్పుకుని, విసురుగా వెళ్ళిపోతున్న వాడికేసి విస్తుపోయిచూస్తూ "ఒరేయ్ అపూ! ఎక్కడికిరా అలా వెళ్లిపోతున్నావ్? ఏం జరిగిందిరా? ఒరేయ్, మాట!" అని కేకేసింది.

"నాకు తెలియదుబాబూ! నీ వన్నీ ఒట్టి దుడుకుపనులు, నా ఎముకలు కొరికేసేస్తున్నావ్ ఎక్కడో! దారిమయంలో ఏవో తెచ్చికట్టావు. నేను హఠాత్తుగా వచ్చాను, తెగిపోయాయి. దానికేమిటి చెయ్యటం ఇప్పుడు? నేనేం కావాలని త్రెంచిపారేశానా? ఈ భాగ్యానికి వాడికి రోషంతో ముక్కు ఊడి పడిపోతోంది—అన్నం తినేట్టు! తినకపోతేపో. తిని ఉద్ధరిస్తావా యేం మహా నన్ను?"

తల్లీకొడుకులు ఇలా అభిమానాలకి పోయినప్పుడు దుర్గే మధ్యవర్తిత్వం నెరపాలి. ఆ పిల్ల పిలిచి పిలిచి, చివరి కెలా అయితే యేం మధ్యాహ్నం రెండు గంటలకి తమ్ముణ్ణి ఇంటికి పట్టుకొచ్చింది. ముఖమంతా పీక్కుపోయి, వాడు ప్రక్కవీథిలోని రాయ్‌గారి తోటలో నేలబారుగాఉన్న మామిడిచెట్టు ఎక్కి కూర్చుని ఉన్నాడు.

సాయంకాలం ఎవరైనా వాళ్ళింటికి వచ్చి అపూని చూసినట్లయితే—ప్రొద్దున్న అమ్మమీద కోపంవచ్చి, ఇల్లు విడిచిపెట్టి పారిపోయిన అపూ వాడేనని అనిపించదు. మెల్లాలో ఆ చివరనుంచి ఈ చివరవరకు తంతితీగెలు కట్టిఉన్నాయి. అపూ ఆశ్చర్యంతో వాటిని అదే పనిగా చూస్తూ నుంచున్నాడు. ఏమీ తేడాలేదు. అచ్చంగా రైలురోడ్డు ప్రక్కన తంతితీగెలు కట్టినట్లే ఉన్నాయి.

వాడు సతూవాళ్ల యింటికి వెళ్ళి, "సతూదా, మా మెల్లాలో టెలిగ్రాఫ్ స్తంభాలు పాతి తీగెలుకట్టాం. రా, రా, రైలు ఆట ఆడుకుందాం. వస్తావా?" అని అడిగాడు.

"తీగెలు ఎవరు కట్టార్రా?"

"నేనే కట్టాను. అక్క తెచ్చిపెట్టింది తీగెలు..."

"మీరు ఆడుకోండి, నేను రాను యిప్పుడు—" అన్నాడు సతూ.

'పెద్దపిల్లల్ని పిలుచుకువచ్చి, వాళ్లతో ఆడుకోవటం తనపని కాదు. తనమాట ఎవరు వింటారు!' అనుకున్నాడు అపూ. మళ్ళీ ఇంకొకసారి సతూదగ్గరకే వెళ్లాడు. కటకటాల్నానుకుని దిగాలపడి నుంచుని, "రా, సతూదా, రావూ? నువ్వూ, నేనూ, అక్కా ఆడుకుందాం ఇప్పుడు. ఏం?" అన్నాడు. తర్వాత ఇంకా ఆశపెడుతూ "నేను టిక్కెట్లకని పంపరపనసఆకులుకూడా తెచ్చాను" అంటూ చేతులు చాచి చూపించాడు. "రావూ?"

సతూ రావటానికి ఒప్పుకోలేదు. అపూ బయటికి వెడితే పెద్ద చొరవగలవాడుకాడు. అంచేత ఇంకేమీమాట్లాడకుండా ఇంటికితిరిగి వచ్చాడు. వాడికి కళ్ళనీళ్ళ పర్యంతమైంది. ఇన్నివిధాల అడిగినా సతూదా రానే లేదుగా!

మర్నాడుదయం వాడు, వాళ్లక్క కలిసి, ఇటికెలు తెచ్చి దుకాణంలా పేర్చి, సరుకులు పోగుచేసుకు రావటానికై బయలుదేరారు. అడవిలో దొరికే వస్తువులు దుర్గకి చాలా తెలుసు. ఇద్దరూ కలిసి, తమలపాకులకు బదులు సీతాఫలపుఆకులు, బంగాళాదుంపలకి తుంగముస్తెలు, చేపలకి బదులు ప్రొద్దుతిరుగుడు పూలు, కాకి దొండపళ్లు, సైంధవ లవణంగా మట్టిబెడ్డలు, మొదలైన

జరిగిన కథ:—

నిశ్చిందిపురం బెంగాల్‌లోని మారుమూల కుగ్రామం. ఆ ఊళ్లో చితికిపోయిన మధ్య తరగతి సంసారి హరిహరరాయ్. అతని భార్య సర్వజయ. కూతురు దుర్గ. హరిహరరాయ్ పెళ్ళయిన తరవాత కొంతకాలం దేశాలు పట్టిపోయి, శాస్త్రాలు, కావ్యాలు చదివి పండితుడై, పదేళ్ళకి తిరిగివచ్చి కాపరంపెట్టాడు. దుర్గ పుట్టిన చాలఏళ్ళకి అతనికి కొడుకు పుట్టాడు. వాడిపేరు అపూ. ఇంట్లో ఎప్పుడుచూసినా 'ఇవాళ ఎలా గడుస్తుందిరా భగవంతుడా' అనే చింతే. కాని పిల్లలకిదేం పట్టింది? దుర్గకి ఒక్కనిమిషం ఇంట్లో కాలు నిలవదు. ఎప్పుడూ ఏ తోటలోనో, ఏ చెట్టుకిందనో ఆడుకుంటూ ఉంటుంది. అపూ ఎప్పుడూ ఊహాలోకంలోనే గడుపుతాడు. వాడికి ప్రతిదీ కొత్తే. ప్రతిదీవింతే. వాడి జీవితపరిధిలోకివచ్చే ప్రతి సాధారణవిషయమూ అసాధారణమైనదిగా, అద్భుతమైనదిగా వాడికి కనిపిస్తుంది. ఒకరోజున అపూను బళ్లో వేశారు. చదువుచెప్పడంకంటె, బడిలోనే ఒకపక్కనఉన్న చిల్లర కొట్టుపని చూసుకోవడం, కొట్టుకు వచ్చేపోయేవారితో కబుర్లుచెప్పడమే పంతులుగారికి అలవాటైంది. కొట్లోకివచ్చే గ్రామస్థుల కబుర్లు వింటూ అపూ ఏవో ఆలోచనల్లో తేలిపోతూ ఉండేవాడు. పంతులు ఎప్పుడైనా పాఠంచెప్పినా ఆ మాటలు వాడికి అర్థంఅయ్యేవికావు. అర్థంకాని ఆ శబ్దసముదాయం వెనక వాడికి ఏవో చిత్రవిచిత్రమైన రమణీయలోకాలు, దేశకాలబాధితంకాని ప్రపంచాలు కనిపించేవి. పెద్దవాడైన తరవాత దారికనుక్కుని అక్కడికి వెళ్ళాలని వాడు నిశ్చయించుకున్నాడు. ఒకసారి తండ్రి ఏదో ఊరు వెడుతూ అపూనుకూడా వెంట తీసుకువెళ్లాడు. ఎన్నడూ ఊరు విడిచి వెళ్ళని అపూ ఏదో కొత్తదేశాన్ని కనుక్కోడానికి పోతున్నవాడిలాగ అపూర్వానుభూతి పొందాడు. కొత్తఊళ్లో వాడికి అమల అనే పిల్ల స్నేహితురాలైంది. ఆపిల్లమీద కలిగిన ఆ ప్రేమ మరోకొత్త అనుభూతి అయింది.

నన్నీ తెచ్చి, చాలాసేపటివరకు దుకాణం అమరుస్తూగడిపారు. "మరి పంచదారగా ఏం తీసుకువద్దాం అక్కా?" అని అడిగాడు అప్పూ.

"ఆ వెదురుతోపు దగ్గిర దిబ్బమీద మంచి ఇసక వుంది, అమ్మ సెనగలూ అవీ వేయించేటప్పుడు తీసుకువస్తుందే అది! ఆ ఇసుక పంచదార తీసుకువద్దాం పద. తెల్లగా నిగనిగలాడుతూ ఎలా ఉంటుందనుకున్నావ్? అచ్చంగా నిజమైన పంచదార లాగానే"

వెదురుతోపులో ఇసుకకోసం వెతుకుతూ పోయి పోయి, అడవిలోకి వెళ్లారు. పెద్ద చెట్ల కొమ్మలకి వ్రేలాడుతున్న తీగెలవి, ఎర్రగా, గుండ్రంగా ఉన్న పళ్లు దేవో కంటికి నదరుగా కన్పించాయి. దుర్గ అప్పూ ఇద్దరూ వాటిని చూసి ఆశ్చర్య పోయారు.

ఎలాఅయితేనేం కొంచెం దిగువున ఉన్న తీగెలో కొంత ముక్క నులాగేసరికి పళ్ళతోసహా అది క్రిందపడింది. ఇద్దరూ ఆ పళ్ళను తెచ్చుకోవటానికి ఉత్సాహంగా పరుగెత్తారు.

దానిని బాగా పండిన మాకాల్ పళ్లు కూడా ఉన్నాయి. వాటిని తమ దుకాణం దగ్గరకు వచ్చినవాళ్లకు ముందు కంటికి నదరుగా కన్పించేచోట పెట్టారు. అమ్మకం జోరుగా ప్రారంభమైంది. దుర్గ అక్కడ ఉంచిన తమలపాకులన్నీ కొనెయ్యటంతో అవి అయిపోయాయి. ఈ ఆట ప్రారంభించిన కాసేపటికల్లా వీథితలుపు తోసుకుని సతూ రావటంచూసి, అప్పూ పట్టలేనంత ఆనందంతో వాడికి ఎదురువెళ్లి, తీసుకువస్తూ "చూశావా, సతూదా. ఎలాంటి దుకాణం పెట్టామో! ఎలాంటి పళ్ళో చూడు! నేనూ అక్కా కోసుకు వచ్చాం చెట్టునుంచి. ఏం పళ్ళో చెప్పుకోచూదాం. తెలుసా?" అని అడిగాడు.

"ఓ! అవి 'మాకాల్' పళ్ళు. మా తోట నిండా కావలసినన్ని ఉన్నాయి..." అన్నాడు సతూ. సతూ రావటం ఏదో జన్మ తరించినట్లుంది దుర్గవాళ్ళకి. సతూదా తమ ఇంటికి ఎప్పుడూ రానేరాడు. అదీకాక సతూ ఎప్పుడూ పెద్దవాళ్ళతో సావాసం చేస్తూంటాడు. వాడు రావటంతో ఆటలోని ఉత్రతివమంతా ఎగిరి చక్కాపోయినట్లే!

చాలాసేపు ఆట చక్కగా సాగాక, "రెండుమానుగులు బియ్యం కావాలబ్బాయ్. సన్నబియ్యం. మా బొమ్మలపెళ్లికి పిల్లను చూసుకోటానికి వస్తున్నారు రేపు. పదిమంది భోంచేసే సందర్భం. మంచిరకం——" అన్నది దుర్గ.

"నాకూ పిలుపు ఉన్నదనుకుంటా. అవునా?" అన్నాడు సతూ.

దుర్గ తల ఊగిస్తూ - "ఎందుకు ఉండదు?

 **పథేర్ పాంచాలి** 

మీరంతా అడపెళ్లివారిలో వాళ్లు-సతూదా, ఇవాళ రాత్రికే కాస్త గంధంతీసి ఉంచమని చెప్పు రాణూతో. నేను ప్రొద్దున్నే వచ్చి తెచ్చుకుంటాను" అన్నది.

దుర్గమాట ఇంకా పూర్తికానే లేదు. ఇంతలో సతూ దుకాణంలో అమ్మకానికని పెట్టినవాటిల్లో దేన్నో లాక్కొని పారిపోయాడు. వాడివెనకాలే అపూ కూడా "అక్కా! ఏదో ఎత్తుకు పారిపోతున్నాడే" అని అరుస్తూ పరుగెత్తాడు.

దుర్గ తెల్లబోతూ అసలు ఏం జరిగిందీ గ్రహించేలోపుగానే సతూ, అపూ పరుగెత్తుకుంటూ అప్పుడే వీథిగుమ్మం దాటిపోయారు. వెంటనే బొమ్మరిల్లు కేసి తిరిగి చూసేసరికి అక్కడ పెట్టిన ఆ 'మాకాల్' పళ్లు మూడింటిలోనూ ఒకటి లేదు.

దుర్గ ఒక్కపరుగులో వీథిగుమ్మంలోకి వచ్చిచూస్తే, ఆ లొద్దుగు చెట్ల మధ్యదారినే ముందు సతూ, వెనకాల అపూ పరుగెత్తుతున్నారు. సతూ అపూకంటె మూడునాలుగేళ్లు పెద్దవాడు. అదీకాక సతూ అపూలాగా అబ్బనాకారంగా ఆడపిల్లలాగా ఉండడు. వాడిది గట్టిఒళ్లు. వాడితో అపూ ఎక్కడ పరుగెత్తగలడు. అయినా పట్టు చిక్కటంతఎడంలోనే పరుగెత్తుతున్నాడు. అయితే సతూ ఇతరుల సొమ్ముఎత్తుకొని పరుగెత్తుకుపోతున్నవాడు. అపూ బాధ్యతపైన వేసుకుని పరుగెత్తుతున్నవాడు.

సతూ పారిపోతూ పోతూ చటుక్కున వంగి వెనక్కి తిరిగిచూడటం దుర్గ గమనించింది. అపూకూడా హఠాత్తుగా ఆగిపోవలసి వచ్చింది. అంతలో సతూ కనుచాటు అయిపోయి పులిచింతచెట్టు ప్రక్కదారి పట్టుకున్నాడు.

దుర్గ పరుగెత్తుకుని అపూదగ్గరకు వచ్చింది. అపూ ఒక్కక్షణం కళ్లు మూసుకుని ముందుకు వంగి, రెండుచేతులతో కళ్లు నులుముకుంటున్నాడు. "ఏం జరిగిందిరా అపూ?" అని అడిగింది దుర్గ.

అపూ కళ్లు పూర్తిగా తెరవకుండానే, మంటమూలంగా కళ్లు అలా నులుముకుంటూనే "సతూదా కళ్ళల్లో దుమ్ముకొట్టాడే అక్కా! కళ్లు ఏమీ కన్పించటంలా" అన్నాడు.

దుర్గ చటుక్కున అపూ చేతులు కళ్ళమీదినుంచి తీస్తూ "ఉండు ఉండు చూడనీ, కళ్లు అలా నలపకూడదు. ఉండు చూడనియ్" అంది.

అపూ మళ్ళీ చేతులురెండూ అప్పుడే కళ్ళమీదికిపోనిచ్చి "ఊహుఁ కళ్ళలో ఏమిటో మంటగా ఉందే అక్కా! గ్రుడ్డికళ్లు అయిపోయాయిలా ఉంది" అన్నాడు.

"చూడనియ్, ఏదీ" అలా నలపకూడదు కళ్లు; చేతులుతియ్" అంటూ గుడ్డ నోట్లో పెట్టుకుని ఊదుతూ వాడికళ్ళకి ఆవిరికాపు పెట్టింది దుర్గ. కాసేపలా చేసేసరికి అపూ కాస్త కళ్లు తెరిచి చూడగలిగాడు. దుర్గ వాడి కనురెప్పలు పైకి ఎత్తి ఉఫ్ఉఫ్ అని చాలా సార్లు ఊదింది. "ఇప్పుడు బాగా కన్పిస్తున్నాయా? సరే నువ్వు ఇహ ఇంటికి పద. నేను వాళ్ళ యింటికెళ్ళి వాళ్ళ అమ్మతో అమ్మమ్మతో ఈ సంగతంతా చెప్పొస్తా. రాణూకికూడా చెపుతా. మహా అల్లరివాడు ఎక్కడో! నువ్వువెళ్లు. నేనిప్పుడే వస్తాను." అన్నది దుర్గ.

రాణూ వాళ్ళ పెరటిగుమ్మందాకా వెళ్ళేసరికి ఇంక లోపలికి వెళ్ళటానికి గుండెలు లేకపోయాయి. దుర్గకి వాళ్ళ అమ్మమ్మంటే అమిత భయం. కాసేపు ఆ గుమ్మందగ్గరే అటూ యిటూ తచ్చాడి, ఇంటికి తిరిగి వచ్చేసింది దుర్గ. వీథిగుమ్మంలోంచి లోపలికివస్తూ, అపూ అక్కడే తలుపుచాటున పైకి విన్పించకుండా ఏడుస్తూ నుంచుని ఉండటం చూసింది. వాడు అయిందానికీ, కానిదానికీ ఏడ్చేరకం కాదు. వాడసలెప్పుడూ సాధారణంగా ఏడవనే ఏడవడు. కోపం తెచ్చుకుంటాడు, అభిమానం తెచ్చుకుంటాడు. కాని ఏడవడు. 'ఇవాళ వాడికి చాలా కష్టంగా ఉండిఉంటుంది. అంత మనసుపడి తెచ్చుకున్న పండా పోయింది. పైగా కళ్లల్లో దుమ్ముకూడా కొట్టి తలవంపు కలిగించాడు!' అనుకుంది దుర్గ. వాడి యేడుపు సహించలేకపోయింది—ఆ యేడుపు వింటూంటే మనస్సు ఏమిటో మహా పీకుతున్నట్లుంది దుర్గకి.

దుర్గ తమ్ముడి దగ్గరకు వచ్చి చెయ్యి పట్టుకుని ఓదారుస్తూ "ఏడవకురా అపూ! ఏడవకు మరి! నాదగ్గరున్న డబ్బులన్నీ నీకే యిస్తాగా ఆడుకోటానికి—ఏడవకు. రా. కళ్లు మరీ మంట పుడుతున్నాయా?......గుడ్డి చిరిగిపోయిందల్లే ఉందే, చూడనియ్......" అన్నది.

మధ్యాహ్నం భోజనాలవీ అయాక అపూ బయటికి ఎక్కడికీ వెళ్ళకుండా ఇంట్లోనే ఉంటూఉంటాడు. తాతలనాడెప్పుడో కట్టినది పడిపోటానికి సిద్ధంగా ఉన్న పాత కొంప. సామానులు, పూర్వకాలపు కొయ్య కావడిపెట్టెలు, కుర్చీపీటలు గడమంచెలు, దణ్ణెపు వాసాలతో ఇల్లంతా ఇరకాటంగా ఉంటుంది. ఆ పెట్టెల్లో ఏమేమి ఉంటాయో, వాటిని తెరవగా అపూ యెప్పుడూ చూడలేదు. వాటిల్లో దాచిపెట్టిన చెంబుల్లో కుండల్లో, ఏమి ఉంటాయనేది అపూ అసలెరుగడు.

అవన్నీ కలిసి ఇల్లంతా గుప్పున ఏవో పాతవాసనలు కొడుతూంటాయి. అవి వేటి తాలూకు వాసనలో వాడికి తెలియదు. కాని, ఆ వాసనలు ఏవో పాతగాథల్ని జ్ఞప్తికి తెస్తున్నట్లుంటాయి. ఆ గడిచిపోయిన కాలంలో అపూ లేడు. కాని ఈ వెదురు దణ్ణాలూ ఉండేవి; తాతగారి వెదురు చువ్వల పెట్టె ఉండేది; ఈ పెద్దకావిడి పెట్టె ఉండేది. అదుగో ఆ కొండగోగు చెట్టు చివరలు కన్పిస్తూంటాయే, ఆ చిట్టడవిలా కన్పించే ప్రదేశంలో ఎవరిదో మంటపం ఉండేది. అంతేకాదు, ఎంతో మంది ఆడపిలలు, మగపిల్లలు ఎన్నెన్ని పేర్లవాళ్ళో ఒకప్పుడీ యింట్లో ఆడుకుని ఉండిఉంటారు. వాళ్ళంతా నీడలుగా మారి ఎక్కడ విలీనమైపోయారో - ఎన్నాళ్లనాటి సంగతి.

తల్లి నీళ్లకి చెరువుకో ఏటికో వెళ్ళి, తానొక్కడూ ఇంట్లో ఉన్నప్పుడు - పగటి వేళ వెలుతురులో ఆ పెట్టెలన్నీ మూతలు తీసి, వాటిల్లో ఏమేం అద్భుతమైన వస్తువులున్నాయో, పరీక్షించి చూడాలని వాడికి మహా అనిపిస్తూ ఉంటుంది. గదిలో మూలపైన మరీ ఎత్తుగాఉన్న వెలిసెమీద తాటాకులవీ మామూలువీ పుస్తకాలు ఓ గుట్ట ఉన్నాయి. అవి తన తాతగారైన రామచంద్ర తర్కాలంకార్ గారివని తండ్రి చెప్పాడు. వాటిని కనుక తనకు అప్పగిస్తే, తానే ఒకసారి పైకి ఎక్కి వాటినన్నిటినీ ఓసారి క్రిందికి దింపి తీసిచూడాలనికూడా అనిపించేది. ఒక్కోరోజున వాడు ఆ అడవివైపున ఉండే కిటికీప్రక్కన, కాశీదాసు మహాభారతం చదువుకుంటూ కూర్చుంటూ

ఉంటాడు. తానిప్పుడు బాగా చదవటం నేర్చుకున్నాడు. ఇదివరకులా ఎవరో చదువుతూంటే వింటూ కూర్చోనక్కర్లేదు. తానే అనర్గళంగా చదవగలడు. అర్థంకూడా అవుతూ ఉంటుంది. చదువుసంధ్యల్లో అపూ చురుకయినవాడు. వాళ్ల నాన్న వాడిని అప్పుడప్పుడు ముసలివాళ్లంతా చేరే గంగూలీగారి మంటపందగ్గిరకు తీసుకువెడుతూంటాడు. ఏ రామాయణమో, (అధ్యాత్మ రామాయణంలాంటి) ఏ కీర్తనల పుస్తకమో వాడి చేతికిచ్చి "చదువు నాయనా! చదివి ఒకసారి వినిపించు వీళ్ళందరికీ"-అనేవాళ్లు. ఆ ముసలులందరూ మహా మెచ్చుకునేవాళ్లు. దీనూ చటర్జీ అనేవాడు - 'మా మనుమడు ఉన్నాడా! సరీగ్గా మీ అబ్బాయి ఈడువాడే, చెపితే నమ్ముతావో లేదో కాని, వాడికింతవరకు అక్షరాలన్నీ సరీగ్గా గుర్తుపటలేదు. నేనింకా ఎన్నాళ్ళుండబోయానోయ్. నేను కళ్ళు మూశానంటే ఏముంది. హరిహరునిహృదయం పుత్రగర్వంతో ఉబికిపోయేది - 'మీకు, అంత ఖర్మ ఏం పట్టింది. పుట్టిననాటినుంచి వడ్డీవ్యాపారం చేస్తున్నవాళ్లాయె; మేం పేదవాళ్లము. ఏమైనా పండితవంశం కదా మాది! మా తండ్రిగారు తాటాకులనిండా ఒక్క పుస్తకాలే వ్రాసిపోలేదు. వంశానికి ఒక చాలు ఏర్పరచి మరీ పోయారు. అదెక్కడికి పోతుంది' అనుకునేవాడు తనలో తాను.

వాళ్ల ఇంటి కిటికీకి కొంచెం అవతలగా చుట్టూ మదురుగోడ. ఆ గోడని ఆనుకుని అవతల అంతా ఒకటే అడవి. ఆ కిటికీదగ్గిర కూర్చుంటే చాలు—నీలిసముద్రపు అలల్లాగా భాండీర, శాఖోటక వృక్షాల చివళ్లు ఆ చెట్లనీ ఈ చెట్లనీ వ్రేళ్లాడే రకరకాల తీగెలు, ఏళ్ల తరబడిన ఉన్న వెదురుచెట్లు వయోభారంవల్ల ప్రక్కనున్న కర్ణికార, 'వంచాల్‌తా' చెట్లమీదికి ఒరిగిపోతూ ఉండటం, వాటిక్రింద వెలుతురు తక్కువగా ఉండేచోట కాటుకపిట్టలు గంతులు వేస్తూ ఉండటం- కన్పిస్తూనే ఉంటుంది. పెద్దపెద్ద చెట్లక్రింద అడవిలా అలుముకుపోయిన చిన్న చిన్న మొక్కలు తీగెలు - ఎండ వెలుగుని చూడటానికి ఒకదాన్ని ఒకటి త్రోసుకుని ముందుకు వస్తున్నట్లుంటాయి. ఈ జీవితపు పోరాటంలో మదించి విజృంభించిన ప్రక్కనున్న మహావృక్షపు నీడలో అణగిపడి ఉండే చెట్ల ఆకులూ కొమ్మలూ వెలవెలలాడుతూ ఎండి రాలిపోతున్నాయి. మిత్తి నెత్తిన కూర్చునిఉన్న వాటి దృష్టికి అడవినంతనీ మిలమిలలాడించే శరత్కాలపు ఎండ, పెపెమొలిచిన పూలచెట్ల పూలవాసనలతో గుబాళిస్తూఉండే పృథివి - తన సౌందర్య రహస్యాన్ని విస్తృతం చేసుకుంటూ కనుమరుగై పోతున్నట్లుంటుంది.

వాళ్ల ఇంటిప్రక్కనున్న ఆ అడవి ఇటు నీలిమైదానంవరకు, అటు ఏటిగట్టువరకు వ్యాపించి ఉంటుంది. అపూవాళ్ళ కది ఎంత తిరిగినా తరగనట్లే ఉంటుంది. అపూ అక్కతో కలసి, ఆ అడవిలో చాలాదూరం తిరిగాడు. కాని ఆ అడవి ఎక్కడితో ఆఖరయిందో తెలియలేదు వాడికి- 'తిత్తిరాజ్' చెట్లక్రిందుగా ఉన్నదారే ఎటుచూసినా- నాలుగువైపులా లావుపాటి తిప్పతీగెలు, గుత్తులు గుత్తులుగా ఉన్న 'వనచాల్‌తా' పళ్లు, ఇరుకుదారి ఒకటి కూమిడితోపుదాకా వచ్చి ఆగిపోతుంది. మళ్ళీ ఆ చెట్లక్రిందనుంచీ ఈ చెట్లక్రిందనుంచి అడవి బచ్చలి, ఉమ్మెత్త, పులిగోరుచెట్ల మధ్య నుంచి వెళ్లటం మొదలెడితే ఎక్కడ తేలుతారో తెలియదు. 'వన్ దుంధుల్' తీగెలో ఎక్కడో ఆకాశంలో వ్రేలాడుతున్నట్లుంటాయి. పెద్దపెద్ద దిరిసెన చెట్ల— పాకుడుపట్టిన కొమ్మల్ని పెపెమొలిచిన మొక్కలు కన్పిస్తూఉంటాయి.

ఈ అడవి, దాని శ్యామలత్వంలోని నూతనస్పర్శ వాడి మనస్సుని, వాళ్ల అక్క మనస్సునూ పులకింపచేస్తుంటాయి. పుట్టినప్పట్నుంచీ సుపరిచితమైన దీఅడవి వాళ్లకి క్షణక్షణమూ ఏవో తెలియని ఆనందంతో వాళ్లపిపాసుహృదయాల్ని అపూర్వ విచిత్ర రసానుభూతితో నింపి వేస్తూఉంటుంది వర్షాలకి నిగనిగలాడుతూ పచ్చగాఉన్న చెట్లపొదల మీది కరంజపుష్పాల పసుపుపచ్చని చివళ్లు, అస్తమయపు నీడలో పెద్ద అడవి ఉమ్మెత్త కొమ్మమీద మెల్లిగా అటూ యిటూ ఉడత ఒకటి తిరుగుతూండటం, కావలసినన్ని ఫలపుష్పాలు, అన్నిటికంటె, దట్టంగా అడవికి దగ్గిరగా ఉన్న పొదలమీది కొమ్మకొమ్మనీ ఏవో తెలియని పిట్టలు వ్రాలి ఉండటం— అలాంటప్పుడు వాడి మనస్సుకు కలిగే అపూర్వగంభీరానందాన్ని ఎవరికీ వర్ణించి చెప్పలేడు వాడు! అదేదో స్వప్నం, ఇంద్రజాలం, నాలుగువైపులా పక్షులు మధురంగా రొదచేస్తూ ఉంటాయి, జలజల పూలు రాలుతూంటాయి. సంజె నీడలు మరింత దట్టంగా అలుముకుంటూ ఉంటాయి.

ఈ అడవిలో ఒకచోట ఎక్కడో ఓ వింతయిన పురాతనపు చెరువొకటి ఉంది. దాని గట్టునే పాడు దేవాలయం ఉన్నది. ఇప్పుడు గ్రామదేవత 'పంచానన ఠాకూర్' ఉన్నట్టుగానే ఒకప్పుడు ఈ ఆలయంలో విశాలాక్షి దేవతకూడా అలా ఉండేది. ఊళ్ళో ముజుందార్ వంశీయులచే ప్రతిష్ఠింపబడిన దేవత ఆమె. ఒకప్పుడు తమ కోరికలు సిద్ధించటంతో వారు దేవి మందిరంలో నరబలులిచ్చారు. అందుకామె ఆగ్రహించి, తాను ఆలయం విడిచిపెట్టి పోతున్నానని కలలో కన్పించి చెప్పి వెళ్ళిపోయింది. మళ్ళీ తిరిగి రాలేదు. ఎన్నాళ్ళనాటి గాథో ఇది: విశాలాక్షి పూజలు జరగటం చూసిన వ్యక్తి అంటూ ఎవరూ సజీవులై లేరిప్పుడు ఆలయం అంతా పడిపోయింది. ఆలయానికి ఎదురుగా ఉన్న చెరువు పూడిపోయి, దొరువుగా మిగిలిందిప్పుడు. చుట్టూ అడవి అల్లుకుపోయింది. ముజుందార్ వంశంలో దీపం పెట్టటానికైనా ఎవరూ లేరిప్పుడు.

అయితే—అదీ చాలాకాలం క్రిందటి గాథే—ఊళ్ళో స్వరూప్ చక్రవర్తి పొరుగూరు భోజనానికి వెళ్ళి తిరిగి వస్తున్నాడు. సందెవేళ రేవుదాటి వస్తూ, దారి ప్రక్కన ఓ పదహారేళ్ళ సుందరి నుంచుని ఉండటం చూశాడు. ఊరికి దూరం ఆ ప్రదేశం. సందెవేళకూడా దాటిపోయింది. దారిలో ఎక్కడా ఎవరూ లేరు. అలాంటి సమయంలో అడవిప్రాంతంలో అల్పవయస్కురాలైన సుందరిని చూడటంతో స్వరూప్ చక్రవర్తి సహజంగా విస్మితుడయినాడు. కాని అతడింకేమీ మాట్లాడకముందే ఆ సుందరి కొంచెం గర్వమిశ్రితకంఠంతో— "నేను ఈ గ్రామంలోని విశాలాక్షి దేవిని. కొద్దిరోజుల్లో ఊళ్లో కలరా — మశూచికాలు ప్రారంభమవుతాయి. చతుర్దశినాటి రాత్రి 'పంచానందప్రదేశం' లో నూటయొనిమిది గుమ్మడికాయలుకొట్టి, కాళీపూజ చెయ్యమని చెప్పు..." ఆ మాట పూర్తి అవుతూ అవుతూండగానే—నిర్ఘాంతపోయి చూస్తున్న స్వరూపచక్రవర్తి కళ్ళయెదుటి నుంచి—ఆ సంజెవేళ అప్పుడప్పుడే అలుకు వస్తున్న మంచుతెరలో అంతర్హితురాలై పోయిందా సుందరి. ఇది జరిగిన కొద్దిరోజులకే ఊళ్ళో అంటువ్యాధులు ప్రబలాయి.

ఈ కథలన్నీ యెన్నిసార్లు విన్నాడు: కిటికీ ప్రక్కన నుంచోగానే విశాలాక్షి దేవత వాడికి స్ఫురణకు వస్తూ ఉంటుంది. విశాలాక్షీదేవి ఒక్కసారైనా ప్రత్యక్షం కాదా?"

* * *

హఠాత్తుగా ఆ అడవిదారిలోకి తిప్పతీగ దిగజారింది. ఆ సమయంలో—

చూపులకు చాలా చక్కగా ఉంది. ఎర్ర అంచు చీరె కట్టుకుంది. మెళ్ళోనూ-చేతుల్ని

★ పథేర్ పాంచాలి ★

అమ్మవారి నగల్లాంటివి ఉన్నాయి.

'ఎవరు నువ్వు?'

'నేను అపూని.'

'నువ్వు చాలా మంచిపిల్లవాడివి. నీకేం వరం కావాలి?'

* * *

వాడు పక్కమీద పడుకుని ఉంటాడు. ఒకొక్కమారు పిల్లగాలులమీదుగా ఎన్నో పూలతీగెల రకరకాల వాసనలు తేలివస్తూ ఉంటాయి. దూరాన ఎక్కడో పెద్దచెట్టు చిటారుకొమ్మను నీటి గ్రద్ద అరుస్తూ ఉంటుంది. ఈ కుగ్రామపు ప్రస్తుత సుఖదుఃఖాలకు అతీతంగా, శరత్కాలపు మిట్ట మధ్యాహ్న వేళ-నీలాకాశపథంలో - ఉదాసీనమైన సంచారదేవత మధురకంఠస్వరకీర్తి దూరదూరాలకు పోతూ ఎక్కడో విలీనమైపోతున్నట్టుంటుంది.

ఎప్పుడు నిద్ర వచ్చిందో తెలియదు, కాని నిద్రలేచి చూసేసరికి ఆట్టే ప్రొద్దు లేదు. కిటికీ బయట అడవి అంతా నీడలు వ్యాపించాయి. వెదురుచెట్లు చివర్లన నీరెండ పడుతోంది.

రోజూ ఈ వేళప్పుడు - నిర్జనారణ్యం కేసి చూస్తూంటే వాడికి అద్భుతమైన ఆలోచనలన్నీ వస్తూ ఉంటాయి. మనస్సుకి అపూర్వమైన ఆనందం కలుగుతూంటుంది. ఇలాంటి లతాపుష్పాదుల మధురవాసనలతో నిండిన రోజులు ఇదివరకుకూడా ఎప్పుడో ఒకసారి వచ్చి ఉంటాయి. అప్పటి అనుభూతానందపు అస్పష్టస్మృతులొచ్చి, ఈరోజుల్ని భవిష్యత్తులోని ఏదో అనిర్దిష్టానందపు ఆశలతో నింపివేస్తుంటాయి. ఏదో సంభవించబోతోంది, ఈ రోజులు వృథాగా వెళ్ళిపోవు. వీటికి ఆఖరిని ఏదో అనిర్వచనీయమైన ఆనందం కాచుకుని కూర్చుంది-అనిపిస్తూ ఉంటుంది.

ఈ అపరాహ్ణవేళలతో, పుట్టినప్పట్నుంచీ సుపరిచితమైన, ఆనందదాయకమైన ఈ అడవితో ఎన్ని అద్భుతమైన స్వప్నలోకపు విషయాలు పెనవైచుకుని ఉన్నాయి! వెదురుతోపుమీది ఛాయామయమైన ఆకాశం కేసి చూస్తూంటే-ఒక యువకవీరుని ఉదారతను అవకాశంగా తీసుకుని, ఎవరో ఓ యాచకుడు అతని కవచకుండలాలను అడిగి తీసుకునేందుకు చెయి చాచటం కన్పిస్తూ ఉంటుంది. ఇంత అంబలి త్రాగి వచ్చి, ఎవరో ఓ దరిద్రబాలకుడు సావాసగాళ్లతో పాలు త్రాగి వచ్చానని చెప్పి-ఆనందంతో గంతులెయ్యటం కన్పిస్తుంది. ఈ పాడుపడ్డ నివేశనంలోని బిల్వవృక్షం క్రిందనే అంపశయ్యమీద పడుకున్న భీష్మునికి - తన తీక్ష్ణశరంతో పృథివిని ఛేదించి అర్జునుడు పాతాళగంగను పైకితీసుకువచ్చి నోటికిఅందించింది! దశరథమహారాజు తన తొలియావనంలో సరయూతీరమందలి వనానికి వేటకై వెళ్ళి, నీళ్లు ముంచుకుంటున్న పేద బాలకుణ్ని బాణంతో కొట్టింది. ఇక్కడే ...అది సరిగా రాణాదీదీవాళ్ళ పెద్ద తోటలో జామచెట్ల దగ్గిర దొరువున్నదే—దాని ఒడ్డునే జరిగింది.

వాళ్ళింట్లో ఓ పుస్తకం ఉంది. అందులో కాగితాలు బూడిదరంగు తిరిగాయి. బైండు కొంత చిరిగిపోయింది! 'వీరాంగనా కావ్యం' అని రాసి ఉంది దాని మీద. రచయిత పేరుమాత్రం తెలియదు. మొదటి పుటలు కొన్ని చిరిగిపోయాయి పుస్తకం మాత్రం చాలా నచ్చింది......

ఊరికి ఉత్తరపువైపుతోపులో "కుటాయీచండీ" వ్రతంరోజున జరిగే వనసంతర్పణకు తల్లితోకూడా వెడుతూంటాడే — ఎవరూ ఎరుగరు కాని, చుట్టూ అడవి పెరిగి ఉన్న ఆ చిన్నదొరువే మహాభారతంలో వర్ణింపబడిన ద్వైపాయనహ్రదం. ఆ నిర్జనప్రదేశంలోని దొరువులోనే తొడలు విరిగి, అవమానితుడైన ఆ వీరాధివీరుడు—ఒక్కడూ పడి ఉంటాడు. ఎవరికీ కనబడడు, ఎవరూ కనుక్కోలేరసలు. ఉత్తరపువైపు వంకచేలల్లోంచి రైతులు వెళ్లిపోతారు-ఎక్కడా ఒక్క పిట్టయినా ఉండదు—సోనాడాంగా మైదానాని కవతల ఎవరూఎరుగని, నివాసాలేవీ లేని అజ్ఞాతప్రదేశంలో కృష్ణపక్షపు రాత్రుల కారుచీకటి క్రమక్రమంగా క్రమ్ముకుంటూ ఉంటుంది—అలాంటప్పుడు వేల సంవత్సరాలక్రితపు మానవుల వేదన, ఒకొక్కప్పుడు పేదతండ్రి ప్రవంచనకి గురి అయిన అమాయక బాలుని ఉల్లాసంతో, ఒకొక్కప్పుడు దురదృష్టవంతుడు, నిస్సహాయుడు, అసహాయశూరుడూ అయిన రాజపుత్రుని చిత్తవృత్తితోనూ, ప్రవర్ధమానమవుతున్న వాడి ఉత్సాహపూర్ణహృదయంలోని సానుభూతితోనూ, ప్రాగ్భౌతమూ, సార్థకమూ అవుతూ ఉంటుంది. ఈ పేరు తెలియని రచయిత పుస్తకం చదువుతూంటే వాడికన్నిసార్లు కళ్లు చెమర్చాయి!

వాళ్లనాన్న ఇంట్లో లేడు. ఉంటే తాను ఇతరధ్యాసలన్నీ వదులుకుని పుస్తకాల దప్తరం విప్పుకుని, ముందుపెట్టుకు కూర్చోవాలి. ప్రొద్దు సాంతం క్రుంకితున్నా వాడి కక్కడినుంచి విముక్తి ఉండదు. వాడి మనస్సు తహతహలాడుతూంటుంది.

ఇంకా ఎంతసేపని అలా "శుభంకరి" లోని వృత్తాలు బట్టీపడుతూ కూచోటం! అవాళ్టికింక ఆడుకోవటం మానాల్సిందేనా! ఇంకా ప్రొద్దెక్కడుందేమిటి! తండ్రిమీద కోపమూ అభిమానమూ కరిగిపోయేవి!

హఠాత్తుగా తలవనితలంపుగా వాడికాపూట సెలవు దొరికేది. పుస్తకాల దప్తరం దభీమని ఎలాగో ఓమూల పారేసి, బాగా నీడగా ఉన్న ముంగిలిలోకి పోయి గంతులెయ్యటం మొదలెట్టేవాడు.

అపూర్వమూ - అద్భుతమూ అయినసంధ్యవేళ నీడబాగాఉన్న చెట్లదగ్గిరగా బొమ్మరిల్లు ...తిప్పతీగెలు తంతితీగల్లా కట్టిఉంటాయి ... ఖర్జూరపుమట్టలు ఒరిగి ఉంటాయి ... అడవివైపునుంచి చల్లటి వాసనలొస్తూ ఉంటాయి... పెదనాన్నగారి పాడుపడ్డ స్థలంలోని పంపరపనసచెట్టు చివరని నీరెండ తళతళలాడుతూంటుంది ...... నిగనిగలాడే బాదంకాయరంగు రెక్కలుగలపిట్ట అడవి బచ్చలిపాదమీదికి ఎగిరివచ్చి వాలుతూ ఉంటుంది. క్రొత్తనుకివాసనలు ... చిన్నపిల్లల జగత్తు ఎంత ఆనందంతో నిండి ఉంటుందో-ఆ ఆనందాన్ని ఇతరులకెవ్వరికైనా ఎలా తెలియచెప్పటం!

సందెపడ్డాక సర్వజయ బియ్యం పొయ్యిమీద పెట్టింది. అపూ వసారాలో చాప వేసుకు కూర్చున్నాడు. కటికచీకటి. కీచురాళ్లధ్వనులు విన్పిస్తున్నాయి

"దసరాపండగ కింకా ఎన్నాళ్ళున్నాయి అమ్మా?" అని అడిగాడు అపూ.

దుర్గ కత్తిపీట ముందు పెట్టుకుని కూర తరుగుతూ కూర్చుంది. "ఇంకా ఇరవై రెండు రోజులున్నాయ్. కాదమ్మా?" అంది.

ఆ పిల్ల లెక్క సరిగ్గానే వేసింది. వాళ్ల నాన్న ఇంటికివస్తాడు, తనకి, తమ్ముడికి, అమ్మకి బొమ్మలు, కొత్తబట్టలు తెస్తాడు.

తానిప్పుడు కొంచెం పెద్దదవుతోందని వాళ్ళఅమ్మ పొరుగిళ్ళకి ఎక్కడికీ భోజనానికి వెళ్ళనివ్వటంలేదు. పూరీలుతింటే ఎలాఉంటాయోకూడా మరచిపోయింది తాను. కళకళలాడే కరబూర్తిమనాటి వెన్నెల రాత్రి వెదురుతోపులో నీడలు ప్రాకిన దారినే నడుస్తూ అందరికంటె ముందు అందరి యిళ్ళకీ పోయి, లక్ష్మీనోము

తాలూకు పేలాలు, బొరుగులు, అటుకులూ కొంగునిండా మూటకట్టుకు తెచ్చుకునేది. ప్రతియింటా శంఖధ్వనులు విన్పిస్తూ ఉంటాయి. దారే వెడుతూంటే పూరీలు వండుతున్న వాసనలు వస్తూ ఉంటాయి. అమ్మవారి సాయంత్రపు నైవేద్యం ఎవరైనా తమయింటికి పంపితే యేం! తాను చాలా పేలాలు-భొరుగులు తెచ్చేది. రెండు రోజులు అమ్మ అవే తనకు చిరుతిండిగా పెట్టి, తానూ తింటుంది. ఆసారి చిన్నఅమ్మమ్మ గారు-'అయిన ఇంటి ఆడపిల్ల శూద్రపిల్లలాగా పేలాలూ అవీ తెచ్చుకోటానికి ఇంటింటికీ తిరగడమేమిటి? చూసేవాళ్ళకు బాగుండవు అలాంటివన్నీ. అలా ఇంకెప్పుడూ పంపకు అమ్మాయీ!' అన్నది. అప్పటినుంచీ తానెక్కడికీ వెళ్ళనేలేదు.

"పేక ఆడుకుందాం రా?" అని అడిగింది దుర్గ.

"ఊఁ. ఆ గదిలోకివెళ్ళి పేక తీసుకురా ఆడుకుందాం మరి!"

దుర్గ బిక్కుబిక్కుమంటూ అపూ ముఖం కేసి చూసింది. అపూ నవ్వుతూ "పద, నేనున్నానుగా!" అన్నాడు.

"దానిభయం చూడాలి! రోజురోజల్లా ఊరంతా ఆగమ్మకాకిలా తిరగటానికేం భయంఉండదు, కాని రాత్రిళ్లు ఈ గదిలోనుంచి ఆ గదిలోకి వెళ్ళమంటే చాలు ఎక్కడలేని భయంతో బిగుసుకుపోతుంది" అన్నది తల్లి.

శిష్యులింటినుంచి - ఎక్కడినుంచో అపూ తెచ్చిన చీట్లపేక అది. పేక ఆడటంలో ముగ్గురూ ముగ్గురే...అపూ కింతవరకు ఏ రంగు ఏదో తెలియదు. మధ్య మధ్య తన చేతిల్లో ముక్కలు అవతలపార్టీలోకూర్చున్న తల్లికి చూపిస్తూ - "ఇదేం రంగు? డైమనా చూడు అమ్మా!" అని అడుగుతూంటాడు.

దుర్గకివాళ చాలా హుషారుగా ఉంది. రాత్రిళ్లు సాధారణంగా వంట చెయ్యటం ముంటూ ఉండదు. మధ్యాహ్నం వండిన అన్నం, కూరే మామూలుగా రాత్రిళ్లుకూడా. ఇవాళ అన్నం - కూరకూడా వండుతోంది. అది దుర్గకు చాలా సంతోషంగా ఉంది. ఇవాళేదో పండుగలాగుంది. ఆట ఆడుతూ "కథ ఏదైనా చెప్పరాదా అమ్మా?" అని అడిగాడు అపూ.

"ఆట ఆడేప్పుడు కథలు చెపుతూ కూచుంటే ఆట ఎలా సాగుతుందిరా? చాల్లే-" అన్నది దుర్గ.

"తామ్మలకాయలు (టొమాటో?) ఇవాళ ఎక్కడ దొరికాయే దుర్గా?" అని అడిగింది సర్వజయ.

"గోసాయిగారి పెద్దతోట లేదూ, అవు దూడను వెతకటానికి నువ్వూ నేనూ వెళ్లలేదూ ట్రా అపూ? అక్కడ చాలా ఉన్నాయి. ఎవరికీ కనపడవు అమ్మా, పెద్ద అడవికదూ, లేకపోతే ఎవరైనా చూస్తే తెచ్చుకోనిచ్చేవాళ్లా!" అన్నది దుర్గ.

"అక్కడికి వెళ్ళావా? అదంతా పెద్ద అడవికదూ అక్కా?" అన్నాడు అపూ.

సర్వజయ పుత్రవాడిముఖంకేసి వాత్సల్యం ఉట్టిపడేట్లు చూడసాగింది. అప్పటి ఆ అపూ - 'చందమామ రావే - జాబిల్లి రావే- పాపాయి పాట్లలో పాలుపోసి పోవే-' అని పాడుతూంటే చందమామకేసి బోసి నోరు తెరుచుకునిచూస్తూ ఉండేవాడు - వాడేనా ఇప్పుడు తనతో పేక ఆడటానికి కూర్చుంది! ఆమె కాచిత్తరువు ఎప్పుడూ క్రొత్తగానే ఉండేది. వాడికిప్పుడు ఆడటం చేతకాక పోయినా, ఒక్క 'పట్టు' అయినా వాడు గెలవలేకపోయినా సరే - అపూ చేతికి పాడి ముక్కలన్నీ పడి, తనకు మంచి ముక్కలు వచ్చినా, వాడు అవతలిపక్షంలో కూర్చున్న వాడయినప్పటికీ ఆమె మనస్సుకు కష్టంగానే ఉండేది!...

"ఇవాళ ఏంజరిగిందో తెలుసా అమ్మా?" అని అడిగింది దుర్గ.

"ఫో. అయితే నీకూ నాకూ పార్టి. చెప్పు చూద్దాం మరి!" అన్నాడు అపూ.

"అయితే అయిందిలే, చూడు అమ్మా, వీడికి గసగసాలంటే ఏమిటో కూడా తెలియదు. రాజీవాళ్లయింట్లో గసగసాలు ఎండబోశారు. 'అవేమిటి రాజీదీ?' అని అడిగేడు వీడు. 'తినిచూడు తియ్యగా మధురంగా ఉంటాయి' అన్నది రాజీది. అక్కడికిపోయి ఆ గసగసాలుబొక్క వచ్చాడమ్మా వీడు. అవి గసగసాలనికూడా కనుక్కోలేకపోయాడు. అంత వెర్రివాడు! కాదమ్మా?" అన్నది దుర్గ.

అక్కతో తానెప్పుడూ దెబ్బలాటపెట్టుకోనని అపూ లోగడ మాట ఇచ్చాడు. అదే చక్కగా పండిన 'మాకాల్' పళ్లు సతూదాయెత్తుకుని పారిపోయినరోజున, దుర్గ సాయంత్రందాకా అడవి అంతా గాలించి గాలించి, ఎక్కడినుంచో ఇన్ని పళ్లు కొంగున మూటకట్టుకువచ్చి, వాడిముందర పోసి, "ఏం, సరేనా ఇహ? ప్రొద్దునల్లా తెగ ఏడ్చావుగా!" అన్నది. ఆ రోజు సాయంత్రం వాడికంత సంతోషం అన్ని పళ్లు చూడటంవల్ల కలిగిందో, అక్క ముఖం-ముఖ్యంగా ఆ పిల్లదాని చారెడు కళ్లలో తొణికిసలాడిన అపేక్షతో కూడిన చిరునవ్వును చూడటంవల్ల కలిగిందో— వాడికి తెలియదు.

"గాడిద ఆటరా అపూ! జాగ్రత్తగా ఆడు" అన్నది దుర్గ పేకముక్కలు కలిపి వేస్తూ....

(56-వ పేజీ చూడండి)

కాగ అనేదప్పుడూ, కొరతలుపు మళ్లీ వేసినప్పుడూ స్పష్టంగా వినపడ్డాయి.

"గుడ్ నైట్ డేడీ" అది నా కోరికంతు.

"గుడ్ నైట్... రేపు సాయంత్రం వాళ్లు గంటకల్లా క్లబ్ కి రావాలి. గ్లాడిస్, సుందరీ వాళ్లున్నారక్కడ మన్నారు" అంది కేశి.

"అల్రైట్... అల్రైట్, ఇంకా వీలయితే రెండింటికే వచ్చేస్తాను. నువ్వు మాత్రం రెడీగా ఉండు. రెండు 'ప్లైమౌత్' కార్లలో వార్నని కొస్తే."

"అలాగే డాడీ... చీరియో"

"చీరియో"

మేడమీద నాన్నగారి గొంతుకుండా పేపరు చదువుకుంటూ నేను, నాన్నగారి పక్క కుర్చీమీద అమ్మా కూర్చున్నాం. అంతవరకూ కోపం చెప్పకుండా ఉన్న ముఖం మీద సింహావలోకనం చేసింది నా అమ్మ.


శ్రీ బి. వి. రమణారావు

నేనూ నాన్నగారూ మాత్రం యాంత్రికంగా మౌనం వహించాం. మేడ మెట్లమీద కోకి చెప్పుల చప్పుడూ, కూనిరాగం వినబడుతున్నాయి.

సిన్నబీ కోకిల్ మేడకు తగిలించే ప్రయత్నంలో గాత్రం కూని రాగం మానేసింది. గదిలో ప్రవేశిస్తూనే "ఏమిటి అంతా చింతించుకుంటూ కూర్చున్నారు!" అంటూ తనూ కుర్చీ లాక్కుని కూర్చుంది. నేను గుండెని మార్చుకునేంత స్థైర్యం లేనివాడినై పేపరు కింద పెట్టలేదు. నాన్నగారు కూడా పుస్తకం మూసినట్టు కనబడదు. నేను నవ్వుకున్నట్లు అమ్మ అనుకుంది.

అమ్మ:- ఏమే అమ్మాయీ! రాత్రి తొమ్మిది గంటలకైనా రెడీగా ఉంటున్నావా... నాకు తెలియాలనుకుంటాను!

కోకి:- తెలియాలనుకుంటే, తెలుసుండే ఉంటారు.



విశ్రాంత వ్యక్తి

(బ్రిటిష్ శిల్పి హెన్రీ మూర్ చేసిన శిల్పం. కేవలం అనుకరణ కాని శిల్పి హెన్రీ మూర్ అధునాతన శిల్పులలో సాటిలేనివాడని కొందరు విమర్శకుల అభిప్రాయం.)

అ :- పెళ్ళికాని పిల్లవి. చీకటి పడే లోగా ఇంటికి రమ్మని నీకు ఎన్నిసార్లు చెప్పాలి?

శో:- పెళ్ళయినపిల్లకయితే ఆ నిర్బంధం లేదా ఏమిటే!

అ:- అదుగో ఆ డొంకతిరుగుడుసమాధానాలే కూడదనంట.

శో: నువ్వేసిన ప్రశ్న డొంకతిరుగుడు ప్రశ్న కాదూ? 'ఇంత ఆలస్యం ఎందుకయిందే' అని అడుగుతే...'టెన్నిస్ ఆడుతున్న తర్వాత నేనూ శశి కలిసి బీచ్ కి షికారెళ్ళాం. అందుచేత ఆలస్యమైంది' అని చెప్పేదాన్ని.

అ:- బీచ్ షికార్లూ, కాలేజీ మీటింగులూ, క్లబ్బు టెన్నిస్లూ, సినిమాలూ ...

శో: బర్త్ డే పార్టీలు, కాలేజి డ్రామా రిహార్సల్సు. మ్యూజికల్ ప్రాక్టీసులూ... ఏవో ఒకటి రోజూ ఇంటికి పెందరాళే రావటానికి అడ్డంవస్తూనే వుంటాయంటావు...అవునా అమ్మా?

అమ్మ అసహాయస్థితి చూస్తే నాకే జాలేసింది. అసలు శోభతో వొచ్చిన పేచీయే అది. తన హాస్యరసం, తెలివితేటలూ ప్రదర్శించాలనే మాట్లాడుతుంది కాని ఎదుటివాళ్ళ హృదయం అర్థం చేసుకోటానికి ప్రయత్నించదు. కానిఇన్నాళ్ళకి అమ్మ శోభ పెళ్లివిషయం అటో ఇటో తేల్చెయ్యాలన్న పట్టుదలతో వుంది. అసలు అమ్మకూడా ఓపట్టాన్ని లొంగేమనిషి కాదు.

అ :- అయితే రేపొద్దున పెళ్ళయితే రాత్రి తొమ్మిది గంటలకి క్లబ్బునుంచి ఇంటికొస్తే ఇంట్లో వంట వెనగ చేసి పెడతారూ?

శో :- ఓస్ ...... పెళ్ళయినప్పటి మాట కదా... అప్పుడే ఆలోచించుకోవచ్చు.

అ :- ఇంకా ఎప్పుడో అనుకుంటున్నావేమో. ముహూర్తం నిశ్చయించి రేపు మాఘమాసంలో చేసెయ్యడమే

శో :- నువ్వు మా నాతో యే పెళ్లి కొడుక్కి ఓ పెళ్లికూతుర్ని కూడా నామ చేసేద్దాం.

అ :- ఏమిటే నీ ఉద్దేశం! ఇంకో యేడాదిలో నీ కిరవైయేళ్ళొస్తున్నాయి ఇంకా నలభయ్యేళ్ళు వెళ్ళానుతావా?

శో :- నువ్వన్న యిరవైయేళ్ళకి, నువ్వు చెప్పబోయే నలభైయేళ్ళకి మధ్యనున్న వ్యవధిలో ఎప్పుడో ఒకప్పుడు పెళ్లాడొచ్చు.

దానితోటి "బెల్లంకొట్టిన రాయిలా అలా కూర్చుంటారేమిటండీ" అన్నట్టు అమ్మ మొహంపెట్టి నాన్నగారికేసి చూసింది. నాన్నగారిది గమనించి పుస్తకం మూసేసి "శోభా! బి. యే చదువుతున్నావన్న మాటేకాని కన్నతల్లితో ఎలా మాట్లాడాలో నీకు తెలీదు. నవమాసాలు మోసి......"



డాలు ధరించిన యోధుడు
(ప్రసిద్ధ శిల్పకారుడు హెన్రీ మూర్ శిల్పం)

★ తెగులు కుదిరింది ★

శో:- అదికాదు నాన్నా......

అప్పటికప్పుడే తన విధ్యుక్తధర్మాన్ని నెరవేర్చేసినట్లు మళ్ళీ పుస్తకంలోకి తల దూర్చేశారు నాన్నగారు. అమ్మ నావైపు తిరగటంతోటే శోభకూడా నావైపు తిరిగింది. తక్షణం పేపరు పైకెత్తేశాను.

శో:- పోనీ నువ్వు చెప్పు అన్నయ్యా... ఇప్పుడు నా పెళ్ళికేం తొందరొచ్చింది? నా చదువు పూర్తవకుండా ఈ నిర్బంధం ఏమిటి? ఇప్పుడు నీ చదువు మానెయ్యమంటే నీ కెలాగుంటుంది?

అ:- అన్నయ్య చదువుకుంటాడు. ఉద్యోగం చేస్తాడు. నువ్వుకూడా ఉద్యోగం చేస్తావా?

శో: అవసరమైతే చేస్తాను. లేదా చదువుకోటంలో తప్పేముంది?

నిజానికి నా కిలాంటివాదనంటే కిట్టదు. పైకంటే కోప మొస్తుంది కాని, నూటికి తొంభయిమంది ఆడాళ్లు ఈ రోజుల్లో డబ్బుంది కనక, మా శోభలాగ ఈ కాలేజీ వాతావరణం, ఈ స్నేహితులూ, ఈ సరదాలు విడిచిపెట్టలేక సాధ్యమైనంతవరకూ విద్యార్థిదశను పొడిగించుకోవాలన్న ఉద్దేశ్యంతో చదువుకుంటున్న వాళ్ళే. వాళ్ళ లక్ష్యమల్లా సమాజంలో వాళ్లు చదువుకున్న నవనాగరిక నారీమణులుగా చలామణీ అవటమే. ఏ కొద్దిమందో స్వతంత్రజీవిత సాధనకోసం, మరికొందరు సహజమైన విద్యాభిలాష మూలంగా చదువుకుంటారు. నాకు తెలిసినంతవరకూ మా శోభ చివర రెండు తరగతుల్లోకీ రాదు. ఇంతకీ నేను మాత్రం నోరు విప్పలేదు.

అ:- చదవేస్తే వున్న మతీ పోయిందనీ!... కొన్నాళ్లుపోతే పెళ్ళే వద్దంటావను కుంటాను.

శో:- చదివి, మతి పోగొట్టుకోకముందే పెళ్ళాడే పూచీ నాది. అమ్మా! కాలాన్ని పట్టి మనుషులు పద్ధతులూ, కట్టుబాట్లూ మార్చుకోవాలి. వెనకటిరోజుల్లాగే ముందు రోజులూ వుంటాయనుకోకు. నా పెళ్ళి గురించి నువ్వేమీ బెంగెట్టుకోవద్దు. పెళ్ళి చేసుకుంటాను. అది నా యిష్టమొచ్చినప్పుడు నా కిష్టమైనవాణ్ణి. మానవజన్మెత్తినందుకు మొగాడు భార్య నెన్నుకోవడం, ఆడది భర్త నెన్నుకోవడం కనీసస్వతంత్ర మనగట మన్నమాట

'నీకు స్వతంత్రమిస్తే... దిలీప్‌కుమార్‌నో దేవానంద్‌నో...' అనేద్దామనుకున్నాను కాని మళ్లీమాటలుమింగేశాను. ఈ రోజుల్లో ప్రతి చదువుకున్న ఆడదానికీ ఉపన్యాస ధోరణిలో మాట్లాడటం పరిపాటైపోయింది. ఎందుకూ! ఆ మధ్య గోదావరి వరదలసందర్భంలో వీళ్ళ కాలేజిసెక్రటరీట ప్రతిభాదేవి చందాకోసం నాన్నగారిదగ్గిర కొచ్చిన రోజున-అదృష్టవశాత్తూ పడకకుర్చీలోకూర్చున్నాను కనక సరిపోయింది. అదేమిటో వినేమనిషి ఒక్కడే అయినా నిండుసభలోలాగ ఒళ్ళు తెలియని ఆవేశంలో, దారుణ దృశ్యాలు కళ్లకి కట్టినట్టు వర్ణిస్తూ, పెద్ద ఉపన్యాసం. చివరకి చెక్కుమీద సంతకం పెడుతూంటే నాన్నగారి చెయ్యి వణకడం కళ్ళారా చూశాను.

ధోరణి కొంచెం తీవ్రంగా వుందని లాగుంది నాన్నగారు కలగజేసుకున్నారు.

నా: అదికాదు శోభా. కామేశం ఈ మధ్య హైదరాబాద్ వెళ్ళాడట. మళ్ళీ తిరిగి వెళ్లిపోతూ ఎల్లుండి యిక్కడ దిగుతానని రాశాడు. మొన్న మీఅత్తయ్యరాసినవుత్తరం బట్టి ఈ సారి వీడు దిగటంచూస్తే....

అ:- పెళ్లిచూపుల కొస్తున్నాడన్నమాట.

శో:- సరే వద్దంటేమాత్రం మానాడు కనక నా...రానీ.

కామేశం మా మేనత్తకొడుకు. కామేశం తండ్రి స్వతహాగా ఆస్తిపరుడు. దాన్ని కాస్తో కూస్తో వృద్ధిచేసి కామేశానికి పదో యేడు రాకుండానే పరమపదించాడు. ఒక్కడే సంతానం అవటంవల్ల మా అత్తయ్య వీణ్ణి ఎంతో గారాంగా పెంచింది. దానా దీనా వాడికి జ్ఞానమొచ్చింది మొదలు (అసలు జ్ఞానం రాలేదని మా నాన్నగారి అభిప్రాయం) ఇంతవరకూ ఫెయిలవకుండా ఒకక్లాసూ ప్యాసవలేదు. నేనూ వాడూ ఒకేయీడువాళ్ళం. అంటే శోభకంటే నాలుగేళ్ళు పెద్ద. శోభ బి. యే. మొదటేడు చదువుతోంది. కామేశం ఇంటర్ రెండో యేడు రెండేళ్ళనుంచి చదువుతున్నాడు.

అ: ఎంత అప్రతిష్ట! మనం వాళ్ళ కాళ్ళావేళ్ళాపడి సంబంధం నిశ్చయించుకోవల్సింది. వాళ్ళంత వాళ్లొచ్చి అడుగుతే మనమిలా బిగుసుకుపోవడమా!

నా: శోభా...నువ్వు అమ్మ చెప్పే విషయాలు జాగ్రత్తగావిని ఆలోచించి నిశ్చయించుకుంటే, మనం అటో యిటో నిర్ధారణ చేసుకుని, అత్తయ్యకి రాసేస్తే మన బాధ్యత తీరిపోతుంది.

అ: అటో యిటో ఏమిటండీ!... మొదట్నుంచీ మీ కిష్టంలేదీ సంబంధం మనకి కావాల్సిన దగ్గిరసంబంధం. ఒకటికి పదిసార్లు నచ్చచెప్పవల్సింది పోయింది.... పైగా అక్కర్లేదని చెప్పేసే బాధ్యతతీరిపో తుందని బోధిస్తున్నారు! ఇంకేమనుకోనూ!

నా: అయితే దాన్నాలోచించుకోనివ్వవా ఏమిటి? దగ్గిరసంబంధం దగ్గిరసంబంధమని దండకం చదువుతావు. మా అక్కయ్య కొడుకు నాకు దగ్గిరో దూరమో నువ్వు చెప్పాలా? అదీ చదువుకుంది....

అ:— అదుగో ఆ చదువే కొంప ముంచింది. ఆ ఇంటర్మీడియట్‌తోనైనా దాని చదువు ఆపేసి పెళ్ళిచేస్తే బాగుండేది; ఇప్పుడింతకీ అతగాడో క్లాసు తక్కువలో వున్నాడనేకదా ఇంత పెంకితనం.

శో:- ఇంత పెంకితనంగా వున్న నన్ను పెళ్ళాడిమాత్రం ఏం సుఖపడతాడే బావ?

అ:- సరే ఇది మామూలు పాటే ఈ యింట్లో ఒకప్పుడుమాత్రం నా మాట చెల్లిందా కనక నా.

అమ్మనుచూస్తే జాలేసింది. "నా పెళ్ళి విషయంలో నీ మాట చెల్లిస్తానమ్మా. నీ యిష్టమొచ్చిన పిల్లని నేను పెళ్ళాడతాను" అందామనుకుని, మళ్ళీ చటుక్కున మా మేనమామకూతురుమాట జ్ఞాపకమొచ్చి నోరు మూసుకున్నాను. అసలు నిజం చెప్పాలంటే నాన్నగారికికూడా యీ సంబంధం యిష్టం లేదు. దానికి కారణాలు ఒకటి చదువు.... రెండు పెద్ద అంతస్తులో వున్న సంబంధం ఏదైనా చెయ్యాలనీ, కామేశానికిచ్చి పెళ్ళిచేస్తే, ఆస్తి చూసి వితంతువయిన అప్పగారితో వియ్యమందేడని లోకులనుకుంటారన్న అభిమానం...మూడు ఎవరి దగ్గిరా భయభక్తులులేకుండా పెరిగిన కామేశం రేపొద్దున్న ఎలా తయారవుతాడోనన్న భయం.

* * *

బావ మెయిలు కొస్తాడని తెలుసుండీ కూడా స్టేషన్‌కి వెళ్ళలేదు. వెళ్ళమని ఇంట్లో ఎవళ్ళూ అనాలేదు. బావమాట తలుచుకుంటే గుండెల్లో దడగావుంది. వాడురాకపోయినా బాగుండుననిపించింది.


నా: ఏరా నీకు కాలేజీ టైం అవలేదూ?

నే: ఇవ్వాళ కాముడొస్తున్నాడని వెళ్లలేదు.

నా: ఓహో! మరి శోభా?

నే: వెళ్ళిందట.

ఇంతకీ నాన్నగారుకూడా ఆఫీసు కెళ్లే ప్రయత్నంలో వున్నట్టు లేరు. అమ్మ యీపాటికి వంటయిందని కబురంపేది. ఇవ్వాళ అదీలేదు. ఏమిటో యింట్లో అందరం జడ్డీ తీర్పుకోసం ఎదురుచూసే నేరస్థుల్లాగ కాముడికోసం ఎదురుచూస్తున్నామా అని.


'ఓహో! లైఫ్‌బాయ్ సబ్బుతో
ఇప్పుడు స్నానం చేయుట అవుసరం'
- అది సంతృప్తి కరమైన
శుభ్రతాభావమును కలిగించును!
LIFEBUOY
SOAP

★ తెగులు కుదిరింది ★

పించింది. కాముడు నాలుగు సంవత్సరాల తర్వాత వస్తున్నాడు. ఈ పాటికి ఎంత మారిపోయి వుంటాడో! ఇదివరకు వాడు మా యింటికి వొచ్చినప్పుడల్లా వాడూ శోభకీ ఏదో వొకటి పట్టుకొచ్చేవాడు. ఈసారి ఏం పట్టుకొస్తాడో. తన్ను పెళ్ళాడటం శోభకి యిష్టం లేదని తెలుస్తే ఎంత చిన్నబుచ్చుకుంటాడో. తర్వాత బావకి ఎలాగ నా మొహం చూపెట్టడం!...ఇలా ఆలోచిస్తూ కూర్చున్నాను.

అప్పుడే కింద వంటింట్లో బావగొంతు వినబడింది. రిక్షావాడూ, వెంకన్నా కలిసి ఒక పెద్ద ట్రంకుపెట్టె, బెడ్డింగూ మేడ మీదికి మోసుకొచ్చి హాల్లో పడేశారు. కుర్చీలోంచి లేద్దామా, మాన్దామా అని తటపటాయిస్తూంటే రెండు అంగల్లో మేడమెట్లెక్కేసి వచ్చి "ఓరి! నేనుకొస్తానంటే ఇక్కడె కూర్చుని పాఠాలు వల్లిస్తున్నావ్రా!" అంటూ భుజంమీద చరిచాడు.

"వచ్చే ... కొద్దిగా ..." అనబోతున్నాను.

కా: ఏం మామయ్యా...పాఠం అప్పచెబితే నేగాని బయటకెళ్ళొద్దన్నావా ఏమిటి వీణ్ణి...ఇంత దిట్టగా చదువుతున్నాడు.

నా: ఆఁ...ఏరా కాముడూ అమ్మ కులాసాగా వుందా?

కా: ఉంది కాని మీ మీద చాలా కోపంగా వుంది. నువ్వూ అత్తయ్యా అటు రావటం మానేసేరు, సరికదా కుర్రాణ్ణి కూడా పంపించనందుకు చాలా కోపంగా వుందని చెప్పమంది.

నా: వాణ్ణి వొద్దామనుకుంటూనే వున్నారు. ఎప్పటికప్పుడే ఏవో చదువులూ, పరీక్షలూ...పోనీ నువ్వు రావటానికేంరా?

కా: ఏటికొకసారి పరీక్షల కెళ్ళేవాళ్ళకే తీరుబడిలేదు. కాని సెప్టెంబరూ మార్చి— రెండుసార్లు వెళ్ళాలికదా, నాకు తీరుబడి వుంటుందా మామయ్యా!

"నీకు ప్యాసయ్యితీరాలన్న పట్టింపు లేదుగా" అంది శోభ కాఫీగ్లాసు లందిస్తూ

"అబ్బో! పిట్ట కూతపట్టిందే! మామయ్యా ఇంక లాభంలేదు. దీనికి త్వరగా పెళ్ళి చేసెయ్యాలి."

నేనూ నాన్నగారూ బలవంతంగా చిరునవ్వు మొహంపెట్టేం. శోభ గెంతుకలు వెనక్కిసింది.

కా: మరి శోభా...యివ్వాళ నీకు బడి లేదూ?

శో: ఇంకా నీకు పాతలవాటు పోలేదు.

కా: ఓ...తూనాబొడ్డు...కాలేజ్.

శో: లేదు. నువ్వొస్తేవని శెలవిచ్చేరు.

కా: ఆఁ ... అనుకున్నానుసుమీ ... మామయ్య ఆఫీసుకుకూడా శెలవేమో.

నా: సరేకాని...ఇన్నాళ్లూ హైదరాబాద్‌లో ఏం చేస్తున్నావురా? అప్పుడెనగా వెళ్ళినవాడివి.

బావ ఫెల్ట్ హేట్ చేతులో తిప్పుతూ నేరాన్ని ఒప్పుకునే ధోరణిలో అన్నాడు: "క్రికెట్ మేచ్ అయిపోగానే తిరిగొచ్చేద్దామనుకున్నాం. అక్కడనుంచి మా స్నేహితులందరూ అజంతా, ఎల్లోరాలు వెళ్దాలన్నారు. అవన్నీ తిరిగివచ్చేటప్పటికి నెహ్రూమీటింగన్నారు సరే అయిన ఆలస్యం ఎలాగాఅయింది. నెహ్రూను చూసినట్టూ వుంటుంది, విశాలాంధ్ర సంగతి తేల్చుకున్నట్టూ వుంటుందని ఆగిపోయాం.

శో: అయితే నెహ్రూను కలుసుకు మాట్లాడేవన్నమాట.

కా. ఆఁ...నాకంత తీరుబడేది? నెహ్రూ బోయేటప్పుడు మాత్రం జైకొడుతున్నట్టు చెయ్యూపేను. నెహ్రూకూడా సరేనన్నట్టు చెయ్యూపేడు. అంతే తిరిగొచ్చేశాను

శో: అబ్బా! అంతమందిలో నెహ్రూ నిన్నానవాలుకట్టేడేం!

"అంతమందిజనంలో వుండే ఖర్మేమిటి. ప్రత్యేకంగా ఏ చెట్టో, ఎలక్ట్రిక్ స్తంభమో ఎక్కి వుంటాడు" అన్నాను బావ ఫెల్ట్ హేట్ లాక్కుని బావ నెత్తిమీదే పెడుతూ.

* * *

అన్నం వడ్డిస్తూ అమ్మ "కామేశం... ఇప్పుడు నువ్వు హైద్రాబాదు ఎందుకు వెళ్ళేవో చెప్పేవుకావు" అంది

కా. క్రికెట్ మేచ్ చూడటానికత్తయ్యా

శో: ఉత్తిదమ్మా...అసలుసంగతి బావ పరీక్ష పేపర్లు ఆ ప్రాంతాల కెళ్ళేయట.

అమ్మ శోభకేసి చురచుర చూసింది అమ్మ కళ్లు తప్పించుకుంటూ "పడితే ఒకటీ రెండూ పడతాయి. అలాగ ఒకటే రెండూ పేపర్లు పాసుచెయ్యటంవల్ల బావ పరీక్ష ఎప్పుడూ పోలేదు" అన్నాను

కా:- ఒకెయి అందరూ మీలాగే పరీక్షలు ప్యాసయితే ఈ యూనివర్సిటీ కేం లాభం? నాలాంటివాళ్ళిలా విద్యాదానం చెయ్యబట్టే ఈనాడు విశాలాంధ్రలో మూడు యూనివర్సిటీలున్నాయి.

నా:- అడగటం మరిచిపోయాను. ఎలా రాశావురా మొన్న సెప్టెంబరులో?

కా:- నా లోటులేదు మామయ్యా... ఇంక ప్యాసవడమంటావా ... మొన్న సిద్ధాంతిగారు అమ్మతో అంటుంటే విన్నాను. నాకు వచ్చేయేటితోకాని ఏలినాటిశని వదలదుట. అంచేత...

శో:- మళ్ళీ మార్చిలోకాని మోక్షం లేదంటావు.

కా:- అంతా కి.పించక పోతే శోభా శెలవుల్లో వొచ్చి నాకు ట్యూషన్ చెప్పకూడదూ?

శో:- చెబితేమాత్రం బావా నీ జాతకం మార్చగలనా! నన్ను చూసి నీ ఏలినాటశని వెనక్కెడతాడా?

కా: చెప్పలేం. 'స్త్రీబుద్ధి ప్రళయాంతకః' అన్నారు. సూర్యచంద్రాగుల్ని నిలబెట్టేసి గతులు తప్పించిన ఆడాళ్ళుకూడా వున్నారు పురాణాల్లో. ఏమో నీ ఆగ్రహానికి భయపడి ఆ శనిగ్రహం కొంచెం అనుగ్రహిస్తాడేమో.

"గాని వాటికేంగాని కామేశం ... అయితే ... ఇంటర్మీడియట్ అవగానే బియ్యే చదువుతావా, ఇంకా ఏదైనా పెద్ద చదువులో ప్రవేశిస్తావా?" అంది అమ్మ అమాయకంగా.

'ఉట్టి కెగరలేనమ్మ...' సామెత జ్ఞాపకమొచ్చినట్లుంది, నాన్నగారు ముసిముసి నవ్వు నవ్వుతున్నారు

కా ఇంక [illegible]కోలేదత్తయ్యా. చదువుకు నేనంటే యిష్టంలేనప్పుడు దాన్ని మాత్రం బలవంతంచెయ్యడమెందుకూ? అంచేత చదువాపేసి వ్యాపారమా, వ్యవసాయమా అని ఆలోచిస్తున్నాను.

నా: నీ కదే మంచిదిరా. హాయిగా భూములున్నవాడివి. వ్యవసాయం చూసుకుంటే

అ:- చాల్లెండి. శోభకి కాబోయే మొగుడు...

శోభమీదా, నాన్నగారిమీదా కసి తీర్చుకోటానికే ఈ సాహసం చేసిందో మరి బావని చూసి మురిసిపోయి ఇలా అందో అర్థంకాలేదు. అమ్మకేసి ఒక్కసారి తీక్షణంగా చూసి నాన్నగారు విస్తట్లో కూర ముక్క నోట్లో కుక్కుకొని [illegible]. కళ్లు చీకట్లు కమ్మినట్టయ్యి నేను మంచినీళ్ళగ్లాసుకోసం తడుముకున్నాను

చివరికి బావే అమ్మమాటకి అడ్డం వొచ్చేడు. "నేను పెళ్ళాడటమేమిటి అత్తయ్యా! దానికి పెద్ద చదువు చదివిన వాణ్ణీ, పెద్ద హోదాలో ఉద్యోగం చెయ్యటానికవకాశం వున్నవాణ్ణీ చూసి

విధ్యాలి... మరేం భయపడకు శోభా. అన్నం తిను. నేను నిన్ను పెళ్ళాడనులే" అన్నాడు బావ.

"మేనత్త మేనమామబిడ్డలూ పెళ్ళాడతా రనుకోవడంలో తప్పేముందీ అన్న వుద్దేశ్యంలో మీ అత్తయ్యుంది. ఇందులో బలవంతం చెయ్యంకదా. అంచేత అదీ భయపడక్కర్లేదు, నువ్వూ భయపడక్కర్లేదు" అన్నారు నాన్నగారు సమయస్ఫూర్తిగా.

* * *

నాన్నగారు గదిలో కూర్చున్నారు. హాల్లో అమ్మ, శోభా సోఫాలో కూర్చున్నారు. నేనూ, బావ తివాసీమీద బావ పెట్టెముందర చతికిలపడ్డాం. శోభలో పొద్దుటినుంచీవున్న వుత్సాహం లేదు. పరధ్యానంగా వుంది. అమ్మ తాంబూలం వేసుకుంటూ రెట్టించిన వుత్సాహంతో బావకేసి చూస్తూవుంది. పెట్లోంచి బావ రెండు నిలువుటద్దాలు తీశాడు.

"ఇవెందుకురోయ్... మంగలిషాపు కాని పెడతున్నావా యేమిటి!... ఇందాకా యేదో వ్యాపారం అన్నావుతే" అన్నాను.

"రేపొద్దున్న శోభ మాయింటికొస్తే నిలువుటద్దమైనా లేదని ఆక్షేపిస్తుందని కొన్నాను" అన్నాడు బావ.

అయితే రెండెందుకూ?" అమ్మడిగింది.

"పెద్దకాలవగట్టునున్న తోటలో కిందటేడు బంగాళా వేయించానుగా. అందులో ఒకటి, మాయింట్లో కొకటి."

తోటమాటవినగానే పూర్వపు స్మృతులన్నీ జ్ఞాపకమొచ్చాయి. చిన్నప్పుడు ఆ తోటలో, నేనూ శోభా, కాముడూ, ఆవూరి స్నేహితులూ కలిసి బువ్వాలాట, బొమ్మల పెళ్ళిళ్ళూ చేసుకునేవాళ్ళం. కొంచెం ఎదిగినతర్వాత అక్కడే కోతికొమ్మచ్చి, ఆకాట, ఆతర్వాత పేకాట... అలాగ ఆ తోట చిన్నప్పట్నుంచీ మాకో ఆప్తబంధువులాగ ఎంతో సన్నిహితమైపోయింది. అప్పుడే తోటచూసి నాలుగేళ్ళయింది. కిందటిసారి మేం వెళ్ళినప్పుడు నేనూ శోభా మొక్కలుపాతి వనమహోత్సవం చేశాం.

"ఒరేయి నేను నాటినమొక్కలు బతికేయా?" అడిగేను.

"సగం పైగా బతికేయి. శోభ పాతిన సంపెంగమొక్కలు రెండూ ఎదిగి ఇంచుమించు శోభ బుజాలదగ్గరకొస్తాయి." అన్నాడు శోభకేసి చూస్తూ.

పెట్లోంచి ఒక్కొక్కటే పైకితీసి నాకో టైపిన్ను, నాన్నగారికి ఆఫీసుకవర్లు చింపుకునేందుకు దంతంపిడిగలకత్తి, శోభకో మొరాకో తోలు చేతిసంచి యిచ్చేడు. మిగిలినవన్నీ తను కొనుక్కున్న బట్టలూ ఫ్యాన్సీసామానులు.

"నీకూ మా అమ్మకీ ఏం తీసుకురావాలో అర్థంకాలేదత్తయ్యా" అన్నాడు అమ్మతో.

"మీ రందరూ తెచ్చుకోవటంకంటే నాకొక్కవాల్సిందేముంది నాయనా" అంది అమ్మ బావ చిన్నబుచ్చుకోకుండా.

"నువ్వూ అమ్మా పురాణం చదువుకోటానికి పుస్తకాలుపెట్టుకునే వ్యాసపీటలు తెచ్చేను" అన్నాడు పెట్లోంచి ఒకటితీసి అందిస్తూ. అమ్మమొహం సంతోషంతో ఆ వ్యాసపీటంతయింది.

"ఒరేయి రామం, కామేశాన్ని చూసి బుద్ధితెచ్చుకోవాలిరా. అమ్మకో వ్యాసపీఠం తీసుకురావాలని నీకెప్పుడైనా తోచిందా" అంది అమ్మ నావైపుతిరిగి.

ఇంతలో నాన్నగారు డ్రెస్ వేసుకుని హాల్లోకివచ్చి "ఒరే కాముడూ, ఆఫీసుకెళ్ళొస్తాను. సాయంత్రం త్వరగా యింటికొచ్చెయ్యండి. ఊళ్ళో మంచి సినీమాలు కూడా ఏమీ లేవు" అన్నారు.

"ఉన్నవాటిలోనే మంచి సినీమా చూస్తాం మామయ్యా" అన్నాడు కాముడు.

నాన్నగారు కిందికి వెళ్ళి కారు స్టార్ట్ చేసి మళ్ళీ ఏం జ్ఞాపకమొచ్చిందో నన్ను పిలిచారు. కిందకి వెళ్ళేను.

"నే నిన్నాళ్ళూ ఏదో సందిగ్ధంలో వున్నాను కాని... ఇంక ఆలోచించవల్సిందేమీ లేదు. శోభని కాముడికివ్వడం నాకిష్టం లేదు. చదువూ సంధ్యా లేదు సరికదా వాడికి షికార్లూ, షోకులూ, ఖర్చులూ ఎక్కువవుతున్నాయి వీడికిప్పుడు హైదరాబాదెందుకు? పైగా చదువుకూడా మానేసి యింక వ్యవసాయం మొదలెడతాట్ట. ఇంక శోభని బలవంతం చెయ్యడమంత అన్యాయం మరొకటిలేదు. భోజనాలదగ్గర అమ్మధోరణి చూశావుకదా. ఆడాళ్ళ తెలివితక్కువ లలాగే వుంటాయి. నే నెందుకు చెబుతున్నానంటే... నేను యింట్లో లేకుండా చూసి అమ్మ దానికి నూరిపొయ్యకుండా చూడు. అసలు దాని పెళ్ళి విషయం ఎత్తడానికి వీల్లేదు. తెలిసిందా. నిన్నందుకే పిలిచాను."

నేను తిరిగి మేడెక్కి హాల్లో కెళ్ళేటప్పటికి బావ గొంతు వినబడుతోంది.

బా: అది కాదత్తయ్యా... మొన్న అమ్మ వుత్తరంలో కూడా రాసిందట కాదూ.

అ: రాసింది నాయనా. నువ్వందుకే వస్తున్నావనికూడా తెలుసు. ఇంతకీ నా యిష్టమేముంది?

నాకు పై ప్రాణాలు పైకిపోయాయి. అనుకున్నంత ప్రమాదం జరిగిందే. అమ్మ నోటికి హద్దూపద్దూ లేదు. పాపం! శోభ దెబ్బతిన్న పావురంలాగ బిత్తరపోయి నాకేసి చూస్తోంది.

బా: మరయితే ఆలస్యమెందుకూ... రేపు పిళ్ళిద్దర్నీ నా కూడా తీసుకుపోతాను. పది రోజులుండొస్తారు.

కాస్త ప్రాణం కుదుటపడింది. దానితో ఎందుకయినా మంచిదని అమ్మకి కాఫీ ఫలహారాల సంగతి జ్ఞాపకంచేసి కిందకి పంపించేశాను. తర్వాత బావ తను హైద్రాబాద్ లోనూ అజంతా ఎల్లోరాల్లోనూ తీసిన ఫొటోలు చూపెట్టడంలో నా ఆవేదన కొంత ఉపశమించింది.

* * *

సాయంత్రం నేనూ బావా వరండామీద

★ తెగులు కుదిరింది ★

కూర్చుని బాతాఖానీ కొడుతున్నాం. హాల్లో శోభ వయొలిన్ వాయించు కుంటుంది.

"పాటే అనుకున్నాను. వయొలిన్‌కూడా బాగా వాయిస్తుందిరా" అన్నాడు బావ. నేను మాట్లాడలేదు.

"నిజంగా శోభలాంటి చెల్లెలు నాకూడా వుంటే బాగుండు ననిపిస్తుంది."

బావ ధోరణి ఎలా మార్చాలా అని ఆలోచిస్తున్నాను.

"ఏరా శోభకి పెళ్ళిసంబంధాలేమీ చూట్టంలేదూ మామయ్య?"

"లేదు" అన్నాను సమాధానం తప్పించుకుని విచారిస్తూ.

"భోజనాల దగ్గిర అత్తయ్య మాటలు జ్ఞాపకమున్నాయిరా? మా అమ్మా అత్తయ్యా పాతకాలపు మనుషులు. మొన్న నేనో వుత్తరం రాసిందట, శోభని నాకిచ్చి పెళ్ళి చెయ్యమని చెప్పి. తరవాత ఆవిషయం నాకు చెప్పింది. నేను అమ్మని కేకలేశాను. నేను శోభని పెళ్ళాడితే నేమనం మేనత్త మేనమామ బిడ్డలంరా? నేనసలు అందుకే పరిగెత్తుకొచ్చేను. శోభని పెళ్ళాడాలన్న ఉద్దేశ్యంకాని, అంత స్వార్థంకాని నాకు లేదు. శోభమీద నీ కెంత ప్రేముందో నాకూ అంతే వుంది. దానికి మంచి మొగుణ్ణి వెతికి తీసుకొచ్చి పెళ్ళి చెయ్యాలని మీ కంటే నాకు రెట్టింపు ఉత్సాహముంది."

ఆ మాటల్లోవున్న అభిమానం, స్వార్థరాహిత్యం తెలుసుకుంటే, నేనే శోభనయితే బావని తప్పకుండా పెళ్ళాడేవాణ్ణనిపించింది.

"మే మెవళ్ళం శోభ పెళ్ళివిషయం యింకా ఆలోచించటం లేదురా. ఇంతకీ శోభయిష్టం."

"శోభయిష్టమేమిట్రా...దాని యిష్టం అని వంకపెట్టి 'ఏదో కట్నం అక్కర్లేని సంబంధంకదా' అని చవగ్గా నాకిచ్చి పెళ్ళి చేద్దామని చూస్తున్నారా ఏమిట్రా మీరందరూ?"

"అదికాదురా ఇప్పుడు శోభ పెళ్లి కేం తొందర..."

"అనే అది అంటుంది. అలా అని మీ రూరుకుంటారా! ఒరేయ్ దానికితగ్గ సంబంధము చూడండి. ఎంత కట్నమయినా సరే. మీరివ్వలేకపోతే నేనిస్తాను. అంతే కాని..."

"ఇంతకీ, బావా ఏమిటిసంగతి నీకేమైనా పెద్దకట్నాలతో సంబంధాలొస్తున్నాయా ఏమిట్రా" అన్నాను నిజంగా సందేహం కలిగి.

"ఛా. ఇంకా లేదురా. మాఅమ్మ అందరితోటీ మేనరికంవుందని చెప్పేసింది. ఆ వంకని ఆపోరు కొంతతగ్గింది. ఇంక కట్నం ఆశ అన్నావా...నాకు కట్నం పుచ్చుకునేటంతఖర్మం ఏంకాలిందిరా. వున్నది చాలదు కనకనా. ఇంతకీ పిల్ల నచ్చాలి కాని."

"పిల్ల నీకు నచ్చడం కష్టమే...ఒకవేళ నచ్చినా ఆపిల్లకి నువ్వునచ్చాలికదా...అది మరీ కష్టం."

"అంచేత మామయ్యతోటి మా అమ్మ తెలివితక్కువగా రాసిన వుత్తరం...." శోభ హాల్లో వయొలిన్ ఆపేసి ఎంతసేపయిందో [illegible] బావ [illegible] ఊరుకోమని సౌజ్ఞచేసి "ఆరవ్వొస్తుంది, ఇంక మనం నెమ్మదిగా బయలుదేరొమ్మురా" అన్నాను బావని లేవదీస్తూ.

* * *

బావ పొద్దున్నే వెళ్ళిపోయేడు. నేను హాల్లో కూర్చుని బూట్ పాలిష్‌కి ఉపక్రమించేను. నాపక్కనే కూర్చుని అమ్మ నాన్నగారికి తమలపాకులు రాస్తోంది. నాన్నగారు ఆఫీసుగదిలో ఉత్తరాలు రాసుకుంటున్నారు. కాలేజీకి వెళ్ళే ప్రయత్నంలో శోభ లోపలి గదిలో పుస్తకాలు సర్దుకుంటోంది.

"కాముడి సంబంధం మనకక్కర్లేదని రాసెయ్యమ్మ నన్నమాటేగా" అన్నారు నాన్నగారు గదిలోంచి.

"ఏమిటినాన్నా?" అంటూ వన్నెమారే మొహంతో ప్రత్యక్షమయింది శోభ.


"అచ్చే...అక్కయ్యకి జవాబు రాయాలి కదా."

"రాసెయ్యనాన్నా శోభ కాముణ్ణితప్ప ఇంకెవ్వరినీ పెళ్లాడదని" అంటూ అమ్మ కేసి తిరిగి నవ్వింది.

"అలాగే రాసెయ్యండి తెగులు కుదురుతుంది" అంది అమ్మ తీక్షణంగా.

"తెగులు కుదిరింది కనక నే అలా రాయమన్నాను. ఇన్నాళ్లూ చదువుకున్న దాన్నన్న గర్వంతో బావని కాదన్నాను. బావ యిక్కడికొచ్చి నేను కొట్టుకుపోతున్న అజ్ఞానప్రవాహంలోంచి రక్షించాడు. చదువువల్ల నేను సంపాదించినవి అహంభావం, స్వార్థం. చదువులో వెనకబడినా మానవాతీతమైన త్యాగం, ఔదార్యము బావలో వున్నాయి. సహజమైన బంధుప్రేమ, నిష్కామమైన అనురాగం, నిర్మలమైన మనస్సు, నిరంతరమైన...."

నాకు శోభ ఉపన్యాసదోరణి కొత్త కాదు. అమ్మ మొహంలోకి చూశాను సంతోషంతో వికసించి ప్రకాశం అంతయింది. నాన్నగారిచేతుల్లో పుస్తకంలోంచి కింద పడి చప్పుడయింది. నేను నెమ్మదిగా చల్లగా దిగేను. ఇంకా శోభ ఉపన్యాసం వినబడుతూనే వుంది. ★




రమేశ్ ఇంటికి
వెళ్లుటకు భయపడ్డాడు...








నా బట్టలను మాపుకొన్నాను రామ్ మా అమ్మ నన్నిప్పుడు తిట్టుతుంది.
రమేశ్ నేను-కూడాతరచుగా బట్టలను మాపుకొంటుంటాను గాని మా అమ్మ నన్నెప్పుడూ తిట్టదు, రా హాయ్.



రామ్ ఇంటివద్ద:
ఎందుకతనేడుస్తున్నాడు?
అతడింటికి వెళ్లు-టకు భయపడుచున్నాడు, ఎందుకంటే అతడు తన బట్టలను మాపుకొన్నాడు




రమేశ్ ఇంటివద్ద:
మళ్లీ మురికిగా ఇంటి కొచ్చావు! నిన్నింక యెప్పుడూ ఆటకు బైటకు వెళ్లనీ-యను!
ఈ బాలుని తిట్టకమ్మా-పిల్లలందరూ ఆడునప్పుడు మురికిగా నగుదురు




ప్రతిరోజూ వాడి బట్టలను ఉతుకుటకు చెమట వోడుస్తున్నాను వాటిని బాదుతూ అందుకవి చాలాత్వరగా చిరిగి పోతున్నవి




అది నిజనే, బాదుట బట్టల పోగులను తెంచును మరి అందు-వల్లనే బట్టలు త్వరగా చిరిగి పోవును.




బాదబడినబట్ట పెద్దదిగా చూపబడినది



కాని మీరు సన్‌లైట్ సబ్బుతో ఉతికినప్పుడు బట్టలను బాదనక్కర్లేదు దాని సమృద్ధయిన నురగము-రికి నంతటిని సులభంగాతొల-గించును, ఆవిధంగా మీ బట్టలు చాలా కాలము మన్నును కూడ.



అది నిజం! త్వరగా నురగము గలిగించు సన్‌లైట్ సబ్బు బట్టలను బాదకుండానే సరిగ్గా తెల్లగాను మరియు కాంతివంతముగాను ఉతుకును అంటే-బట్టలు చాలాకాలము మన్నును మరియు నాకు డబ్బు మిగులును.



SUNLIGHT SOAP



మహీ ప్రొడక్షన్స్ వారి "శ్రీ గ

శ్రీరంజని



“రి మాహాత్మ్యంలో”

ఎన్. టి. రామారావు.



మెహబూబ్ ప్రొడక్షన్స్‌వారి 'ఆవాజ్' లో నళినిజయవంత్.



అంజలీదేవి



రాజశ్రీవారి "జయం మనదే" లో అక్కి. నాగేశ్వరరావు, రామారావు, అంజలి.

"భరణీవారి చింతామణి"

బాగా ఆలస్యం అయిపోయిన తరువాత కల్పితెంచిన బిల్వమంగళుడి కథను భరణీవారు తెరకెక్కించారు. జ్ఞానచక్షువు తెరచుకున్న పిదప, అతను చర్మచక్షువులను ధ్వంసం చేసుకుంటాడు. తన సౌందర్యతృష్ణను, అపార ప్రేమపూరితమైన హృదయాన్ని భగవంతునివైపు మళ్ళిస్తాడు. మహాభక్తుడు అవుతాడు. తరిస్తాడు. ఈ బిల్వమంగళుడు సామాన్యుడు, కేవలం [illegible] కాడు. [illegible] కవిత్వం గలవాడు. [illegible]. ఏక [illegible]. అయితే తెలుపు నలుపుల భేదం తెలిసికూడా, తన వైఖరి, లోకం దృష్టిలో, తప్పని ఎరిగికూడా, కళ్యాంగన వెంట బడ్డాడు. లోకంలో సౌందర్యం ఉన్నది కాబట్టే, దాన్ని ఆస్వాదించడానికి తనకి అవకాశం ఉన్నది కాబట్టి, వెనుకాడ నేల? సిగ్గుపడ నేల? అని భావించిన వ్యక్తి. తన ఈ భావనను తన వనితలోకాన్ని, ఆప్తులను ఎదిరించి వెలి వేసి. ఆ సంగతిని స్పష్టంగా, నిష్కర్షగా, చెప్పగలిగాడు. అలా చెయ్యకపోతే, "తాళి కట్టుకోవడమే నువ్వు చేసిన తప్పు" అని భార్యను అంటూ తనలోని దౌర్బల్యాన్ని కూడా అంగీకరించగలిగిన వ్యక్తి. చివరికి, తన చేతలను పర్యవసానాల ఫలితస్వరూపాన్ని, వాంఛించినదాని తను ప్రగాఢంగా వాంఛించిన ఐహిక సౌందర్యం, తను మోహించుకున్న స్వర్గం, శాశ్వతంగా తిరస్కరించాలని గ్రహించిన మీదట, అతనికి జ్ఞానోదయం అవుతుంది. బిల్వమంగళుడికి జీవితాన్ని నడిపేది వేశ్య చింతామణి. అశాశ్వతమైన ఆమె శారీరక సౌందర్యం అతన్ని దాసుడ్ని చేసుకుంటుంది. ఆమె భక్తిభావన పరిణతి చెందిన తరువాత ఆమే బిల్వమంగళుడిని [illegible] గలుగుతుంది.

తెలుగుదేశంలో ప్రబలంగా ఉన్న నాటకాలలో, శ్రీ కాళ్లకూరి నారాయణ రావుగారు ఈ మహానీతి నిర్మూలన లక్ష్యంగా ఈ రెండు పాత్రలతో నాటకం వ్రాశారు. అది అనూహ్యమైన జనాదరణ పొందింది. 1933 లో మదన్ థియేటర్స్ దీన్ని చలనచిత్రంగా కూడా నిర్మించారు.

సాంఘిక ప్రయోజనం దృష్ట్యా అయితే, ఈనాడు ఈ నాటకానికి ఆనాట్లో ఉన్న విలువ, ప్రాధాన్యం లేకపోవచ్చు. కథ మంచిదికదా అన్న భావంతో భరణీవారు చలనచిత్రం నిర్మించినట్లయితే, ఆ భావం పాక్షికమాత్రం ఈ చిత్రంలో కనబడుతుంది. నాటకం ఆదరణ పొందింది కాబట్టి, ఆ పంథాలోనే సినిమాకూడా రూపొందినట్టు కనిపిస్తుంది. చింతామణిని, మంచి మనసుగల వేశ్యగానే కాక, మొదటినుండీ సచ్ఛీలురాలుగా చిత్రించడానికి ప్రయత్నించారు. ఈ ధరణిలోనే, [illegible] పెట్టుకున్నే,—బిల్వమంగళుడిని పిలవక రావడానికి ధనాశికొంకరుడిని పంపినపుడ

ర్భంలో, రుక్మిణీకల్యాణంలోని "ఘనుడా భూసురుడేగనో" అన్న పద్యాన్ని చదివించారనిపిస్తుంది. సందర్భానికి రహితంగా, హాస్యాస్పదంగా ఈ పద్యాన్ని చదివించినందుకు చింతామణిని [illegible] గా చిత్రించడానికి చేసిన ప్రయత్నం దెబ్బతింది.

ఉన్నంతలో, ఈ చిత్రాన్ని దర్శకుడు శ్రీ రామకృష్ణ, రక్తికట్టించగలిగారు. దర్శకత్వంతోపాటు ఎడిటింగ్ కూడా ఆయనే నిర్వహించారు. [illegible] భావాలను [illegible] అద్భుతంగా చిత్రించారు. అయితే మొత్తం మీద, ఈ చిత్రంలోకన్న "విప్రనారాయణ" చిత్రంలోనే శ్రీ రామకృష్ణగారి ప్రతిభ ఎక్కువ రాణించినట్టుంది.

చింతామణి పాత్రను భానుమతి కొత్తతనం ఇచ్చి, ప్రశంసనీయంగా నిర్వహించింది. [illegible] రామారావు నటన [illegible] బాగా ఉంది. [illegible] ఈ పాత్రకే [illegible] అయినప్పటికీ, [illegible] కొన్ని సందర్భాలలో [illegible] సందర్భంలోనూ, [illegible] వేషంలోనూ [illegible].

[illegible] రంగారావు [illegible] నటించారు. [illegible] వేషంలో [illegible] చెప్పాలి. [illegible] 'రాధ' [illegible] ప్రతిభను [illegible] చేసుకుంది. [illegible] పవర్శించింది. అయితే, [illegible]. [illegible] సత్యభామ [illegible] పద్యాలు [illegible] చేయించకపోయినా [illegible] ఇంటిలో కూడా. [illegible] వేషంలో [illegible] ప్రదర్శించారు. [illegible] ఆస్వాదించ [illegible]. [illegible] దెయ్యం, [illegible] చెప్పించ

జరుగుతుంది. జమున కూడా నాదాపు అంతే చేసింది. మిగతా నటీనటులు అడ్డాల నారాయణరావు, రఘురామయ్య, డా॥ [illegible] రావు, [illegible] కృష్ణారావు. చింతామణి [illegible] శ్రీ [illegible] బాగా నటించారు.

ఈ చిత్రంలో 40 కి పైగా పాటలూ పద్యాలూ ఉన్నాయి. పద్యాలలో [illegible] నారాయణరావు [illegible] చిన పద్యాలూ, పాటలూ శ్రీ [illegible] సత్యనారాయణ

రచించారు. కె. కె. అద్దేపల్లి రామారావు వీటికి శ్రావ్యమైన సంగీతం సమకూర్చారు. నేపథ్యసంగీతం శ్రీ టి. వి. రాజాగారు కూర్చారు. శ్రీమతి భానుమతి సంగీతానికి పర్యవేక్షణ చేసింది. ఘంటసాల, రాజా, మాధవపెద్ది, లీల, సుశీల [illegible] పాడారు. చింతామణి పాత్రకు భానుమతే పాటలూ పద్యాలూ పాడింది.

మొత్తంమీద పాటలన్నీ బాగున్నాయి ★

* * *

"స్వాతి [illegible] ఫిలిం [illegible]"

ప్రిన్స్ ఫిలింస్ వారి "న్యూఢిల్లీ"లో ప్రభాదయాళ్, జబీన్

సుప్రసిద్ధ చలనచిత్ర దర్శకులు శ్రీ ఎల్. వి. ప్రసాద్‌కు [illegible] ఆయన మిత్రులు సన్మానం చేశారు. శ్రీయుతులు శివాజీ గణేశన్, హెచ్. ఎం. రెడ్డి, బి. నాగిరెడ్డి, ప్రసాద్, మద్రాసు ప్రధాన న్యాయమూర్తి పి. వి. రాజమన్నార్, కె. ఎస్. రెడ్డి, ఈ చిత్రంలో చూడవచ్చు.

(1956) కు శ్రీ చిత్తూరు వి. నాగయ్య ఏప్రిల్ 18 న ప్రారంభోత్సవం జరిపారు. [illegible] శ్రీ సముద్రాల రాఘవాచార్య సభకు అధ్యక్షత వహించారు. శ్రీ [illegible] మొదలగువారు మాట్లాడారు.

ఈ డైరెక్టరీ ఇంగ్లీషులో ప్రచురించబడింది. దక్షిణ భారత నటీనటులు, దర్శకులు మొదలైనవారి జీవిత చరిత్రలు, పరిశ్రమకు చెందిన వారి చిరునామాలు, సెన్సార్ నిబంధనలు మొదలైనవి ఇందులో పొందుపరచారు. సంపాదకుడు శ్రీ [illegible].

ఈ పుస్తకంలో 250 పుటలున్నాయి. [illegible] మద్రాసు—17.

* * *

'నికితిన్' భారత దేశ యాత్ర

రష్యాని యాత్రికుడు అథనాసీ నికితిన్ భారతదేశంలోని యాత్ర ఆధారంగా భారత్ రష్యా దేశాలు కలసి నిర్మింపదలచిన చలనచిత్రానికి స్క్రిప్టు పూర్తి అయింది. ఈ చిత్రాన్ని సోవియట్ రష్యా సాంస్కృతిక శాఖ, 'నయాసన్సార్' అనే భారతీయ చలనచిత్రసంస్థ కలిసి నిర్మిస్తున్నాయి.

ఈ చిత్రానికి, "నయాసంసార్" సంస్థ అధిపతి, దర్శక నిర్మాత అయిన శ్రీ ఖ్వాజా అహమద్ అబ్బాస్, రష్యా తరఫున శ్రీ వి. ప్రానిన్ దర్శకులుగా పని చేస్తారు.

స్క్రిప్టు రచన కూడా అబ్బాస్, సోవియట్ రచయిత ఎం. స్మిర్నోవాలు కలిసి సాగించారు. దీన్ని కేవలం యాత్రా విశేషాలు చూపే చిత్రంగా గాకుండా, ఒక కథను రూపొందించారు. ఈ కథ ఆధారంగా 15 వ శతాబ్ది నాటి భారతదేశం స్థితిగతులు, దేశ పరిస్థితులు, భారతీయ సాంస్కృతిక వైభవం చక్కగా చిత్రించదలచారు.

ఈ కథ విషయమై రష్యన్ దర్శకుడు ప్రానిన్ ప్రముఖులు [illegible] ప్రధాని శ్రీ నెహ్రూ [illegible]. ప్రధాని దీనిపట్ల ఆసక్తి ప్రదర్శించారని, కొన్ని అంశాలపై సలహాలు ఇచ్చారని తెలిసింది. [illegible]

ఈ చిత్రం రష్యన్ [illegible] పేరు నిర్ణయం కాలేదు కాని, భారతదేశంలో విడుదలచేసే ప్రతికి మాత్రం '[illegible]' అని పేరు పెడతారు. నిర్మాణం అక్టోబరులో ప్రారంభం కావచ్చు నంటున్నారు.

* * *

చలనచిత్రాల సెన్సార్ నిబంధనలు
కఠినతరం చేసే ఆలోచన

చలనచిత్రాల సెన్సారు నిబంధనలను కఠినతరం చేసే విషయమై ప్రభుత్వం ఆలోచిస్తున్నది. కేంద్ర సమాచార, రేడియో ప్రసారశాఖమంత్రి

ఎ. వి. ఎం. వారి "నాగులచవితి" చిత్రం ఏప్రిల్ 7 న ప్రొద్దుటూరులో అర్ధ శతదినోత్సవాలు జరుపుకుంది.



పారమౌంట్ వారి 'రోజ్ టాటూ'లో బర్ట్ లంకాస్టర్, ఇటాలియన్ నటి అనా మగ్నానీ. ఈ చిత్రంద్వారా అనా 1955 లో ఉత్తమనటిగా ఎన్నికై, అమెరికాలో అకాడమీ అవార్డును అందుకున్నది.

డా॥ బి. వి. కేస్కర్ ఇందుకు శాసనం ఒకటి తేవచ్చునని భావిస్తున్నారు. ఈ ఏర్పాట్లు జరిగితే అవి స్వదేశీయ చిత్రాలకు విదేశీయ చిత్రాలకూ కూడా వర్తింప చేస్తారు.

అఖిలభారత కాంగ్రెసు కేంద్ర కార్యవర్గం ఏప్రిల్ 15 న సమావేశమైనపుడు ఈ విషయం చర్చకు వచ్చిందట. డా. కేస్కర్ కూడా ఆ చర్చలలో పాల్గొన్నారు. కొందరు పార్లమెంటు సభ్యుల అభ్యర్థన ఫలితంగా, ఇప్పుడు ఈవిషయం ఆలోచనకు వచ్చిందనీ, ఈ సందర్భంలో, భారత ఫిలిం ఫెడరేషన్ వారు సమర్పించిన విజ్ఞాపికలో అంశాలు కూడా చర్చించారనీ తెలిసింది.

సెన్సారు ఫలితంగా చిత్ర నిర్మాతలకు డబ్బు, శ్రమ వృథాకాకుండా, సాధ్యమైనంతవరకు ముందు జాగ్రత్తలు సూచించే నిమిత్తం, భారతీయ చిత్రాలకు స్క్రిప్టు తయారు కాగానే సెన్సారు చేయటం మంచిదని కాంగ్రెసు కార్యవర్గం అభిప్రాయపడుతున్నదట.

* * *

ఎర్నెస్ట్ హెమింగ్వే నవల 'ఓల్డ్ మాన్ అండ్ ది సీ'ని ఎం. జీ. ఎం. సంస్థవారు చలనచిత్రంగా నిర్మిస్తున్నారు. ఈ నవల వల్ల హెమింగ్వేకు నోబెల్ బహుమతి వచ్చిన విషయం విదితమే. ఇందులో ప్రధాన పాత్ర ఒక బెస్తవాడు. ఆ భూమికను చలనచిత్రంలో స్పెన్సర్ ట్రేసీ నిర్వహిస్తున్నాడు.

* * *

గత సంవత్సరం జపాన్ మొత్తం 423 చిత్రాలు నిర్మించింది. ఇకపై సాలీనా 400 చిత్రాలు నిర్మించాలని పరిశ్రమ ప్రముఖులు ఆలోచిస్తున్నారట. జపాన్ లో మొత్తం ఆరు పెద్ద స్టుడియోలున్నాయి. ఈ లెక్కప్రకారం అవి సగటున ఒక్కొక్కటి నెలకి ఐదారు చిత్రాలు నిర్మించటం జరుగుతుందన్నమాట.

* * *

ఆర్. కె. ఓ. వారి టెక్నికలర్ చిత్రం "కాంకరర్" లో జెంగిస్‌ఖాన్‌గా జాన్ వేయిన్.

డాక్యుమెంటరీలకు ప్రత్యేకం థియేటర్లు

బాక్సాఫీస్ హంగులు ఏమీ లేకుండా, కేవలం విషయం ప్రధానంగా నిర్మించే చిత్రాలను ప్రజాదరణ పాత్రం చేసి, ప్రపంచములో డాక్యుమెంటరీ చిత్రాలకు ప్రత్యేకస్థానం సాధించే లక్ష్యంతో ప్రయత్నాలు చేయడానికి ఒక సంస్థ ఏర్పడింది. హ్రస్వచిత్రాల నిర్మాతలు సభ్యులు గాగల ఈ స్వతంత్ర సంస్థ, ఇందుకై వేసుకున్న పథకంలో డాక్యుమెంటరీ చిత్రాల ప్రదర్శనకై ప్రత్యేకం థియేటరు నిర్మించడం ముఖ్య కార్యక్రమం. కథాప్రధాన చిత్రాలకే ఈనాడు గిరాకీ ఉన్నందువల్ల హ్రస్వ చిత్రాలకు థియేటర్లు లభించడం కష్టం. బ్రిటన్, ఇటలీ ప్రభృతి దేశాలలో కేవలం హ్రస్వ చిత్రాలనే ప్రదర్శించే థియేటర్లు ప్రత్యేకం ఉన్నాయి. వాటికి వెళ్ళే జనం కూడా చాలమంది ఉన్నారు. మన దేశంలో కూడా సమకాలిక చరిత్రను, అనేక ఇతర విషయాలను చిత్రించే వాటిపట్ల, ప్రజకు అభిరుచి కలిగించాలంటే, ఈ చిత్రాల నిర్మాణానికి ఎంత పని అవసరమో, వాటి ప్రదర్శనకు వసతులు కల్పించడం కూడా అంతే ముఖ్యం.

హ్రస్వచిత్రాల సంఘంవారు ప్రస్తుతానికి, దేశంలోని ప్రధాన నగరాలలో ప్రత్యేక థియేటర్లు నెలకొల్పడానికి కృషి చేయ నిశ్చయించారు.

ఇదికాక, డాక్యుమెంటరీల నిర్మాణానికి కావలసిన వసతులు కల్పించవలసిందని ప్రభుత్వాన్ని వివిధసంస్థలను వీరు కోర నిశ్చయించారు. డాక్యుమెంటరీలపై వినోదం పన్ను రద్దుచేయాలనీ, ప్రాంతీయ భాషలలో తయారైనవాటిలో రెండువేల అడుగుల నిడివి మించిన వాటిపై సెన్సారురుసుము తగ్గించాలనీ కూడా కోర నిశ్చయించారు.

ఈ సంఘానికి శ్రీ ఎ. జామీర్ అధ్యక్షుడు. శ్రీ కె. సుబ్రహ్మణ్యం ఉపాధ్యక్షుడు. శ్రీ జి. అగర్వాల్ ప్రధాన కార్యదర్శి. డా॥ పి. వి. పతి, దక్షిణ ప్రాంతీయ కార్యదర్శి.

* * *



"ఫిలింస్తాన్ వారి "ప్రభుకీ మాయా" చిత్రంలో ప్రేమ్ అదీబ్.

దొంగల మెప్పు

బయట బాగ వానపడుతుండది. ఒక్కటే వాన. ఉరుములు మెరుపులు. ఉండుండి ఆడాడ పిడుగులుగూడ పడుతుండయేమో! బూమి దద్దరిల్లిపోతుండది. మూడుదినాల కింద ముసురుల్యాక మొదలైనవాన ఇప్పటికి ఇడువకుండ బడుతుండది. పట్టపగలు మొగులు మూసుకచ్చి చిమ్మచీకట్లు కమ్మ జేసింది. యాడ ఏమి కనబడతలేదు. బయానికి బయటొచ్చినోళ్లు లేరు. ఎక్కడో ల్యాక్కడ యిగ పిడుగులే పడతయో పపంచకమే మునుగుతదో అంటని గొంగళ్లు ముసుగులు పెట్టుకోని కూకున్నరు. పిట్ట పిల్ల కనబడతలేదు. అసుం టియాల యాడికెల్లి ఒచ్చిన్రో ఒచ్చిన్రు, ఆరుగురు మనుసులు. గొంగల్లు ఎంతిసేపటినుంచి కొప్పరవెట్టుకున్నరో కాని ఒచ్చి నిలబడితే గూనల్లకెల్లి కారినట్టు కారుతుండయి నీల్లు, గొంగడంచుల పంటి. గొంగల్లు దడిసి లోపట అంగీలను పంచెలను దడిపినయేమొ, ఒక్కటే ఒనుకు డొనుకుతున్నరు వొచ్చినోల్లు. ఆకిట్ల నిలబడి దబ్బ దబ్బ తలుపు కొట్టటాల్లకు ఒక్కటే అదురుకున్నది పెదమ్మ, పిడుగు పడ్డదేమో అంటని. ఆడికెల్లి అరుపు లినపడెటాలకు దైర్నజేసుకోని పోయి తలుపు దీసింది. తీసెటాల్లకు ఒక్క ఉరుకున గుడిసెలకు జొచ్చిన్రు ఆరుగురు మనుసులు. మనుసులను జూసెటాల్లకు పెద్దమ్మ కెందుకో బుగులైంది. వస్తనే గొంగల్లు కొప్పెర దీసెటాల్లకు ఏముండది. సురకత్తులు, గండ్ర గొడ్డన్లు యాల్లాడుతుండయి—ఆరుగురి సంకల్ల. ఆకాడికి ముసలిదాని పానం పైదిపైన్నే ఎగిరిపొయేటంత పనయింది.

"అవ్వ బువ్వపొంటె బెట్టుమని" అడిగిండు కోరమీసాల పెద్దదొంగ. అప్పటికి తెలివొచ్చింది ముసలిదానికి. బువ్వ లేగు ఇంకొ్యాడికన్న బొమ్మని అందామనుకున్నది. అంటెం పాపమోనని "లేదు నాయినా ఇప్పుడే జొన్నలు జర్రన్ని పుంటె తొక్కుతున్న. జెరసేపుంటె రొట్టెలుగాల్చి యిస్త" నన్నది. సరెలెమ్మని కూకున్నరు. "కుంపటితొట్ల పిడుకలు బెట్టుకోని జర అంగీలను కాపుకుంట కూకున్నరు. ఆడికెల్లి ముసల్ది మెల్లగ మాటలకు దిగింది, "యాపూరు నాయనా" అంటని. యాపూరెందే, ఈయాల్ల ఈవూరు, రేపింకోవూరు. యాడ పదొకైసలు దొరికితె గదే" అంటని జెప్పిన్రు. ముసల్ది అడుగుడా మనుకున్నది బిచ్చగాల్లా అంటని. కాని సంకలనుంచి తీసి మూలకు వెట్టిన కత్తులు, గొడ్డండ్లు కుప్పజూసి ఇంగేం అడుగలే. దొంగల్లంటనే అనుకున్నది. కాని ఏంజేస్తది ఇంత పెద్దమనిసయ్యిందిగాని, బందిపోటుదొంగలంటని ఇన్నదే కాని ఒక్కనాడన్న జూడకపాయె. వాల్లు మనుసులు గారని అనుకునేది యిన్నప్పుడు. మనుసులయితే పసిపిల్లల పానాలు తీంటారు? పెండ్లి బండ్లు దోసుకుంటారు? అని అనుకునేది. కాని ఇయ్యాల్ల దాని అంగణంల కూసున్నోల్లను జూసింది. అందరిల్యాక వాల్లూ పలికి ఒనుకుతుండరు. ఆకలికి అంగలారుస్తుండరు. వాళ్ళ నట్లజూసి ముసలిదానికి ఎందుకో జాలి

శ్రీనివాసరావు మంత్రి

బుట్టింది. తలకాయలను తప్పదియ్యగలిగినోల్లయినా ఇయ్యాల్ల తను జేసిచ్చే రొట్టె తునకలకు కాసుకోని కుక్కలు గూకున్నట్టు కూసున్నోల్లను జూసి ముసలిదానికి ఎక్కలేని నవ్వొచ్చింది. దాని కడుపుల ఏందో కలియబెట్టినట్టయింది. రొట్టెల పెంకకిందికి ఇంక రొండు ఏరుపిడుకలు పాయిలకు దోసింది. అందరికి దబ్బ దబ్బ రొట్టెలు గాలిచిచ్చింది. ఎక్కడలేని బలం దెచ్చుకున్నరు. పండుకుంటమంటె పాత చాపలు రొండు పరిశింది. అల్లు పొట్టనిండ దిని ఒక కూరుకు దీసిన్రో లేదో బయట ఆన ఎలిసింది. ముసల్దిమాత్రం ఈల్లను చిన్న పిల్లలను తల్లి జూసినట్టు జూసుకుంటుండది. లేశెటాల్లకు ఇంకిన్ని గింజలు యిసిరి మల్లిన్ని రొట్టెలు గాల్చింది వాల్లతోవకు. లేచిన ముఖాన ఈ రొట్టెల మడుతలు జూశిరో లేదో అల్లకూ ఎక్కడలేని ప్రేమ బుట్టింది ముసలిదాని మీద. పరెలమీద బడి పానాలుదీసెటోల్లకు గింత ప్రేమతోటి బువ్వబెట్టే ముసలిదాని మీద ఎక్కడలేని దయ బుట్టింది. మల్లొస్తమవ్వా నీ తాన్నే ఉంటం, ఈ చుట్టుముట్టున్నన్ని రోజులు. కాని మే మీడికొస్తమంటని ఎవరికన్న తెలిపితివాంటె నీ పానాలుండవంటని తెలియజెప్పిన్రు. ముసల్లొక్క నవ్వు నవ్వింది. అయ్యలారా ఒకరికి ఏమంటని తెలుపుదురా, మీ పానాలు దియ్యటానికి. కాని మీరు జేసే పనిమాత్రం నాకేం బాగలేదు. ఏమైన నా కొడుకులు ఇసుంటోల్లయితే నేనేంజేతు. కడుపు జించుకుంటె కాల్లమీద బడతదని ఊకోక పోదునా అంటని అన్నది. మల్లి ఆకలయినప్పుడల్ల రమ్మన్నది. ఉన్నకలో అంబలో తాగి పొమ్మన్నది.

రెండు దినాలకు మూడు దినాలకు ఒక్కపారి వస్తనే ఉండెరు ఆ యారుగురు. ఒచ్చినప్పుడల్ల, పిండీ, బియ్యం, యాటలు, గొర్లు దెస్తుండిరి. రాతిసైనంతవరకు ముసలిది వండిపెట్టేది. అల్లల్ల దెబ్బలు దాకినోల్లకు కట్లు గడుతుండేది. ఒల్లు నొప్పులంటె ఉడుకునీల్లు గాశి పోశేది. ఎప్పటికప్పుడు వాల్లు బోతే మల్లీ తన కంట్ల బడ్డదాక ఒకటే మనుసుల బుగులు పడుతుండేది. అల్లొచ్చి పొరుసంగ జెప్పిన కత లింటుంటె ముసల్లి ఒక్కటే దుక్కం బెట్టుకునేది. ఏనాటికైనాడు, ఒద్దురో, ఇట్ల జెయ్యకుండిరా నాయినా, పదిమంది గోడు గోడుమంటుంటె మీకు జెస్సగాదు, సుఖం లేదని అంటుండేది. ఏ అమ్మ శాప మెట్లుంటదోనని అనేది. ముసల్ది గటనే ఒర్లుకుంటదని నవ్వుకునెటోల్లు వాల్లల్లవాల్లు దొంగలు. వాల్లకుమాత్రం ముసల్దంటె ఏందో ఒక నమ్మకమైపోయింది. దోసితెచ్చిన సొమ్ములు, పైసలు, ఎండీ, బంగారం అంతా ముసలిదానికి దాసపెట్టమంటని ఇచ్చెటోల్లు. ఇచ్చినయన్ని బద్రంగ పొయ్యింట్ల గోలెంల ఏస్తా బొయ్యింది ముసల్ది. గోలెం నిండుతుండది ఈల్ల సంపాదనకు. ఇంక సాలంటె సాలన్నది ముసల్ది. ఈకాడికి మీ రంత సచ్చిందాక కావలసిన బతుకుదెరువు దొరికింది. ఇగెందుకు ఈ నరహత్యలు జేస్తరు వొద్దన్నది. వాల్లింటరా? ఆశ చచ్చేదిగాదాయె. ముసల్దిమాత్రం వాల్ల చెవుల గూకుగట్టుకోని అంటనే వుండేది. నాయినా మీ పాపమెన్నడో బద్దలైతదిరా, మీ మీ పానాలెవరో ఉట్టి పున్న్యానికిదీస్తే నేనిదంత ఏం జేసుకుంట? మీ రిది దీసుకోని మీమీ ఇన్లకు వోయి సుకంగ ఉండమన్నది. ఇగ బోతమంటె ఆగ బోతమని పెల్లాన్లు గడిపిన్రు. అయాల్ల మల్లీ అమాస. ఒక్కటే

★ దొంగల చెఱువు ★

పాడమునుకు. పొద్దున ర్యాకలువారంగ మొదలైన ముసురు మూడుజాములవరకు పెద్ద గాలివానయింది. అయ్యల దొరగారిం టికి కన్నమెయ్యాల్న బయలుదేరుదామని తయారయ్యారయింరు దొంగలు. ఒకరో రాయినో, దొర దగ్గర తుపాకులుంటాయి. బురుజుల కావలోళ్లుంటరు, అన కందరు దొర ఇంట్లనే పంటరు. పోవద్దంటె వద్దంటె వద్దన్నది ముసల్ది. ఇటువంటి దప్పుతె ఇగ దొర ఇంటని దోసుకునే దినం లేదని అనుకుం టుండెరు వాళ్లు. ముసలిదాని కేం ఎరుక? ఊరోళ్లం మనల పట్టించుకోరని అనుకున్నరు. చిన్న టోళ్లు [illegible] బుర్రలల్లసింది తిలా ఒక [illegible] కున్నరు. ఎక్కడి లేని పౌరుషం [illegible] కున్నరు. ఈయాల్ల దోసుకుంటుండెమన్నరు. ముసలిదాని మాత్రం ఎందుకో [illegible] [illegible]. ఇనలేదు వాళ్లు. తలకొక [illegible] దోసెలు తిన్నరు. బుర్రలల్లదాయింతి సుటికేసిండ్రు. మూటకున్న కత్తులు, [illegible] [illegible] సేసుకున్నరు. ఇగ బయలుదేరిండ్రు. [illegible] ముసురు [illegible] [illegible] ఉండెది. [illegible] [illegible] దాటె చెరువుకొమ్ము మీది కొచ్చిండ్రో లేదో, అనుమల్లె [illegible] గియ్యింది. కాని వాళ్లకేం పరువాయ్యకుం టనే ఎక్కి వొతిలేస్తుంటెను ఊరు మొఖాన. ఊరు కేరి వానమాంట్ల సుట్టెకు వోయిండ్రు. అడికెల్లి దొరోళ్ల ఇల్లు ఏమంత దూరం లేదు. గుడి దీపానికి దొంగల్లు సింతుకున్నరు. ఒక

సుట్టు గాల్చుకోని ఇగ కూకున్నరు. ఇంతట్లకే కెటకెటి వానకు ఊరంత యొక్కడిదక్కడి మాటు మనిగింది. ఉరుముల సప్పుడు దప్ప ఇగ ఏం ఇనపడతలేదు. మెల్లెగ లేసిండ్రు. బురుజాగోడలు జేరుకున్నరు. కొట్లకుదిగిండ్రు. కావలోళ్ల మీద ముత్తుమంగు జల్లిండ్రు, వాళ్ల తుపాకులు చేత బట్టుకున్నరు. దొర దొర సాని ఉన్న అర్రలకు బోయిండ్రు. తుపా కులు బట్టుకోని ఇద్దరు నిలుసుంటెరు. కత్తులు చేత బట్టుకోని ముగ్గురు దొరమంచం సుట్టు నిలబడిండ్రు. పెద్ద దొంగ దొర మెత్తికింద పెట్టుకొని తాలపుచేతులు తియ్యబోయిండు. [illegible] లేసిండు. ఊళ్లను [illegible] [illegible] ప్రాణాలు ఎగిరిపోయినట్లయినయి నోటమాట రాలేదు. ఇగేం, ఉండె సొమ్ము జాడ జెప్ప మన్నరు. పిల్లికూనయ్యిండు దొర. ఉండె గుండిట్ల జెప్పిండు. బతికనియ్యమన్నడు, బలసాకు దిని వుంటనన్నడు. మూతులరాల నుంచి కూడబెట్టిందంత దోసిండ్రు ముగ్గురు [illegible]. మూట గట్టుకున్నరు. దొర ఇంట్ల [illegible] వారి ఇంకింత ఎగబడి తాగిండ్రు. [illegible] [illegible] కొటాగుమికిండ్రు. ముసల్దాని [illegible] [illegible] బయలుదేరిండ్రు. దొంగల్లు బరువు తోటి. చెరువు కట్టమీది కొచ్చిండ్రు. తెల్లవారు తెసింది, [illegible] లేదు. ఒక్కసారిగ అందరు అంట్లబట్టెగ, కొట్టుకపోయిండ్రు.

ముసల్ది ఇగ వస్తరు, అగ వస్తరనుకుంట సూసున్నది. కోట్ల బట్టుకున్నకెమోనంటని బుగులుపడ్డది. తెల్లారిందాక ఒక్కతే ఏడిసి సాకింది. గాలిసప్పుడైతె కాలిసప్పుడంటని ఒక్కసారి బోయి తలుపు దీసేది. కాని ఎవరు లేకపొయ్యేవరకు మల్లి ఒక్కతి తలుపు మూసి బరువుగ ఇంట్లకొచ్చేది. పిల్లలు బోయిన తల్లిలాగ కేవులాడుకుంటుండెది. ఏం దోస్తలేదు ముసల్దానికి. ఊర్లదాక బోయి సూతామనుకున్నది. కూసుంటె లేవలేని ముసల్ది ఇంత వానల ఎట్ల బోతది. ఇంతట్లకు తెల్లారింది. [illegible] [illegible] మాట గొలిసింది. దొరోళ్లింట్ల దొంగలుబడి సామానంత ఎత్తుకపోయిండ్రంటని. [illegible] [illegible] మాట ఇనపడ్డది. [illegible] [illegible] దొంగల్ల మాటలు దొరగారి [illegible] దొరికినయ్యంటని. ముసల్దానికి [illegible] [illegible] నమ్మక మైపోయింది. [illegible] [illegible] ప్రాణాలు [illegible] [illegible] [illegible] [illegible] పోయింది, ఆ [illegible] [illegible] [illegible] దొరికినయాని ఎవరో [illegible].

[illegible] [illegible] ముసల్ది. ఎవరూ రాలేదు. అంత బిచ్చిబిచ్చి [illegible] పోయింది. [illegible] [illegible] [illegible] పోయిండ్రు. కాని ముసల్దానికి మాత్రం [illegible] లేదు. తాను [illegible] [illegible] [illegible] కొడుకులు బోయినట్లుండెది. [illegible] [illegible] మంచంబట్టింది [illegible]. [illegible] [illegible] ముసల్ది. [illegible] [illegible] [illegible] చెప్పింది ముసల్ది. [illegible] పట్వారిల రమ్మన్నది. [illegible] [illegible] రమ్మన్నది. ముసల్ది [illegible] [illegible] పిలుపిచ్చుకున్నది. [illegible] [illegible] మందరబోసింది. ఊరి [illegible] కట్ట బోసియ్యమన్నది. చెరువు పేరు "దొంగల చెరువు" అంటని [illegible] [illegible]. దాని [illegible] [illegible] [illegible] [illegible]. ఆ చెరువు [illegible] లోపల ఏయించుమన్నది. [illegible] [illegible] [illegible] [illegible] [illegible]. ముసల్ది [illegible] [illegible] కుంట "కొడుకో కొడుకో, [illegible] [illegible] [illegible] [illegible]" అని [illegible] [illegible] [illegible] పోయింది.

అప్ప [illegible] [illegible] [illegible]. కట్ట బోసి [illegible] [illegible], ఇప్పటికే చెక్కు చెదర లేదు. ఇప్పటికే [illegible] ఈ ఊరు, సుట్టు ముట్టు మూడు పల్లెలోళ్లం బతుకుతుండం." అంటని రామయ్య దొంగల చెరువు కతంత నాకు [illegible] చెప్పిండు.

[illegible] [illegible], ఆ [illegible] దాని [illegible] ఏ [illegible] అనుకుంట ఇంట్ల [illegible] [illegible]. [illegible] [illegible] [illegible] [illegible] ఆ చెరువుకట్ట [illegible]. [illegible] ఉరుక్కుంటరు. చెరువు నిండితె మూడు కార్లు పక్కలంగ [illegible].

(ఆకింసిరాం కిడిపా (ప్రసారితం) ★

[illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible]
[illegible] 7న [illegible] ప్రదర్శించిన "[illegible]" హిందీ నాటకంలో ఒక దృశ్యం. [illegible] శ్రీమతి [illegible], శ్రీ [illegible], శ్రీ కృష్ణమూర్తిగార్లు. ఈ నాటకం రచయిత శ్రీ [illegible] సూర్యనారాయణమూర్తి.

ఊసరవెల్లి

హెడ్ కానిస్టేబుల్ నీలకంఠం మరో లోకంలో విహరిస్తూ, కర్ర తిప్పుకుంటూ పెద్ద బజారుగుండా నడుస్తున్నాడు. వెనకాలే ఉసూరుమంటూ ఓ ఎర్రటోపీ నడుస్తోంది. పేరు వీరాసామి. వాతావరణం నిశ్శబ్దం. నరసంచారం సన్నగిలింది. చిన్న చిన్న బడ్డీదుకాణాలు దిగాలుగా రోడ్డువైపు చూస్తున్నాయి. బిచ్చగాళ్ళుకూడా కనుచూపు మేరలో లేరు.

హఠాత్తుగా నీలకంఠానికి ఓ గావుకేక వినబడింది. "కరుద్దామనుకున్నావేం పాపం! ఎయ్ అబ్బాయ్! దాన్నొదలద్దు కరుస్తుంది, పట్టుకోండి వదలద్దు"

ఓ కుక్క ఆర్తనాదం వినబడింది.

నీలకంఠం ఆ వేపు చూశాడు.

పాతాలగావున్న కట్టెలఅడితీలోంచి ఓ కుక్క మూడుకాళ్ళమీద కుంయ్యోమంటూ బయటపడింది. తరుముకుంటూ ఒక దిట్టమయిన ఆసామీ బయటపడ్డాడు. అంత జోరులోనూ, కుక్క వెనకకాలు పట్టుకోగలిగాడు. అదింకా పెద్దగా మొరిగింది. "వదలద్దు!" అంటూ ఇంకో పొలికేక.

ఉసూరుమంటూన్న బడ్డీ దుకాణాల్లోంచి ఊడిపడ్డారు - ఎక్కడలేని జనాభా అడితీ చుట్టూ చేరారు.

"ఇదేదో పెద్ద గోలగా వుంది సార్" అన్నాడు వీరాసామి.

నీలకంఠం పలకలేదు. అటువైపు నడిచాడు.

కుక్కని తరిమిన ఆసామీ, రక్తసిక్తమైన తన కుడిచేతి వేల్ని పైకెత్తి ధ్వజంలాగ జనానికి చూపుతున్నాడు. "నిన్నొదుల్తానా! చస్తే వదల్ను" పెద్దగా అరిచేస్తున్నాడు. భవిష్యత్తులో ఏదో విజయం సాధించబోయే దానికి ఇది కేవలం నాంది అన్నట్టు తన వేల్ని ఇంకా పైకెత్తుతున్నాడు.

అతని పేరు గవరయ్య. కంసాలి. నీలకంఠానికీ అతనికీ పూర్వపరిచయం ఉంది.

జనాభామధ్యలో తనకాళ్ళు తివటకం లేకుండా కుక్క పడివుంది. చిన్న తెల్ల కుక్క వణికిపోతున్నది భయంతో.

"ఏమిటిదంతా" అంటూ, జనాన్ని తోసుకుంటూ ముందుకొచ్చాడు నీలకంఠం.

"మీరంతా ఏంచేస్తున్నా రిక్కడ?"

ఎవరూ మాట్లాడలేదు.

"నీ చేతి కదేమిటోయ్?"

సమాధానం లేదు.

"ఎవరరిచింది?"

దానికీ జవాబులేదు.

గవరయ్య రంగస్థలంలోకి దూకాడు ఆయాసపడుతూ. "నేను మామూలుగానే తలొంచుకుని బుద్ధిగా వస్తున్నానండి - ఇక్కడ బంగారయ్యతో నాకో చిన్న వ్యవహారం ఉంది లెండి - వస్తున్నానా - మరంతే - యీ వెధవకుక్క అర్థం పర్థం లేకుండా గబుక్కున నా వేలు చ్చుకుంది. అసలే కంసాలిని. చెయ్యిలేనిదే డొక్కాడదు. ఈ కుక్క యజమానులచేత ఎలాగయినా నష్టపరిహారం ఇప్పించాలి తమరు. ఇంకో వారంరోజులదాకా యీ చెయ్యి నాకు పనికిరాదు. అసలీజాతిజంతువుల్నే దేశంలోంచి తరిమెయ్యాలి. ఏమిటో అంతా

జి. వి. శ్రీనివాసమూర్తి

వింతగా వుంది. ప్రతివాడూ ప్రతీదీ కరవటం మొదలెడితే ఇంకెలా బతకటం? ."

"ఊఁ సరే సరే." కొంత ఘాటుగా అన్నాడు నీలకంఠం కనుబొమ్మలుముడుస్తూ. "ఇంతకీ ఎవరిదీకుక్క? ఈ సంగతిలా వదిలేస్తే లాభంలేదు...ఎవరిదీ అంటే మాటాడరేమయ్యా ఈకుక్కల యజమానుకు గట్టిగా బుద్ధి చెప్పాలి. రూల్సుప్రకారం నడిచేవాడు ఒకడూ లేడు. హుఁ - ఎవడీకుక్క యజమాని...? చెప్పు. బాగా జరిమానా వెయ్యాలి కుక్కల్ని ఇదేల్ని రోడ్డుమీద వదిలిపెడితే ఏమవుతుందో చెప్పాలి. ఏమిటో సంగతి కనుక్కుంటూ. వీరాసామీ..."

"సార్ _"

"కనుక్కో ఎవర్దో ఈ కుక్క. ఒక రిపోర్టుకూడా రాయి. ముందు దీన్నిక్కడ నుంచి లాగి పారేయించు. పిచ్చిదేమో కూడా. ఎవరిదో ఈ కుక్కంటే చెప్పరేం?" అంటూ గదమాయించాడు చుట్టూ వున్న జనాన్ని.

"డి. ఎస్. పి. గారిది" అని జనాభాలోంచి ఒక కంఠం వినబడింది.

"డి. ఎస్. పి గారిదా? హుఁ - వీరాసామీ. ఏమిటయ్యా తెల్లమొహం వేస్తావ్? హుఁ- ఊపూ ఉక్కబోస్తోంది - వాన కురుస్తుందేమో."

గవరయ్యకేసి తిరిగాడు.

"నాకిందాకట్నుంచి అర్థంకావటంలేదు. అసలు నిన్నెలా కరచింది? నీ వేలు ఎలా పట్టుకున్నదీ?-చిన్న కుక్కపిల్ల! ముద్దొస్తున్నది- నేను నమ్మను, చస్తే నమ్మను. నువ్వే ఏ మేకుతోనో వేలు గీసేసుకునుంటావు - నష్టపరిహారమని పేరు చెప్పి డబ్బు కాజేద్దామని- నేనునమ్మను. నాకు తెలుసు; మీలాంటి వాళ్ళ సంగతి తెలుసులేవోయ్-"

వీరాసామి ముందుకొచ్చాడు.

"సార్, అగ్గిపుల్లవేసి దాని ముక్కు అంటించివుంటాడు సార్ తమాషాకి. ఆ దూకుడుంటుందా? కాటేసింది. దానికి మాత్రం తెలీదూ—అసలీ గవరయ్య ఎప్పుడూ ఏదో కోతిపని చేస్తూనేవుంటాడు సార్ —"

గవరయ్య కోపం వచ్చింది.

"ఏం అల్లరయ్యా—చూసినట్టు మాట్లాడకు. అబద్ధాలాడుతా వెందుకయ్యా—నువ్వు చూశావా నే నంటించడం? ఆయనకి తెలుసు ఎవరబద్ధం ఆడుతున్నారో—పైన

★ ఊసరవెల్లి ★

భగవంతుడికే తెలుసు—న్యాయంఉండాలి, మనమంతా ఒకటే — అమాటకొస్తే మా అన్నొకడు పోలీసుల్లోఉన్నాడు తెలుసా?"

నీలకంఠానికి ఒళ్ళు మండింది. "అధిక ప్రసంగం" అన్నాడు.

ఇంతలో వీరాసామి అనుమానిస్తూ "సార్ ఇది మన డి. ఎస్. పి. గారి కుక్క కానట్టుంది సార్. ఆయనకీ జాతి కుక్క లేవు" అన్నాడు చివరకి ఖచ్చితంగా.

"నీకు బాగా తెలుసా?"

"బాగా తెలుసు సార్."

"అవును. కాదుమరి — డి. ఎస్. పి. గారి కుక్కలు చాలా ఖరీదైనవి. మేలు జాతివి. దీన్ని చూడు. వెధవది ఊరకుక్క. ఇందాకా సరిగ్గా చూడనేలేదు. ఇటువంటి చెత్తకుక్క నెవడు పెంచుతాడు— ఇదే యింకెక్కడయినా రోడ్డంట కనబడితే ఏంజరుగుతుందో తెలుసా. రూలూ గీలూ వదిలేసి దీని అంతు తేలుస్తారు. గవరయ్యా- నీవేం భయపడకు. పాపం పెద్దగాయం అయింది, వాడికి నే బుద్ధి చెబుతానుగా— ఏమిటో కనుక్కుంటాను."

వీరాసామికి మళ్ళీ కొత్త అనుమానం కలిగింది.

"సార్! నా కనుమానంగా ఉంది సార్. ఇది మన డి. ఎస్. పి. గారిదే నేమో అనిపిస్తోంది సార—ఊరికే చూసి చెప్పలేం. ఇటువంటిదాన్నే ఇదివరకు ఆయన దొడ్లో చూశాను సార్."

"అవును. ఇది ఖచ్చితంగా డి. ఎస్. పి గారిదే" అని జనంలోంచి కొందరు ఏకీభవించారు.

"అదే......హుం! వీరాసామీ— ఏమిటో. బాగా గాలికొడుతూంది. చలేస్తూంది. హుం! అదే—దీన్ని డి. ఎస్. పి. గారింటో వొదిలెయ్. నాకు దొరికితే పంపానని చెప్పు. చాలా ఖరీదయిన కుక్కేమో—పాపం. ప్రతివాడూ దాని మూతిమీద అగ్గిపుల్లలు అంటించటమే చెడిపోతుంది. అసలే సుకుమారమైన జంతువు—ఏమిటోయ్ యింకా ఆ చెయ్యి పైకి చూపిస్తావ్-జండాలాగ.కిందికి దించు ఊహూ ఆ వేలు చూపిస్తావేమిటి. అంతా నీ తప్పే మరి—" అంటూ అక్కడనుంచి కదలబోయాడు.

ఇంతలోనే "అడుగో డి. ఎస్. పి. గారి కారుడ్రైవరు. అతన్నడుగుతే సరి" అని ఒకరరిచారు.

నీలకంఠం వెనక్కి తిరిగాడు. డ్రైవరు వస్తున్నాడు తాపీగా బీడీకాలుస్తూ.

"ఏయ్, ఇలా రావయ్యా—చూడు ఈ కుక్క వరిదో చూడు. మీదేనా? అంటే డి. ఎస్. పి. గారిదేనా?"

డ్రైవరు పరిశీలించాడు.

"కాదు."

"నేను చెప్పలేదూ—ఇటువంటి వెధవ కుక్కల్ని ఆయనెందుకు పెంచుతారూ! సరే-ఎందుకయ్యా అలా చూస్తూ నిలబడతారు? లాగిపారేయండి వెధవకుక్కని. తుక్కు రేగొటండి," రెచ్చిపోతున్నాడు నీలకంఠం.

డ్రైవరు మళ్ళీ అందుకున్నాడు. "ఇది మాది కాదుగానీ, డి. ఎస్. పి. గారి తమ్ముడిది. ఆయన ఈమధ్యనే ఇక్కడికొచ్చారు. ఈ జాతి కుక్కలంటే ఆయనకి పంచప్రాణాలు..."

"ఏమిటీ!.. హు...డి ఎస్. పి. గారి తమ్ముడుగారు వచ్చారా? నిజంగా— చెప్పావుకాదేం!" అని మొహం చాటంత చేశాడు నీలకంఠం "నాకింతవరకూ తెలీదు సుమా. అదే. అంతా తమాషా అదే-అదే. అన్నగార్ని చూడాలని అనుకుంటూన్నారు- అనుకోడూ మరి-వచ్చారు. అదే—నాకింతవరకు తెలీనేలేదుసుమా — వచ్చేశాడూ అంతే-ఆఁ—ఈ కుక్క ఆయనదన్నమాట. మొదటినించీ అనుకుంటూనే వున్నాను. చిన్న కుక్కపిల్ల బావుంది! మేలుజాతిది. తీసికెళ్ళు—వాడి వేలు కరిచిందట—కరవమూ-హా హా హా— దామ్మ-దా... ఏం కోపమే-అబ్బ ఏం ముద్దొస్తున్నదయ్యా—"

డ్రైవరు కుక్కని పట్టుకుపోయాడు.

జనం గవరయ్యని చూసి నవ్వారు. "నీ సంగతి తేలుస్తాలే" అన్నట్టు గవరయ్యకేసి ఓ చూపు చూసి ముందుకి నడక సాగించాడు నీలకంఠం.

★

(చెకోవ్ కథ ఆధారంగా)



గోదావరి పుష్కరోత్సవాలు

ఇల్లిందల సరస్వతీదేవి

ఈ సంవత్సరము గోదావరీ పుష్కరాలు. పుష్కరకాలము సమీపిస్తున్నదని దేశమంతటా అప్పుడే అలజడి ప్రారంభమవుతున్నది. ఇంటింటా ప్రయాణ సన్నాహాలు జరుగుతూ ఉన్నాయి. లక్షలాది యాత్రికులు నిర్ణీతమైన ప్రదేశములో సమావేశము కావటానికి తగిన ఏర్పాట్లు, ప్రభుత్వ పక్షాన అతి చురుకుగా జరుగుతున్నట్లు పత్రికలు ప్రకటిస్తున్నాయి. రైల్వే శాఖవారు ప్రయాణాలకు తగిన సౌకర్యాలను, పోలీసుశాఖ తగిన భద్రతను, ఆరోగ్యశాఖ తగిన రక్షణలను ఏర్పాటు చేయబోతున్నట్లుగా సుమారు నెలరోజుల క్రిందటే పత్రికలలో ప్రచురింపబడ్డది. లక్షలాది ప్రజల రాకవల్ల లాభము పొందదలచినట్లుగా, వస్త్రప్రదర్శనముకూడా మేనెల మొదటి వారమునుండి ఆరంభము కానున్నది. దీనిని పురస్కరించుకొని సభలు, పాటకచేరీలు, నాటకాలు, బుర్రకథలు, వినోదప్రదర్శనాలు మొదలైనవి ఎన్నైనా ఏర్పాటు కావచ్చు. పంచవర్ష ప్రణాళికా ప్రయోజనాలను చిత్రప్రదర్శనముద్వారా ప్రజలలో ప్రచారము చేయటానికి ప్రభుత్వ సమాచారశాఖ పూనుకోవచ్చు. మహిళా సంఘాలు స్త్రీలకు సాంఘిక, విద్యా, వైజ్ఞానిక ప్రచారము చేయవచ్చు.

లక్షలాదిగా పోగైన ఈ జనసమూహానికి తలకొక ప్రయోజనము ఉంటుంది. కాని మన పెద్దలు మాత్రము

'రేవాతీరే తపః కుర్యాత్
మరణం జాహ్నవీతటే
దానం దద్యాత్ కురుక్షేత్రే
గౌతమ్యాం త్రితయమ్ వరమ్'

అంటారు.

రేవాతీరాన తపస్సు చేస్తేను, గంగాతీరాన మరణము సంభవిస్తేను, కురుక్షేత్రములో దానము చేస్తేను అధికఫలము కలుగుతుందనీ, గోదావరీతీరాన పైమూడూ కూడా ఫలిస్తాయనీ పరంపరాగతమైన హైందవ విశ్వాసము. దీని ననుసరించి గోదావరీనది అత్యంత మహిమ కలదని తెలుస్తున్నది. కనుకనే పూర్వాచారపరులు గోదావరీతీరానికి చేరుకోవాలని ఆత్రపడుతున్నారు.

పుష్కరోత్సవాలు హిందూమతానికి సంబంధించినవి. భారతదేశములోని 12 ముఖ్యనదులకూ బృహస్పతిగ్రహానికీ కొంత సంబంధము కల్పింపబడి, దానికి మతప్రాముఖ్యము ఇవ్వబడ్డది. సూర్యమండలములో భానుగోళము తరువాత, మిగతా అన్ని గోళాలకంటె పెద్దదీ, ప్రకాశవంతమైనదీ బృహస్పతిగ్రహము. ఈ గ్రహాన్ని గురువనీ, జీవుడనీకూడా వ్యవహరిస్తారు. ఈ గురుగ్రహము జలతత్వానికి సంబంధించినదనీ, వర్షపాతానికీ ఈ గ్రహానికీ కొంత సంబంధము కలదనీ మనపూర్వులు విశ్వసించారు. ఈగురుగ్రహము ఖగోళచక్రములోని మేషాది పన్నెండురాసులలో రమారమి ఒక సంవత్సరకాలము ప్రతిరాశిలోను సంచారము

★ గోదావరి పుష్కరోత్సవాలు ★

చేస్తూవుంటుంది. అంటే ఇంచుమించుగా పన్నెండు సంవత్సరాలలో ద్వాదశరాశ్యాత్మకమైన భచక్రాన్ని చుట్టివస్తుంది. భారతదేశములోని గంగ, యమున, తామ్రపర్ణి, గోదావరి, కృష్ణ, కావేరి మొదలైన పన్నెండు నదులూ, ఒక్కొక్కటి ఒక్కొక్క రాశిచే పరిపాలింపబడుతున్నదని జ్యోతిషశాస్త్రజ్ఞులు నిర్ణయించారు. దానిననుసరించి, ఆరాశిలో గురువు సంచారము చేసేటప్పుడు తత్సంబంధమైన నదీజలాలు పవిత్రవంతమై, ప్రకాశవంతమై ప్రజలకు అత్యధిక శోభివృద్ధి కలిగిస్తాయని హైందవుల విశ్వాసము.

హైందవనాగరికతలో, మతములో నదులకున్న ప్రాముఖ్యము ప్రత్యేకముగా పేర్కొనవలసినది సుమతీశతక కారుడు చెప్పినట్లుగా 'ఎప్పుడు నెడతెగక పారు నేరు' వల కలిగే లాభాలు లెక్కకుమించినవి. భారతదేశ సౌభాగ్యానికి తోడ్పడే ప్రసిద్ధ నదీనదాలు (తూర్పునుండి పడమరకు ప్రవహించేవి నదములు-పడమరనుండి తూర్పుకు ప్రవహించేవి నదులు) జీవనదులు. ఈనదుల ఒడ్డుననే పుణ్యక్షేత్రాలు వెలిశాయి. నదిలో ఎక్కడయినా ఉత్తరవాహిని ఏర్పడినట్లయితే దానికి మరింత ప్రాముఖ్యము ఇవ్వబడ్డది. పవిత్రమైన నదీమతల్లులకు, భచక్రములో గురుసంచారాన్ని బట్టి ఏర్పడే ప్రత్యేకతే పుష్కరమనబడుతున్నది.

మేషేచ గంగా, వృషభేచ నర్మదా అన్న శ్లోకాన్ననుసరించి, బృహస్పతి సింహరాశిలో సంచరించినప్పుడు గోదావరీ పుష్కరాలనీ, కన్యలో సంచరించిన కృష్ణా పుష్కరాలనీ నిర్ణయము జరిగింది. ఇదేవిధముగా ఇతరనదులకు బృహస్పతి సంచారానికి సామ్యము కల్పింపబడి పుష్కరాల కాలము నిర్ణయింపబడ్డది.

పుష్కరకాలము ఒక్కొక్క నదికి రమారమి ఒక సంవత్సరకాలమని సాధారణ నిర్ణయము. ఇతరగ్రహాలవలెనే బృహస్పతి కూడా, అప్పుడప్పుడు వక్రగతిని సూచించటం మామూలు. ఒకరాశిలో ప్రవేశించటమూ, తిరిగి కొంతకాలము వెనుకటి రాశిలోకి వచ్చినట్లు కనబడటముకూడా జరుగుతుంది ఏరాశిలోనయినా బృహస్పతి సక్రమముగా ప్రవేశించిన మొదటి పదిదినాలు, ఆ రాశిని బృహస్పతి వదలిపోయే కడపటి పదిదినాల కాలమూ స్నానానికి అతి పవిత్రమైనదనీ, అతి అనుకూలమైనదనీ ప్రాచీనులు నిర్ణయించారు. జీవనదీస్నానము ప్రతిసిద్ధముగా పుణ్యప్రదమనీ, అందులోనూ ప్రతి నదికీ 12 సంవత్సరములలో ఒక సంవత్సరాంతకాలము మరింత పుణ్యప్రదమనీ, ఆ సంవత్సరములోకూడా ఆదిమధ్యాంత్యభాగాలలో రోజులు అతి పుణ్యవంతమైనవనీ మనవాళ్లు భావిస్తారు.

మతదృష్ట్యా గోదావరీనది అతి పవిత్రమైనది. దీనికితోడు నాసిక, భద్రాచలము, రాజమహేంద్రవరము మొదలయిన సుప్రసిద్ధ ప్రాచీన దేవక్షేత్రాలుకూడా ఈ నదీతీరాన తటస్థించితే వాటిమాహాత్మ్యము ఎన్నతరముకాదు. పవిత్రవంతమైన ఈ పుష్కరకాలములో నదీస్నానముకొరకు తండోపతండములుగా హిందువులు గుమికూడుతారు. నదీస్నానముచేసి, సంకల్పము చెప్పించుకొని, అఘమర్షణ సూక్తాలను పఠించుకొని, త్ర్యంబకేశ్వరస్వామినో, సీతారాములనో, మార్కండేయేశ్వరుడినో దర్శించుకొని తరించామని సంతుష్టి చెందుతారు. కనుకనే నాసికకు, భద్రాచలానికీ, రాజమహేంద్రవరానికీ యింత ప్రాముఖ్యము వచ్చినది. రాజమహేంద్రవరము సమీపించే సరికి, గోదావరీనది పరిపూర్ణస్వరూపము దాలుస్తుంది. దీనిలో కలసే ఉపనదులన్నీ అదివరకే కలసి ఉంటాయి. రాజమహేంద్రవరము దాటిన తరువాత, అఖండగోదావరి పాయలు పాయలుగా చీలిపోతుంది. కనుక గోదావరీ పుష్కరాలకు అఖండగోదావరి ప్రవహించే రాజమహేంద్రవరము దర్శించుకొనవలసిన పవిత్రక్షేత్రము.

రాత్రివేళ తామ్రపాత్రలో నిలవవుంచిన నీటికి, ఆ లోహముచేతనూ, కాలప్రవాహమువల్లనూ ఒక విధమైన శక్తి కలుగుతుందని ఆయుర్వేదశాస్త్రజ్ఞులు చెప్పుతున్నారు. ఆనీరు క్రమము తప్పకుండా మండలము (40 దినాలు) సేవించినట్లయితే దేహములో ప్రాణశక్తిని వృద్ధిచేసి అనారోగ్యమును పోగొట్టగలదు; ఆరు మాసాలు సేవించినట్లయితే కాయసిద్ధి కలుగుతుందని ఆయుర్వేద వైద్యుల విశ్వాసము. ఈ ఉదకము తెల్లవారుజామున త్రాగినట్లయితే ఏరోగము పుట్టనేరదని ఘంటాపదముగా వారు చెప్పగలుగుతున్నారు. ఈవిశ్వాసముననుసరించే పవిత్రవంతమైన పుష్కరోదకాలను, పుణ్యనదీజలాలను రాగిచెంబులలో నింపి, లక్కతో సీలుచేసి, ఇండ్లకు తీసుకొనివస్తారు. సమారాధనలుచేసి ఆ పవిత్రోదకాన్ని అతిథులచేత, అభ్యాగతులచేత సేవింపచేస్తారు. ప్రతి యాత్రికుడూ గంగచెంబులను కొని, ఆప్తులకూ, బంధుమిత్రులకూ అందచేస్తూ ఉంటాడు.

యాత్రికులలో పురుషులు జపతపాలు, పితృతర్పణాలలో నిమగ్నులయి ఉంటారు; స్త్రీలు నదీదేవతల పూజలు, మాసివాయనాలు నిర్వర్తించుకుంటారు. తీర్థము సేవించి పుణ్యము సంపాదించిన ప్రతి ఉవిద, ఇల్లు చేరుకోగానే ఒక పాత్ర, కుంకుమపొట్లము రవికకోటే తోటిముత్తయిదులకు యిచ్చి, తన వంతు పుణ్యాన్ని వారితో పంచుకుంటుంది.

మత విశ్వాసాల అర్థము తెలియకపోయినా ఆచరించే పట్టుదల స్త్రీలకు ఎక్కువగా ఉండటముచేత వాళ్లుకూడా అధిక సంఖ్యలో పాల్గొంటూనే ఉంటారు. మన ఆచారాలలో ఉన్న అర్థాలను గ్రహించటానికి ప్రయత్నించినట్లయితే స్త్రీజనాభ్యుదయము ఒక చక్కని మార్గమున సాగినదవుతుంది. ★

మనసు లోని మాట

పిళ్లా సుబ్బారావుశాస్త్రి

ఆ నగరంలో పెద్ద పేరుగల వ్యాపారి నారాయణ్ సేఠ్ ఎన్నో ఏళ్ళనుండీ వ్యాపారం సాగిస్తున్నాడు. అతని తాత తండ్రులు కూడా ఆ నగరంలో పుట్టినవాళ్లే! నగరంలో పెద్దపెద్ద వారంతా అతని కొట్టుకే వచ్చేవారు. అతని దగ్గర కొన్న వస్తువు అంటే—ఎవరూ వ్యాఖ్యానించేవారు గాదు! "చాలా బాగుంది!" అని ఊరుకునేవారు. మరికొందరయితే, వస్తువు చూసి... అతనిన్నిగురించీ, అతని తాతను గురించీ చెప్పుకొచ్చేవారు.

సేఠ్ దగ్గర మోహన్‌లాల్ అనే గుమాస్తా ఉండేవాడు. మోహన్‌లాల్ చాలా బీదవాడే! కాని...అతనంటే సేఠ్ కెంతో నమ్మకం! పెద్ద పెద్ద ఖాతాదారుల యిళ్లకు పెద్ద మొత్తాలు వసూలు చేసుకురావడానికి అతన్నే పంపేవాడు. లాల్ ఎంత అంటే...అంతే! ఏనాడూ లాల్‌ని లెఖ్ఖ అడిగేవాడు కాదు సేఠ్. పుస్తకాల్లో లాల్ లెఖ్ఖలు వ్రాయడమే కాని...అవి ఏనాడూ సేఠ్ చూసి ఎరుగడు! లాల్ కూడా సేఠ్‌కి తెలియకుండా కాని — లెక్కలు తప్పులు రాసి... దమ్మిడీ అయినా తీసి ఎరుగడు!! ఎంత ప్రాణం మీదకు వచ్చినా...ముందు సేఠ్‌ని యింత తీసుకుంటానని అడిగేవాడు. అందుకు సేఠ్ కూడా కాదనేవాడు కాదు. మోహన్‌లాల్ తన కష్టార్జితం తనకుంటే చాలు అనుకునేవాడు.

ఒకనాడు మోహన్‌లాల్ భార్య అన్నది—"ఏమండీ! ఇన్నేళ్ళుగా సేఠ్ దగ్గర పనిచేస్తున్నారు కదా... ఒక్క దమ్మిడీ అయినా మిగిల్చారా? అమ్మాయిలకి చూస్తే పెళ్లీడు వస్తోంది కదా! అబ్బాయి చూస్తే పెద్ద చదువు చదువుతానంటున్నాడు. పోనీ ... వాణ్ని చదువు మానిపించి, ఏదో పనిలో పడేస్తాం! కానీ ... అమ్మాయిల పెళ్లిళ్ళు ఆపలేము కదా! ఈ రోజుల్లో ఎంత బీదవాడయినా పెళ్ళి అంటేనే ... 'కట్నం కావాలి' అంటున్నాడు -"

ఆమె యింకా ఏమో అనబోతో వుండగానే—"ఇంతకీ...నీ వనే మాటేమిటి?" అన్నాడు కొంచెం చిరాకుగా.

"ఇదిగో...మీరు యిలా చిరాకు పడతారనే, ఇన్నేళ్ళుగా ఈ విషయమే కాదు — ఏ విషయమూ మీతో చెప్పడం మానుకున్నాను. మీరలా చిరాకు తెచ్చుకుంటే—"

"ఇంతకీ నువ్వనే మాటేమిటీ?" అన్నాడు జాలిగా—"అదికాదండీ! పిల్లలిద్దరూ పెద్దవారవుతున్నారు కదా! వాళ్ళ పెళ్ళికి ... ఏదయినా వెనకేసుకుంటే పనికి వస్తుంది!" అన్నాదావిడ.

"ఇప్పటినించీ... ఈ ప్రయత్నం ఎందుకూ? ఆ వేళ వచ్చేసరికి అన్నీ అవే సునాయాసంగా జరిగిపోతాయి. ఎలాగూ...ప్రతీ నెలా సేఠ్ ఐదు రూపాయలు జీతంలో తీసివుంచుతున్నాడు కదా!" అన్నాడు లాల్.

"ఎక్కడి ఐదు రూపాయలండీ! ఒక పిల్ల పెళ్ళికే ఐదువేలు కావలిసి వస్తోంటే...!"

"ఐదువేలు కాకుంటే...పదివేలు కానీ!—నీ మనసులో ఉన్నమాట మాత్రం అర్థం అయింది. అది మాత్రం చచ్చినా...నే, చెయ్యను!" అని నిర్మొగమాటంగా, సూటిగా చెప్పేశాడు లాల్. తిరిగి తానే అన్నాడు—"అయినా, ఒకరిడబ్బు మనకెందుకూ? మన డబ్బు మనకి ఉంటే—అదే చాలు!" అని.

ఇంటిదగ్గర అలాగన్నాడేగానీ - భార్య చెప్పిన మాటలు చెవులలో గింగురుమంటూనే వున్నాయి. అవి నిజంగానే తోచినయి. దుకాణంలో కూర్చున్నంతసేపూ - ఏదో భారం అతనివీపుమీద వున్నట్టుగావున్నది. గతాన్ని గుర్తుకు తెచ్చుకొని-విచారించాడు. ఏవేవో ఆలోచించాడు. తర్జనభర్జన పడి చివరకు ఒక నిర్ధారణకు వచ్చాడు లాల్. ఆ వారంలో ఎలాగయినా—ఐదువందలు రూపా

బాలగేయం:

తీరిన కోరిక

ఆలపర్తి వెంకటసుబ్బారావు

కలదు 'ఢిల్లీ' పట్టణమున
కౌశికుడను బ్రాహ్మణుండు!
చదువు అతని కసలు రాదు
మది దీరని కోర్కెగలదు !!

పండితు డనిపించుకొనగ
పరితపించు సతత మతడు!
తీరదాయె నా కోరిక
తీరు దెలియ కతడు తుదకు

వీరబలుని సమీపించి
విన్నవించె దన కోరిక!
జాలిదలచి వీరబలుడు
సలహా యిటు లిచ్చినాడు:

"దారులన్ని కలియుచోట
కూరుచుండు నీవు వెళ్ళి,
అచట నిన్ను ఎవ్వరైన
అన్నయెడల పండితుడని

కొట్టబొమ్మ తరిమి తరిమి!
కొద్దికాల మటుల జేయ
పండితు డను పేరు నీకు
ఉండిపోవు శాశ్వతముగ!"

వీరబలుని మాటమీద
గుతీ కుదిరిన బ్రాహ్మణుడు
మరునాడే కూర్చుండెను
దారులన్ని కలియుచోట!

ఇంతలోన వీరబలుడు
కొంతమంది బాలకులను
పంపినాడు బ్రాహ్మణుని
పండితుడని పిలువమనీ!

బాలు రటుల పిలువగాన
బ్రాహ్మణుండు కొట్టబోయె!
ఇది జూచిన బాలకులకు
మది నుత్సాహంబు గలిగి

అదేపనిగ బ్రాహ్మణుని
అనసాగిరి పండితు డని!
ఇట్టె నాల్గురోజు లవగ
పట్టణమున నివసించెడి

పెద్ద పెద్ద వారుగూడ
పిలచినారు పండితుడని!
తీరె పాప మతని కోర్కె
వీరబలుని సలహాపై!!

★ మనసులోని మాట ★

యలుకు తప్పడు లెక్కలు వ్రాయా లనుకున్నాడు. అదీ అతని నిర్ణయం.

మజో విశేషం!—అదే రోజున సేఠ్ అలా మడతకుర్చీలో పడుకొని ఏవేవో ఆలోచించాడు—మోహన్‌లాల్ తన దగ్గర గుమాస్తా పని చేస్తో...పాతికేళ్లుపైనే అయింది. ఈ పాతికేళ్ళలో ఏం రాశాడో... ఏం చేస్తున్నాడో ఒక్కనాడు కూడా... పుస్తకాలు తీసి లెక్కలు చూడ లేదు! మోహన్ మంచివాడయినా అతని లెక్కలు చూడడం మాత్రం తన కర్తవ్యం అనుకున్నాడు. వెంటనే నౌకర్‌ను పిలిచి "బండీ సిద్ధం చెయ్యి" అన్నాడు.


ఇక దుకాణంలో మోహన్‌లాల్ గుండె నిబ్బరం చేసుకొని...ఐదువేల రూపాయలూ ఇనప్పెట్టినుంచి తీశాడు! చేతులు వణికినయ్! ఏదో భయం వేసింది!!—"సేఠ్‌కి నేనంటే ఎంతో నమ్మకం! పాతికేళ్ళనుంచీ, యీ కొట్లో పనిచేస్తూ, సేఠ్ డబ్బు తిని సేఠ్‌కి ద్రోహం చెయ్యడం!— అంత నీచపు పని మరొకటి లేదు. సేఠ్ ఒకవేళ...వచ్చి లెక్కలు అడిగితే — తప్పక దొరికిపోతాను!... పాతికేళ్లనుంచీ యీ పని చేస్తున్నానని సేఠ్‌కి అనుమానం తప్పక కలుగుతుంది! వెంటనే నన్ను పనిలోనుంచి తొలిగిస్తే—తిరిగి యిటువంటి పని చేసిన నాకు ఉద్యోగం దొరకదు! అయినా—ఇంత వయస్సు వచ్చిన తర్వాత కోరి పాపాన్ని తెచ్చుకున్నవాణ్ని అవుతాను. ఈ పని యీజన్మలో చెయ్యను. లక్ష్మీదేవి తోడు...!"అంటూ, ఐదువేలు చేతిలో పెట్టుకొని 'ఒట్టు'పెట్టుకొని ఆడబ్బుని తిరిగి ఇనప్పెట్టెలో పెట్టేశాడు!

సేఠ్ సగం దూరం వచ్చిన తరువాత అనుకున్నాడు—"లాల్‌ని నేను పాతికేళ్లనుంచీ లెక్కలు అడిగి ఎరుగను. ఇవాళ హఠాత్తుగా లెక్కలు అడిగితే...లాల్ బాధపడ వచ్చు. ఈ అవమానంతో పని మానేస్తే—నాకుతిరిగి అంత నమ్మకస్థుడు దొరకడు! లెక్కలు అడిగి అతన్ని బాధపెడితే—అంత మంచిది కాదు!" అని వెంటనే బండిని ఇంటికి తిప్పించేశాడు.

మోహన్‌లాల్ డబ్బు ఇనప్పెట్టెలో పెట్టేశాడు! సేఠ్ బండీని యింటికి తిప్పించేశాడు—తిరిగి నాటి నుంచీ నేటివరకూ లాల్‌కి అటువంటి కోరికలు కలుగనూ లేదు! సేఠ్ లెక్కలు చూడనూలేదు!! ★

బాలసాహితి సీరియల్

సాగర గర్భంలో సాహస యాత్ర



మూలం: జూల్స్ వెర్న్

జరిగిన కథ :—

అది 1866 వ సంవత్సరం ప్రారంభం. సాగర గర్భంలో బ్రహ్మాండమైన జలజంతువేదో కనిపించిందనే వార్త ప్రపంచప్రజలను భ్రాంతులను చేసింది. సముద్రంలో ప్రయాణంచేసే నౌకలకది ఇట్టే కనిపించి ఇట్టే మాయమయ్యేది. ఒకరోజు ఒకచోట కనిపించి, మరొక రోజు కొన్ని వేల మైళ్ళ దూరంలో ప్రత్యక్షమయ్యేది. కొన్ని నౌకలకు దానివలన చిన్న చిన్న ప్రమాదాలు సంభవించాయి. కొందరది ఏదో గొప్ప జలచరమై ఉండాలనీ, కొందరు అది మునిగిపోయిన కొండ చట్టు కావచ్చుననీ, కొందరది పెద్ద జలాంతర్గామి అయివుంటుందనీ రకరకాలుగా వాదించసాగారు. ఏమైనా దానివలన నాగరిక ప్రపంచానికి, ముఖ్యంగా నౌకా ప్రయాణాలకి ప్రమాదం సంభవించవచ్చునని అందరూ అభిప్రాయపడ్డారు. దాని అంతు కనుక్కొని హతమార్చాలని ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. అమెరికా ప్రభుత్వం అబ్రహాం లింకన్ అనే యుద్ధనౌకను ఆ జలజంతువును వేటాడడానికి నియమించారు. అమెరికా ప్రభుత్వ నౌకాశాఖా కార్యదర్శి హాబ్సన్ ఫ్రెంచి ప్రకృతిశాస్త్ర పరిశోధకుడు ప్రొఫెసర్ అరోనాను ఈ విజ్ఞానయాత్రలో పాల్గొనవలసిందని ప్రార్థిస్తాడు. అతను వెంటనే దాని కంగీకరించి తన పరిచారకుడు కొన్సిల్ తో సహా ఓడ ఎక్కుతాడు. అబ్రహామ్ లింకన్ క్రమక్రమంగా పసిఫిక్ మహాసముద్రంలో ప్రవేశిస్తుంది. అబ్రహామ్ లింకన్ అలాగ కొంతదూరం ప్రయాణం చేసేసరికి కొంతదూరంలో సముద్రతరంగాలమీద ఒక పెద్ద వెలుగు కనిపించింది. ఆ వెలుగు ఒక పెద్ద జలచరానికి సంబంధించినదై ఉండాలని నౌకాధికారులంతా ఊహించారు. నావ దానిదగ్గరికి పట్టించి దానిమీద ఫిరంగుల వర్షం కురిపించారు.

6

అబ్రహామ్ లింకన్ అలాగే అతి వేగంగా ముందుకుపోతూ ఆ జలచరానికి బాగా దగ్గరగా వెళ్ళిపోయింది. అయితే ఆ జలచరం మునిగిపోలేదు. అలాగే తరంగాల మీద తేలుతూ మా ఓడ నెదిరించి పోరాడేటట్లు కనబడింది. కాని మరుక్షణంలోనే కొంచెం వెనక్కి తగ్గింది.

తరవాత మా ఓడ నెమ్మది నెమ్మదిగా దాన్ని వెంటాడించింది. ఆ వ్యవహారం అంతా అలాగే ఒక ముప్పావుగంటదాకా సాగింది. మానౌక ఎంత తొందరగా వెంటాడించినా అధమం దానికి నాలుగు గజాల సమీపందాకా కూడా వెళ్ళలేకపోయింది. ఇక ఎంత తంటాలు పడినా దానికి దగ్గరగా వెళ్ళడం దుస్సాధ్యమని తెలిపోయింది.

కెప్టెన్ విసుగ్గా గడ్డం మెలిపెట్టి తిప్పుతూ "నెడ్ లాండ్! చిన్న నావలేమైనా సముద్రంలోనికి దింపడం అవసరం అంటావా!" అన్నాడు.

"ఏమీ లాభం లేదు! ఆ జంతువు

అనువాదం:

"వినాయక"

ఇష్టంలేనిదే మనం దాన్ని పట్టుకోలేము!"

"అయితే మరి ఇప్పుడేం చెయ్యాలి?"

"ఓడ బాగా జోరుగా పోనివ్వండి! బాగా దగ్గిరిగా వెళ్లగలిగితే ఆ అదను చూసుకొని ఒకసారి బల్లెం విసురుతాను!"

"అయితే సరే! ఇంజనీర్! ఓడ బాగా జోరుగా పోనీ!"

తరవాత నెడ్‌లాండ్ బల్లెం చేత్తో పట్టుకొని ఆ జంతువుమీదికి విసరడానికి సిద్ధంగా నిలుచున్నాడు. ఓడ మంచి జోరుగా పోతూంది. గంటకు సుమారు 18 మైళ్ళ వేగం అందుకొన్నదని చెప్పవచ్చును! కాని ఆ జంతువు కూడా సరిగా అంతటి వేగంతోనే పారిపోవడం మొదలుపెట్టింది.

మా నౌక ఇంచుమించుగా అదే వేగంతో ఆ జంతువును వెంట దరిమింది. జంతువుకూడా సరిగా అదే వేగంతో పరుగుపెట్టింది!

అలాగ ఎంతగా ప్రయత్నించినా అబ్రహాం లింకన్ పూర్వాంకం ఒక గజంమేరవరకుకూడా దాన్ని సమీపించలేకపోయింది! అమెరికా నౌకాదళంలో అబ్రహామ్ లింకన్ కంటె అతివేగంగా పోగలిగిన నౌక ఇంకొకటి ఏదీ లేదు. అందుచేత నావికులందరికీ అది ఒక పెద్ద తలవంపుగా కనబడింది. దానితో వారందరికీ ఒళ్లు మండిపోయింది. కొందరు సరంగులు లోలోపలి అక్కసంతా ఆజంతువుమీద వెళ్లగక్కారు! కాని అది సమాధానం చెప్పాలనైనా అనుకోలేదు! అంతే! అలాగే జరజరా ముమ్ముందుకు సాగిపోయింది. కెప్టెన్ మెలిపెట్టిన గడ్డం మునివేళ్ళతో కొరకడం కూడా మొదలుపెట్టాడు. తరవాత ఇంజనీరును మళ్ళీ పిలిచాడు:

"ఓడ పోగలిగినంత జోరుగాను పోతూందా?"

"అవును సార్!"

కెప్టెన్ ఈ విషయంలో చెయ్యగలిగినంతా చెయ్యమని ఆజ్ఞాపించాడు. తరవాత ఇంజనులో పట్టినంతవరకు రాక్షసిబొగ్గు వేశారు. ఇంజను బాగా వేడెక్కింది. ఓడ మరింత జోరుగా సాగింది. ఆ సమయంలో ఓడ గంటకు 19 మైళ్ల దాకా నడిచింది. "ఇంకా జోరుగా పోనీ!" అని కేకవేశాడు కెప్టెన్. ఓడ టాపు ఆ వేగానికి గజగజ వణికిపోయింది. కాని ఆ జంతువు కూడా అంత వేగంతోను పరుగు తీసింది.

ఆహా! ఆ వేగం వర్ణనాతీతం! నా కప్పుడు కలిగిన భావాలు వ్రాయడం చాలా కష్టం! నెడ్‌లాండ్ అలాగే బల్లెం చేత్తో పట్టుకుని సిద్ధంగా నిలబడ్డాడు. ఆజంతువు రెండు మూడుసారులు బాగా అందుబాటులోకి వచ్చింది. నెడ్‌లాండ్ ఆ ఒకటి రెండుసారులు తన బల్లెం దానిమీదికి విసిరివేద్దామని కూడా అనుకున్నాడు. అంతలోనే ఆ జంతువు గంటకు ముప్ఫై మైళ్ళ వేగంతో ముమ్ముందుకు సాగిపోయింది! ఎంత ప్రయత్నించినా మరి మా ఓడ దాన్ని పట్టుకోలేకపోయింది.

దానితో ఓడలో ఉన్న సరంగులందరికీ ఒక్కసారిగా ఒళ్లు మండిపోయింది. మేము ఉదయం ఎనిమిది గంటలకు ఆ జంతువుకు ఎంత దూరంలో ఉన్నామో 12 గంటలైనా సరిగా అంతే దూరంలో ఉన్నాము. ఇక గత్యంతర మేమీ లేక కెప్టెన్ అంతకన్నా మంచిమార్గం అవలంబించాలని నిశ్చయించాడు:

"ఓహో! ఆ జంతువు మన నౌకకన్నా బాగా వేగంగా వెళ్ళిపోతున్నదన్నమాట. సరే! అయితే అది తుపాకిగుళ్ళకన్నా వేగంగా పోగలదేమో చూదాము! వెంటనే ఫిరంగిలో మందుగుండు సామాను కూరి సిద్ధం చెయ్యండి!"

అటుపిమ్మట వెంటనే ఓడ ఫిరంగి మందుగుండుసామానుతో సిద్ధం చెయ్యడం జరిగిపోయింది. మరుక్షణంలో ఆ ఫిరంగి ధామ్మని పేలింది. కాని పేల్చిన ఫిరంగిగుండు జలచరానికి పైపైనే దూసుకుపోయింది! అంతేనే గాని దానికి తగలలేదు! అది పేల్చేసరికి ఆ జలచరం ఓడకు ఇంచుమించుగా ఒక మైలున్నర దూరంలో ఉంది.

అది చూచి కెప్టెన్ "అయితే ఇంకొకరెవరైనా ఫిరంగి పేల్చండి! ఆ జలచరాన్ని గురిచూచి కొట్టినవారికి 5 వందల డాలర్ల బహుమతి!" అని ప్రకటించాడు.

ఆ విషయంలో బాగా అనుభవం సంపాదించిన వృద్ధుడొకడు ఫిరంగిదగ్గిరికి వెళ్ళి జాగ్రత్తగా గురిచూచాడు. అతని గడ్డం జనపనారపీచులా బాగా తెల్లబడిపోయింది. మళ్ళీ మరుక్షణంలో ఫిరంగి ధామ్మని పేలింది. వెంటనే నావికులంతా హర్షనినాదాలు చేశారు.

గుండు తగలవలిసినచోటే తగి

లింది. కాని అది దాని వీపుమీది నుంచి చల్లగా జారిపోయి రెండు మైళ్ళ దూరంలో పడింది.

కెప్టెన్ అది చూచి "ఎంత దురదృష్టం! ఆ జంతువుకు 6 అంగుళాల మందం ఉన్న ఇనపకవచం ఉన్నదన్నమాట!......ఓడ నాశనమైపోయినాసరే! దాన్ని పట్టితీరతాను!" అని గట్టిగా అరిచాడు.

ఆ జంతువును అలాగ తరుముకుపోతే కొంతసేపటికది బాగా అలిసిపోగలదనీ అప్పుడు దాన్ని పట్టవచ్చుననీ అందరు ఆశించారు. అలాగలాగ కొన్ని గంటలు గడిచిపోయాయి. కాని అది అలిసిపోయిన సూచన లెక్కడా కనిపించలేదు.

అబ్రహామ్ లింకన్‌లోని నావికులంతా ఆ రోజంతా చాలా పట్టుదలగా పని చేశారు. ఆ వేళ ఎన్ని మైళ్లు ప్రయాణం చేశామో చెప్పలేను గాని సుమారు 3 వందల మైళ్ళదాకా ప్రయాణం చేసిఉండవచ్చును. అయితే అంతలోనే సూర్యాస్తమానం అయింది. బాగా చీకటి పడింది.

దానితో మా యాత్ర పూర్తి అయిపోయిందనీ ఇంక తిరిగీ ఆ జంతువు మా కంట పడడం జరిగే పని కాదనీ అనుకొన్నాను.

కాని నేను పొరబడ్డాను. రాత్రి ఇంచుమించుగా 4 గంటలయ్యేసరికి ఆ జంతువు వెలుగు మళ్ళీ ప్రత్యక్షమైంది. ఆ వెలుగు మా కించుమించుగా మూడు మైళ్ళ దూరంలో ఉండవచ్చునని అనుకున్నాను. ఆ వెలుగు క్రితంరాత్రి కనిపించినట్టుగానే బాగా విస్పష్టంగా కనబడింది. తళతళలాడుతూ మెరిసిపోయింది.

ఆ జలచరం కదలిక లేకుండా ఒకేచోట స్తిమితంగా ఉన్నట్లే కనబడింది. పగలంతా శ్రమపడి రాత్రి సముద్రతరంగాల ఉయ్యాలలో పడుకొని సుఖంగా నిద్ర పోతూందేమో! అయితే తప్పకుండా దాన్ని పట్టుకోవచ్చుననీ ఆ అవకాశం జారవిడువ కూడదనీ కెప్టెన్ నిశ్చయించాడు.

వెంటనే ఉత్తరువు జారీ చేశాడు. అబ్రహామ్ లింకన్ నెమ్మది నెమ్మదిగా ఆ జలచరంవైపు పోయింది. దానికి నిద్రాభంగం కలగకుండా నెమ్మదిగా దగ్గరకు వెళ్లాలని మా కెప్టెన్ ఆలోచించాడు. కొన్ని తిమింగిలాలు సముద్ర తరంగాలమీద నిద్రపోతూనే ఉంటాయి. అది అందరికీ తెలిసినవిషయమే! నెడ్ లాండ్ అలాంటి పరిస్థితులలో ఎన్నెన్నో తిమింగిలాలను సంహరించివేశాడు. అతడు వెంటనే తన బల్లెం చేత్తో పట్టుకుని విసరి వెయ్యడానికి సిద్ధంగా నిలబడ్డాడు.

మా యుద్ధనౌక నెమ్మది నెమ్మదిగా ఆ జలచరాన్ని సమీపించింది. జంతువు నెడ్‌లాండ్‌కు బాగా అందుబాటులోకి వచ్చింది. నావికులందరు ఊపిరికూడా విడవడం మానివేసి తదేక దృష్టితో దానివైపు చూచారు. నౌకలో అంతటా ప్రశాంత భావం మూర్తీభవించినట్లుంది. మాకు, ఆ జలచరానికీ మధ్యన వెయ్యి అడుగులకంటె ఎక్కువదూరం లేదు. జలచరం కాంతి క్రమంగా ఎక్కువై మా అందరి కళ్ళు జిగేలు మనిపించింది.

ఆ సమయంలో నెడ్‌లాండ్ ఓడ ముందరిభాగం కొయ్యల కానుకుని నిలుచుని తన బల్లెం ఆ జలజంతువు మీదికి గురిపెట్టాడు. మేమంతా కనురెప్పపాటు లేకుండా అలాగే అతనివైపు చూచాము.

ఉత్తరక్షణంలోనే అతడా బల్లెం విసిరివేశాడు. అది సరిగా వెళ్ళి ఆ జలజంతువు వీపు పైభాగానికి తగిలి టంగుమని మృదుమధురంగా ధ్వని చేసింది.

అంతే! ఆ దెబ్బ తగలగానే ఆ జలచరం వెలుతురంతా ఒక్కమారుగా అదృశ్యమైపోయింది. జలచరంలోనించి బ్రహ్మాండమైన జలధారలు రెండు మా ఓడమీదికి ప్రసరించాయి. వాటితో మా ఓడ అంతా నిండిపోయింది. వాటి దెబ్బకు చాలామంది సరంగులు సముద్రంలో పడిపోయారు! ఓడ లోపలిభాగం అంతా చెల్లాచెదరై పోయింది. ఆతరవాత ఏమి జరిగిందో అంతస్పష్టంగా జ్ఞాపకంలేదు గాని చెవులు గింగురుమనేటట్లొక పెద్ద పేలుడుధ్వని వినిపించింది! నిలుచున్నపాటుగా నేను సముద్రంలో పడిపోయాను! నాచుట్టూరా కన్ను కన్ను కనబడని గాఢాంధకారం!

7. అపూర్వ తిమింగిలగిలం!

హఠాత్తుగా సముద్రంలో పడిపోయినా ఆతరవాత జరిగినవన్నీ నాకు చాలా స్పష్టంగానే జ్ఞాపకం ఉన్నాయి. మొట్టమొదటగా నేను సముద్రంలో ఇరవైఅడుగుల లోతు వరకు మునిగిపోయాను. నేను పెద్ద గజఈతగాణ్ణని పేరు పొందిన ఘటాన్ని. అందుచేత సముద్రంలో మునిగిపోయినంతమాత్రాన్ని నేనేమీ కంగారుపడలేదు. రెండే రెండు బారలు వేసి సముద్రంపైపైకి వచ్చేశాను.

★ సాగరగర్భంలో సాహసయాత్ర ★

పైకితేలిన ఉత్తర క్షణంలో నేను మొట్టమొదటగా మా యుద్ధనౌక సంగతే ఆలోచించాను. మా నావికులు నేను సముద్రంలో పడి మునిగిపోవడం గమనించారా? నాకోసం ఒకనావ సముద్రంలోనికి దింపుతారా? నాకైమైనా మళ్ళీ బతికి బట్టకట్టుకొనే ఆశ ఉందా? అని అనేకవిధాలుగా మథనపడ్డాను.

చుట్టూరా గాఢాంధకారం. నాకు తూర్పుదిక్కున ఒక నల్లనల్లని వస్తు వేదో మెల్లిమెల్లిగా మునిగిపోతున్నట్లు కనిపించింది. దాని దీపాలు మినుకు మినుకుమంటూ చల్లారిపోతున్నాయి! అది మాయుద్ధనౌకే! సందేహమేమీ లేదు! ఆ విషయం ఆలోచిస్తూంటే నాలోని ఆశాజ్యోతి పూర్తిగా కొండెక్కిపోయింది.

అతి కష్టంమీద ఈదుకుంటూ నేను మా యుద్ధనౌక సమీపానికి వెళ్లి, 'రక్షించండి! రక్షించండి' అని కేకలు పెట్టాను.

నా బట్టలన్నీ తడిసి ముద్ద అయిపోయాయి. కాళ్లు చేతులు కదిలించడానికి కూడా ఓపిక లేదు.

మళ్ళీ ఒకేఒక్క సారిగా గట్టిగా "రక్షించండి!" అని కేకపెట్టాను. అదే నా ఆఖరి కేక! నేను మునిగిపోతున్నాను. కాని కాయశక్తులా నా ప్రాణరక్షణకోసం తాపత్రయ పడుతున్నాను.

ఇంతలో ఎవరో నా బట్టలు పట్టుకుని గట్టిగా పైకి లాగుతున్నారని అనిపించింది. నా చెవిలో ఈ మాటలు వినిపించాయి.

"మీరు కొంచెం నాబుజంమీద ఆనుకుంటే—ఇంతకన్నా బాగా ఈదడానికి వీలవుతుంది."

నేను వెంటనే ఆ వ్యక్తిబుజం పట్టుకున్నాను.

"ఎవరు? నువ్వేనా కౌన్సెల్?"

"అవును! నేనే బాబూ!" అన్నాడు కౌన్సెల్.

"ఆ దెబ్బతో నువ్వు కూడా సముద్రంలో పడిపోయావా?"

"పడిపోలేదు గాని మిమ్మల్ని రక్షించడంకోసం నేనే సముద్రంలో ఉరికాను."

పాపం! కౌన్సెల్ నన్ను రక్షించడం ఒక్కటే తన ఏకైక కర్తవ్యమని అనుకున్నాడు!

"అయితే మన యుద్ధనౌక మాటేమిటి?"

"యుద్ధనౌకా? ఇక దాన్ని గురించి తలపెట్టకపోవడం చాలా మంచిది!"

"ఎందుచేత?"

"నేను సముద్రంలో దూకుతూంటే చుక్కాని కాసే మనిషి— చుక్కానీ, గిక్కానీ అన్నీ ధ్వంసమైపోయాయని అరిచాడు.

"ధ్వంసమైపోయాయా?"

"అవును! ఆ జలజంతువు కోర దెబ్బతో అవ్వన్నీ ధ్వంసమైపోయాయి. అవ్వన్ని లేనినాడు ఆ ఓడ ఇక ఎందుకూ పనికిరాదు."

"అయితే మనపని అయిపోయిందన్నమాటే!"

"బహుశః అంతేననుకుంటాను. అయితే మనకింకా కొన్ని గంటల వరకు ఆయుర్దాయం ఉండవచ్చును! మన అదృష్టం బాగుంటే ఈలోగా ఏది జరిగినా జరగవచ్చును!"

కౌన్సెల్ ధీమాతో నాకు కొంచెం ధైర్యం కలిగింది. నేనింకా బాగా ధైర్యంగా ఈదడం మొదలు పెట్టాను. అయితే మా ఇద్దరికీ తడిదుస్తులమూలకంగా బాగా పెద్ద ఇబ్బందే ఏర్పడింది. ఎంత ప్రయత్నించినా నీటిలో ఈదడం చాలా కష్టమైపోయింది. అందుచేత కౌన్సెల్ తన తాళంచెవులగుత్తిలో ఉన్న కత్తెరతో అనవసరమైన నా దుస్తులన్నీ కత్తిరించివేశాడు. నేను కూడా చాలావరకు అనవసరమైన అతని దుస్తులన్నీ కత్తిరించివేశాను. దానితో మా ఇద్దరికీ ఆ అనవసరమైన దుస్తుల బాదరబందీ అంతా వదిలిపోయింది. మేమిద్దరం మళ్ళీ సుఖంగా ఈత ప్రారంభించాము.

—ఇంకా ఉంది

రాసి పెట్టిన చోటు

పాలంకి వెంకటరామచంద్రమూర్తి

యమలోకంలో చిత్రగుప్తులవారు ఒకనాటి ఉదయం యథాప్రకారం తమ కార్యాలయానికి వచ్చేసరికి, గుమాస్తాలందరూ లేచి నిలబడి, 'నమస్కారమండీ' అన్నారు.

వాళ్ళ నమస్కారాలందుకుని ఆయన కళ్లజోడు సవరించుకుంటూ 'భూలోకంలో రేపటితో ఆయుర్దాయం చెల్లిపోయినవాళ్ళ జాబితాలు తయారయాయా?' అని ప్రశ్నించారు.

గుమాస్తాలు, 'సిద్ధంగా ఉన్నాయండి. రేపు మరణించవలసిన మానవుల పేర్లు, వయస్సులు, చిరునామా, మరణసమయం వగైరా వివరాలన్నీ చేర్చి పట్టీలు తయారు చేశాం. తాము ఒక్కసారి చూసి దస్కతు పెడితే వాటిని మృత్యుదేవతకు ఇచ్చేస్తాం' అన్నారు.

చిత్రగుప్తులవారు, ఒక్కొక్క జాబితాయే చూసి, 'సరిగానే ఉంది' అంటూ దస్కతు పెట్టి మృత్యుదేవతకు ఇచ్చేశారు.

ఆమరునాడు మర్త్యలోకంలో మిథిలానగరమందు జనకమహారాజు మధ్యాహ్న సంధ్యావందనం చేసుకుంటూన్న సమయంలో, శరవేగుడనే పరిచారకుడు గుండెలు కొట్టుకుంటూ వచ్చి రాజుముందు నిలబడ్డాడు.

భయంతో వణికిపోతూన్న సేవకుణ్ణి చూసి రాజు, 'ఏమిరా?' అన్నాడు.

'ప్రభూ, నేను పాకశాలకు అవసరమైన సామగ్రిని తేవటానికి విపణివీథికి వెళ్లాను. అక్కడ నాకు మృత్యుదేవత ఎదురై భయంకరంగా గుడ్లురచేసింది!' అన్నాడు శరవేగుడు.

జనకుడు, 'మృత్యుదేవత భయంకరంగా ఉండదే? ఆమెను చూచి నువ్వే అనవసరంగా బెదిరిపోయి ఉంటావు. ఆయుర్దాయం చెల్లినవాళ్లని తీసుకుపోవడం ఆమెవిధి. ప్రయాణీకుడు బండి రావడంతోనే ఎక్కి వెళ్లిపోయినట్లు మృత్యుదేవత రావడంతోనే ప్రతీజీవీ వెళ్లిపోవాలి. మరణమనేది తప్పనిసరి ప్రయాణం కనుక భయపడి మాత్రం ఏం లాభం!' అన్నాడు.

శరవేగునికి జనకుడు చెప్పినది బోధపడలేదు. వాడు ఏడుస్తూ, 'ప్రభూ, నేనిక్కడ ఆలస్యం చేస్తే, నన్ను మృత్యువువచ్చి లాక్కుపోతుంది. నన్ను త్వరగా పోనివ్వండి.' అన్నాడు.

జనకుడు ఆశ్చర్యంతో, 'ఎక్కడికి పోదామని?' అన్నాడు.

శరవేగుడు, 'అయోధ్యానగరానికి పారిపోతాను. అక్కడ సీతమ్మతల్లి వద్ద సేవకుడనై బ్రతుకుతాను' అన్నాడు.

జనకుడు, 'అయితే ఆదారినే పోక నా దగ్గిరకెందుకు వచ్చినట్లు?' అన్నాడు.

శరవేగుడు, 'నడిచి వెడితే ఆలస్యమై మృత్యుదేవత నన్ను వెంటాడి పట్టుకుంటుంది! నాకు తమ అశ్వశాలలోని గుఱ్ఱాన్ని ఒకదాన్ని ఇప్పించండి.' అన్నాడు.

జనకుడు 'నీ యిష్టం వచ్చిన గుఱ్ఱాన్ని తీసుకు వెళ్లు.' అన్నాడు.

అశ్వశాలలోని హయాలలోకల్లా 'మనోవేగం' అనే గుఱ్ఱం గొప్పది.

శరవేగుడా గుఱ్ఱాన్నెక్కి మిథిలానగరం వదలి అయోధ్యవైపు దౌడు తీశాడు.

జనకుడు ప్రజల యోగక్షేమాలను తెలుసుకోవడంకోసం నగరసంచారానికి బయలుదేరాడు. రాజవీథమ్మటే వెడుతోంటే ఆయనకు ఒక యింట్లోనుంచి రోదనం వినిపించింది.

మహారాజు ఆ గృహాన్ని ప్రవేశించి 'ఎందుకు దుఃఖిస్తున్నారు?' అని అడిగేడు. ఆ యింటివాడు, స్పృహ తప్పి కొనఊపిరితో ఉన్న తన భార్యవైపు చూపి, 'ఎన్ని మందులు పోసినా బ్రతికేటట్టులేదు.

నన్ను దుఃఖసముద్రంలో ముంచి వెళ్ళిపోతోంది!' అని ఏడవటం మొదలుపెట్టేడు.

జనకుడు, 'నీవు షావుకారు వద్ద వది రూకలు అప్పు తెచ్చావనుకో. అతడు తన బాకీవసూలుకై నీవద్దకు వస్తాడు అప్పు వసూలయేవరకూ నీ గుమ్మంలో ఉంటాడు. వసూలై పోవడంతోనే వెళ్ళిపోతాడు.' అన్నాడు.

ఆ గృహస్తు విస్తుపోయి 'ఇప్పుడీ ఋణప్రసక్తి తెచ్చారు దేనికి ప్రభూ?' అని అడిగేడు.

మహారాజు, 'షావుకారుకు మల్లేనే భార్య, పుత్రులూ, ఋణాన్ని అనుసరించి వస్తారు. నీ పెరటిలోని పశువులూ, నీవు నివసిస్తోన్న ఈ గృహమూ కూడా ఋణానుబంధ రూపేణా వచ్చినవే. వసూలవటంతోనే చక్కాపోయే షావుకారుకు మల్లేనే పశు, పత్ని, సుత, ఆలయములు కూడా పోతాయి. దుఃఖించడం దేనికి?' అని, ఆ గృహస్థుకు మనశ్శాంతి కల్గించి, బయటకు వచ్చాడు.

ఆయన ఈవలకు వస్తోంటే ఆ యింట ప్రవేశింపనున్న మృత్యుదేవత ఆయనను చూసి, 'రాజర్షి పుంగవా, నమస్కారము.' అన్నది.

ఆమె కనపడడంతోనే జనకునకు శరవేగుని మాట జ్ఞప్తికి వచ్చి, 'అమ్మాయ్, నిన్నొకటి అడుగుదామనుకుంటున్నాను.' అన్నాడు.

ఆమె, 'ఏమిటి మహాత్మా?' అన్నది.

జనకుడు, 'ఈ గృహిణిని తీసుకు వెళ్ళడానికి వచ్చిన నీవు విపణివీథిలో కనపడ్డ నా సేవకుడు శరవేగుని చూసి గుడ్లెరచేశావుట, ఎందుకు?' అన్నాడు.

ఆమె, 'నాకు పనిఉన్న చోటికి సూటిగా వెళ్లడమే మామూలు. నేను సాధారణంగా దిక్కులు చూసేదానను కాదు. కాని శరవేగుడా విపణివీథిలో కనపడటంతో ఆశ్చర్యంవేసి, "వాడేనా వీడు?" అని పరికించి చూశాను' అంది.

జనకుడు, 'నీకు వాణ్ణిచూడటంతోనే ఆశ్చర్యం ఎందుకు కలిగింది?' అని అడిగేడు.

ఆమె చిత్రగుప్తుడిచ్చిన జాబితాను తీసి, దానిలో శరవేగుని పేరుకు ఎదురుగా నున్న చిరునామాను చూపించింది.

జనకుడు, "శరవేగుడు-వయస్సు ముప్ఫైయారు - మరణసమయం ముప్ఫైరెండు ఘడియల ఏడు విఘడియలు — చిరునామా, అయోధ్యానగరంకోటగుమ్మం" అని చదివేడు.

మృత్యువు, "ఈ సాయంత్రం అయోధ్యానగరం కోటగుమ్మంలో నాకోసం కనిపెట్టుకొని ఉండవలసిన శరవేగుడు మిథిలానగరంలో ఉన్నాడేమిటి? చిత్రగుప్తులవారిచ్చిన చిరునామా తప్పు కాదు గదా?' అనుకుంటూ వాడికేసి ఒకమాటు చూశాను. అంతే" అంది.

జనకుడు, 'చిత్రగుప్తుడు ఇచ్చిన చిరునామా సరియైనదే! శరవేగుడు సాయంకాలానికి అయోధ్య చేరుకుంటాడు!' అన్నాడు.

మృత్యువు, 'అది సాధ్యమా? ఎక్కడి మిథిల? ఎక్కడి అయోధ్య?' అంది.

జనకుడు 'శరవేగుడు నా అశ్వశాలలోని 'మనోవేగమ' నే గుర్రాన్ని కోరి తీసుకున్నాడు!...ఆహా, ఎంత చిత్రంగా ఉంది! నిన్ను తప్పించుకు పారిపోతున్నాననుకుంటూ పోయి-నిర్ణీతప్రదేశానికి వచ్చి నిన్ను కలుసుకుంటున్నాడు!' అన్నాడు. ★

అక్కయ్య అపరాధ పరిశోధన

మా పెద్దక్కయ్యంటే మాయింట్లో అందరికీ భయం. అలాగని మానాన్నకీ మాబాబయ్యలకీ, మాతాతయ్యకీ అనుకునేరు. అలా కాదు, మాయింట్లోవున్న పిల్లలందరికీను. ఎందుచేతంటే మా అక్కయ్య మేము (అంటే పిల్లలం) ఏమైనా తప్పుపనులు చేస్తే తను శిక్షిస్తుంది. రాత్రిళ్లు 9 గంటలవరకూ అందరూ చదివి తీరవలసిందే. తను 'మేష్టారి' లాగా మధ్యమధ్యవచ్చి చదువుతున్నామో లేక బాతాఖానీ వేస్తున్నామో చూస్తూంటుంది. కునికిపాట్లు పడుతూంటే ఒకసారి హెచ్చరించి పైకి గట్టిగా చదవమంటుంది. మాకందరికీ లెఖ్ఖలిచ్చి చేయమంటుంది. తప్పులుంటే దిద్దుతుంది. మాకు ఇంగ్లీషు అక్షరాలు నేర్పుతుంది. మేముకూడా ఎంతో ఆసక్తితో, ఉత్సాహంతో నేర్చుకొంటాము!

తప్పుపనులు చేస్తేను లేక చదవకుండావుంటేను నాలుగు మొట్టికాయలేస్తుంది గాని, చదువుకుంటే కొనుక్కొందికి డబ్బులిస్తుంది. అందుచేత మేమందరమూ శ్రద్ధగా చదువుతాము. బట్టలు మాపుకోకూడదంటుంది. అంతే! ఆజ్ఞ శిరసావహిస్తాము. సాయంకాలం ఆడుకోమంటుంది. వారానికో, పదిహేనురోజులకో మమ్మల్నందరినీ 'సినిమా'కి తీసుకవెళ్తుంది. మాకు కథంతా బోధపరుస్తుంది. 'సినిమా' లలో మంచి చెడ్డలుంటాయనీ, మనం చెడుగుని వదలిపెట్టి, మంచిని మాత్రమే తీసుకోవాలని చెబ్తుంది. ఎలాగంటే గులాబీచెట్టుని పువ్వులుంటాయి. ముళ్ళుంటాయి. మనము ముళ్ళను ముట్టకోకుండా పువ్వులను మాత్రమే తీసికొంటాం. అలాగే మంచిని తీసుకొని చెడుగుని విసర్జించాలంటుంది. చెడు స్నేహాలు చేయవద్దు అని అంటుంది.

2

బావ మదరాసునుంచి 'క్రిస్టమస్' సెలవలకి వస్తానని వుత్తరం వ్రాశాడు. ఆవేళ మెయిలులో బావ వస్తాడని తెలిసింది. మా పెద్దక్కయ్య తన గది చాలా నీటుగా వుంచింది. ఆవేళే పూర్తిచేసిన 'కర్టెను' గుమ్మానికి కట్టింది. మాలో "సూర్యం" కాస్త పెంకిఘట్టం. వాడు "ఆకలేస్తోంది. కొనుక్కోడానికి డబ్బులియ్యి" అని అక్కయ్యను అడిగేడు. అక్కయ్య బావ వస్తాడని సంతోషంలో వుంది. వెంటనే పెట్టె తెరచింది. కాని, చిల్లరలేదు. అందుచేత "తరువాత యిస్తాను. యివ్వడు చిల్లరలేదు" అంది. మావాడు కాసేపు మారాం పెట్టేడు. కాని లాభంలేకపోయింది. మేమందరమూ వాణ్ణి వూరుకోమన్నాము. కాని వాడు వూరుకోలేదు. మా వాడికి 'ఒక్కటి' తక్కువ గాని, లేకపోతే "ఆంజనేయు"లంతటివాడు. వాడు చిత్తు కాగితాలు, ఇసక తీసుకవచ్చి కిటికీలోనుంచి అక్కయ్య గదిలో వేశాడు. అక్కయ్య అప్పుడే గదిలోకి వస్తోంది. వాడిని చూసింది. వెంటనే వాడిని పట్టకొని, నాలుగు తగలనిచ్చింది. వాడు అసలే వుడుకుమోతు. అంచేత అక్కయ్యను పట్టుకొని తిట్టడం మొదలెట్టాడు. బావ వస్తాడని తనగది శుభ్రపరచుకొంటే వీడు డబ్బులివ్వనంత మాత్రాన తుక్కుపోశాడు. తను కోపంతో కొట్టింది. వాడు వూరుకోక తిట్టాడు. వెంటనే కోపంతో అక్కయ్య వాడిని మరింత గట్టిగా కొట్టింది. మా వాడు దాకలాగా నోరుపెట్టుకొని యింక రాగాలాపన మొదలెట్టాడు, యింటిపెంకు లెగిరిపోయేటట్టు. పీడిరాగము వంటింట్లో వున్న అమ్మకి వినిపించింది. అన్నం కలియబెడుతున్నదల్లా ఆ గరిటతోనేవచ్చింది, ఏదో కొంప మునిగిపోయినట్టు. అమ్మని చూడగానే వాడు గొంతు మరింత పెద్దది

రమేశ్ కుమార్

★ అక్కయ్య అపరాధ పరిశోధన ★

చేశాడు. కుర్రవాళ్లుగదూ, ఏదో పెంకితనం చేస్తారు, నాలుగు తింటారు. దీనికి పెద్ద రాద్ధాంతం ఏమిటి? అమ్మ "ఏం జరిగింది" అని అడిగింది. మా సూర్యం ఏడుస్తూ, నేలమీదపడి దొర్లుతున్నాడు. అక్క జరిగింది సవిస్తరంగా చెప్పింది అమ్మకి. అక్క సంగతి అమ్మకి తెలుసును కాబట్టి "ఓస్ ఇంతేనా! ఊరుకోమ్మా, నేను డబ్బు లిస్తానన్నానుగా" అని ఊరడించి వెళ్లిపోయింది వంటింట్లోకి. పాపం! అక్కయ్యకి జాలివేసి, మనసు కరిగి పెట్లోంచి అర్థరూపాయి తీసి వాడికిస్తూ "ఇవాళ మీరు నలుగురూ హోటలుకుపోయి దోశలు తినండి" అంది. మా సూర్యం మొహం చేటంతయింది. వెంటనే చొక్కాతో కళ్లు తుడుచుకున్నాడు. మాకేసి ఒకసారి చూసి తనవెంట రమ్మన్నాడు హోటలుకు. వాడు ముందు "కథానాయకుడి"లాగా నడుస్తుంటే మేము వాడివెనకాల వెళ్లాం సంతోషంగా. అక్క వాడి అమాయకత్వం చూసి నవ్వుకుంది. తను మళ్లీ గది శుభ్రపరచటంలో నిమగ్నురాలైంది.

మెయిల్లో బావగారు వచ్చారు. ఆయన వస్తూనే మమ్మల్ని పలకరించారు. కూలివాడు పెట్టె, బెడ్డింగ్ మోసుకొచ్చి అక్క గదిలో పడేశాడొకమూలాల. తరువాత బావగారు 'బిస్కట్లు, చాక్లెట్లు, రకరకాల ఆడుకునే బొమ్మలూ' పెట్లోంచి తీసి మా కిమ్మని అక్క కిచ్చారు. తరువాత అక్క మాకందరికీ అవి యిచ్చింది. "ఒరే! లక్కీఛాన్సు అంటే మనదేరా. ఇవ్వాళ సాయంకాలం దోశలు తిన్నాం. ఇప్పుడు బిస్కట్లూ, చాక్లెట్లూ ఎంచక్కా ఆడుకోడానికి బొమ్మలూ, హాయ్, హాయ్" అంటున్నాడు సూర్యం సంతోషంతో. అప్పుడు మేము అనుకొన్నాము:"అక్కయ్య, బావ-ఇద్దరూ మంచివాళ్లేనని." అక్కకి సూర్యం అల్లరిపిల్లకాయ అని తెలుసు కాబట్టి తనే సమానంగా అందరికీ బొమ్మలూ, అవీ పంచి యిచ్చింది. సూర్యానికి మంచివి వొచ్చాయో, ఏమిటో వాడు మరి నోరెత్తలేదు. అక్కయ్య యిచ్చినవే సంతోషంగా పుచ్చుకున్నాడు. మిగతా వాళ్లు సరేసరి! వాళ్లు వుత్త అమాయకులు! వాళ్ళకా మదరాసు వింత బొమ్మలు ఇవ్వటంతో వుబ్బి, తబ్బిబ్బయ్యారు!!! "మీకోసం వేడినీళ్ళు కాచాను నీళ్లు పోసుకోండి" అంటూ తువ్వాలు, సబ్బుపెట్టె తీసుకొని అక్కయ్య బాత్‌రూమ్‌కి దారితీసింది.

3

ఆరోజుల్లో పటికబెల్లం చాలా ఖరీదు. అదీకాకుండా విరివిగాకూడా దొరికేది కాదు. అక్కయ్య కూతురికి పాలల్లోకి అని ఒక పౌను పటికబెల్లం తెప్పించింది. అందులో అరపౌను గుండగా కొట్టి ఒక సీసాలో వేసింది. మిగతా అరపౌను పటికబెల్లం ముక్కలూ మరో సీసాలో వేసి, రెండూ తనగదిలో బల్లమీద పెట్టింది మధ్యాహ్నం రెండు గంటలకి. తరువాత గదితలుపులు దగ్గరగా వేసి, మామూలుగా సావిట్లోకి వచ్చేసింది. మళ్ళీ అక్క తన గదిలోకి నాలుగున్నర కల్లా వెళ్లి చూస్తే ఏముంది? తను రెండు గంటలకి బల్లమీద పెట్టిన అర పౌను పటికబెల్లంముక్కలూ, అర పౌను పటికబెల్లం గుండా రవంత కూడా కనిపించలేదు. అక్క ఒక్కసారిగా నిర్ఘాంతపోయింది. అసలే పటికబెల్లం దొరకనిరోజులు. డాక్టరు పటికబెల్లమే పాలల్లో వేయమని చెప్పారు. దొరుకుతుందో, దొరకదో? ఒక్కసారిగా ఆశ్చర్యం కోపం వచ్చాయి అక్కకి. ఎవరు కాజేశారో తెలుసుకోవాలి అనుకుంది. పిల్లలు తీసారా, అంటే వాళ్లయితే ఒక చిన్న ముక్క లేకపోతే పెద్ద ముక్క తీసుకుంటారు. కాని పౌను పౌనూ వాళ్లకెందుకు? అందుచేత పిల్లలు తియ్యలేదని నిర్ధారణ చేసుకొంది...కాదు,కాదు ...నిర్ధారణ చేసికోలేదు. ఊరికినే తనలో తాను ప్రశ్నించుకొని తాత్కాలికంగా సమాధానపరచుకొంది. ఇక దాసిది తీసిందా అంటే అదింకా పనిచెయ్యటానికే రాలేదు. ఆవేళ అది అదృష్టవశాత్తు 5 గంటలకు వచ్చింది. లేకపోతే ఈ నేరం దానిమీదే మోపబడేదేమో? దాసీదానికి ఈ పటికబెల్లంతో సంబంధంలేదనడం నిర్వివాదాంశం! ఐతే ఎవరు తీసివుండాలి? లేక ఎవరు తినివుండాలి? పౌను పటికబెల్లం ఒక్కడూ గాని, ఇద్దరు గాని తినడం అసంభవం! పిల్లలు తీసివుంటారు లేక తిని వుంటారు అని అక్కయ్య ఇప్పుడు నిర్ధారణ చేసికొంది.

పిల్లల్ని ఒక్కొక్కరినే పేరు పెట్టి పిలిచి, తన గదిలోకి తీసికెళ్ళి

నయానా, భయానా అడిగింది. ఎవరూ జవాబు చెప్పలేదు. "మేము తియ్యలేదు, అంటే మేము తియ్యలేదు" అన్నారు. అక్కయ్య అనుకుంది: "ఒకవేళ వీళ్ళు నలుగురూ తినేసి, తోడుదొంగల్లాగా కూడబలుక్కొని తియ్యలేదు అని చెప్తున్నారా?" అని. కాని 'చిట్టి' ఎప్పుడూ నిజమే పలుకుతుంది. మిగతావాళ్ళు అంటే సుబ్బిగాడూ, రావిగాడు-వీళ్ళు కూడా ఈకోవకు చెందినవాళ్లే. అబద్ధం చెప్పడం తెలియని అమాయకులు! వీరుముగ్గురూ పోతే ఇహ మిగిలినవాడు "మొండి, శిఖండి" సూర్యంగాడు. వాడు అక్కయ్య అడుగుతున్నప్పుడే బెదురుచూపులు చూస్తున్నాడు. మాటలు తడబడుతున్నాడు. తనొక డిటెక్టివ్‌లాగా ప్రశ్నలు వేసికొని, సమాధానపరచుకొని, దొంగ ఎవరో తెలుసుకొంది! మరి, 'డిటెక్టివ్'లు ముందుగానే దొంగ ఎవరో చెప్పివేయరుగా, అట్లానే అక్కయ్య కూడా చెప్పలేదు! ఏమో' ఏం పరిశోధన చేస్తోందో 'ఫలానావాడు దొంగ' అని ప్రత్యక్షంగా నిరూపించడానికి.

4

అక్కయ్య దొంగచేత 'తనే పటికబెల్లం తీశానని' చెప్పించాలనుకొంది. రాత్రి ఏడుగంటలకి పిల్లలందరూ వంటింటి ప్రక్కనున్న నడవలో కూర్చున్నారు భోజనాలకి. నడవకెదురుగా నున్న తలుపు తీస్తే పెద్దపెరడు కనిపిస్తుంది. అది ఒక పెద్ద అరణ్యంలాగా కపిస్తుంది రాత్రిళ్లు. ఎందుచేతంటే దానినిండా రకరకాల చెట్లున్నాయి. అదేకాని పట్టపగలు చూస్తే ఎంతో అందంగా సుందరంగా కనిపిస్తుంది. రాత్రిఅయితే పెద్దవాళ్లకే భయంవేస్తుంది. అటువంటిది పిల్లలకు భయంవేయడమొక లెఖ్ఖా! ప్రతిరోజూ భోజనాలు వడ్డించి "అన్నాలు తినడానికి రావాలి, వడ్డించేశాను," అని వంటావిడ సుబ్బమ్మగారు పెట్టే గావుకేకకి పిల్లలందరూ కిక్కురుమనకుండా వచ్చి భోంచేసి వెళ్ళిపోతారు. కాని ఇవ్వాళ ఖాళీ కంచాలు ముందుండడానికి కారణమేమిటో ఆ పసిహృదయాలకి తెలియలేదు. అక్కయ్య కాస్త 'విభూది బూడిద' చేతిలోకి తీసికొని, 'మంత్రకత్తె' లాగా ఏదో మంత్రించి, ఆ బూడిద సుబ్బమ్మగారి కిస్తూ "ఏమండోయ్! దీనిని అన్నంలో కలిపి మరీ వడ్డించండి వీళ్ళకి. ఈ అన్నం తిన్నవాళ్ళలో ఎవరు పటికబెల్లం దొంగో వాడిలో ప్రవేశిస్తుంది 'ఎర్రమారికమ్మ.' దాంతో దొంగ ఎవరో తెలిసిపోతుంది" అంది. సూర్యం కాస్త గాభరాపడుతూనే వున్నాడు. కాని, వాడెందుచేతో నిబ్బరంగానే వున్నాడని చెప్పాలి! బహుశా వాడి వుద్దేశ్యం 'విభూది బూడిదకలసిన అన్నం తిన్నంతమాత్రాన 'ఎర్రమారికమ్మ' తనలో ప్రవేశిస్తుందా? అని అనుకొన్నాడు. అన్నం వడ్డించేరు. తినడానికి ఉపక్రమిస్తున్నారు పిల్లలు. ఇంతలో అక్కయ్య హఠాత్తుగా పెరటి తలుపు తీసింది. ఘోరారణ్యదృశ్యం కనిపిస్తోంది ఎదుట. దానికితోడు ఆవేళ అమావాస్య రాత్రి. అంచేత చిట్టచీకటిగా వుంది. అదీకాక కీచురాళ్లు చేసే గోల, కప్పల బెకబెకలు అంతా ఆ వాతావరణాన్ని మరింత భీకరం చేస్తున్నాయి. అప్పుడు అక్కయ్య గంభీరమైన గొంతుతో "రా! ఎర్రమారికమ్మా రా! ఆదిశక్తి రా! మహాంకాళీ రా! పటికబెల్లం తాజేసిన దొంగని ఆవరించు" అంది. పిల్లకాయలు ఏడవడం మొదలుపెట్టారు. సూర్యం తప్ప మిగతా ముగ్గురూ "మేము తియ్యలేదు. తలుపు మూసెయ్యి" అని గోలపెడుతూ ఒకటే ఏడుపు. పాపం! సూర్యం వణికిపోతూ, "నేనే తీశానక్కయ్యా! తలుపు మూసెయ్యి!" అన్నాడు జీరపోయిన గొంతుకతో. అక్కయ్య తలుపులు మూసేసింది. వాడిని చూడగానే జాలి పుట్టిందో, ఏమిటో వాడిని బుజ్జగిస్తూ, కూపీ లాగడానికి "భయపడలేదులే, తీస్తే తీశావు గాని, అదంతా ఏం చేశావో చెప్పు?" అని అడిగింది. వాడు కళ్లు నులుపుకుంటూ, "అదంతా నేనే తీశాను. నీవు మొన్న నాకిచ్చిన చాక్లెట్ల డబ్బాలో పోశాను. నా స్నేహితులకి కొంచెం పెట్టి, నేను కొంచెం తిన్నాను. ఆ డబ్బా ఇక పెట్టెకింద వుంది. వెళ్ళి తీసుకో" అన్నాడు, కాస్త తేరుకొంటూ; అక్కయ్య తననింకేమీ అనదనే ధీమాతో. అక్కయ్య వెంటనే వెళ్ళి ఆ చాక్లెట్లడబ్బా తీసుకొచ్చి చూసింది. దాంట్లోనే గుండంతా వుంది, కాని ముక్కలుమాత్రం కొద్దిగా తరిగాయి. ఇంతా చేస్తే వాడు పంచిపెట్టింది-తిన్నది పావు వుంటే వీశెకు ఆరు తులాల కన్నా ఎక్కువ వుండదు. పాపం! వాడు రోజూ తిందామనే వుద్దేశ్యంతోనేమో అదంతా దాచాడు.

హాతిమ్ ఔదార్యం

ఒకప్పుడు అరబ్ దేశములో 'హాతిమ్' అను రాజు ఉండెను. అతడు మిక్కిలి ఉదార స్వభావుడు, దయార్ద్రహృదయుడు. అందుచే, హాతిమ్‌యొక్క పేరు దేశమంతటను వ్యాపించెను. కాని ఆయనకు నౌఫల్ రాజుమాత్రము శత్రువుగానుండెను.

ఒకసారి నౌఫల్ హాతిమ్‌పై దండెత్తి వచ్చెను. అప్పుడు హాతిమ్ "యుద్ధము చేయుటవలన జననష్టము, ధననష్టమే కాని, లాభము కొద్దియైనను లేదు" అని బాగుగా ఆలోచించి, రాజ్యము విడచి అడవులకు వెళ్లెను. అచ్చట ఒక గుహలో నివాసమేర్పరచుకొని, కాలక్షేపము చేయుచుండెను. నౌఫల్ హాతిమ్ రాజ్యమాక్రమించుకొనెను. ఆతని యొక్క దూతలు, హాతిమ్‌రాజ్యము విడచివెళ్ళిన సంగతి చెప్పిరి. అది విని, నౌఫల్ "హాతిమ్‌ను పట్టి అప్పగించినవారికి ఐదు వందల మొహరీలు బహుమతి నిచ్చెదను" అని ప్రకటించెను. ఈ ప్రకటన విని, అనేకమంది హాతిమ్‌ను వెదకుటకు బయలుదేరిరి.

హాతిమ్ నివసించుచున్న గుహ సమీపమున ఇద్దరు వృద్ధదంపతులు కట్టెలు కొట్టుకొని సేదదీర్చుకొనుటకు కూర్చుండిరి.

వృద్ధురాలు: "మనము ఈ విధముగా కట్టెలు కొట్టుకొని జీవించుచుంటిమి కదా! మన జీవితమంతయు కష్టములపాలైనది. ఈసమయములో హాతిమ్ మనకు దొరికినట్లయిన, రాజున కప్పగించి ఐదు వందల మొహారీలు బహుమతి పొందెదము. దానితో మన కష్టములు తొలగి, సుఖమగు జీవితముగడుపవచ్చును"

ఇది విని భర్త కోపముతో, "ఛీ, పాపాత్మురాలా! నీకున్న దానితో తృప్తిపడుము. ఇతరులకు కీడు కోరుట పాపము. హాతిమ్‌ను పట్టి రాజున కప్పగించుటకు, ఆతడు

రేవతి

★ అక్కయ్య అపరాధ పరిశోధన ★

అక్కయ్య ఇవన్నీ ఊహించుకొంది. అక్కయ్య తెలివైందికాబట్టే కుర్రవాళ్ళను కొట్టక, తిట్టక ఎవరు దొంగో తెలుసుకుంది. ఇదీ మొత్తం మీద "అక్కయ్య అపరాధ పరిశోధన." సూర్యానికి నిండా పదేళ్లు లేకపోయినా వాడు పదితలలు గలిగిన "రావణాసురుడి"వంటివాడు. ఆనాడు శ్రీరాముడు రావణుని లోకకంటకుడని హతమార్చేడు. ఈ నాడు అక్కయ్య సూర్యం తప్పుపని చేశాడని వాడినేమీ చేయకుండానే వాడిలో ఒక విధమైన మార్పును తీసుకొచ్చింది.

పిన్ని అడిగింది, "ఏమే పెద్దమ్మాయ్! సూర్యం తీశాడని నీకెలా తెలిసిందేం?" అని. "సూర్యం ఇంట్లో ఏంచేసినా ఎదురింటి వాళ్ళబ్బాయికీ పక్కింటివాళ్ళబ్బాయికీ, దొంగతనంగా తీసికెళ్ళి పెడుతుంటాడు. నేను వెళ్ళి వాళ్ళను కనుక్కొంటే వాళ్ళకి సూర్యం పటికబెల్లం ముక్కలు ఒక రంగులపెట్టెతో తీసుకొచ్చి, కొద్దిగా పెట్టేడని చెప్పారు. వెంటనే దొంగ దొరికాడు! కాని నావుద్దేశ్యం వాడిచేతనే చెప్పించాలని. చూశావా, మరి వాడిచేతనే చెప్పించాను!" అంది అక్కయ్య చిరునవ్వుతో. ★

తేడాలు

బీరువాలో బిస్కట్ల సీసా అందక అవస్థపడుతున్నాడు బాబురావు.

"అందని దానికోసం ఎందుకలా తిప్పలు పడతావు? నోట్లో నాలిక లేదూ? అని కోప్పడింది వాళ్లమ్మ.

"ఉండమ్మా. అయితే నాలిక కన్న చెయ్యే పొడుగుగా? అందుకని..." అన్నాడు బాబురావు.

మనకు ఏమి అపకారము చేసెను" అని మందలించెను.

వీరిసంభాషణ హాతిమ్ గుహాలో నుండి విని, "నా జీవితము కష్టముల పాలైనది; నేను రక్షింపబడుట స్వప్నములోని మాట. పోనీ ఈ ముసలివారికైనను సహాయపడినచో, వారు సుఖింతురు" అని భావించి, ఆ వృద్ధదంపతుల ఎదుటకు వచ్చి, "అయ్యా! నేనే హాతిమ్‌ను. నన్ను నౌఫల్ రాజువద్దకు తీసుకువెళ్లుడు; మీకు బహుమతి లభించును; దానితో మీ కష్టములు తీరును" అని వారితో చెప్పెను.

ఆ మాటలకు వృద్ధుడు "అది అన్యాయము. డబ్బుకాసించి మిమ్ములను రాజున కప్పగించుటవలన, ఆతడు మిమ్ములను చంపించును. అటువంటి పాపమునకు నేను ఒడిగట్టను" అని చెప్పెను. దానికి హాతిమ్ "నేను ఎవరిచేతనైనను పట్టుబడకతప్పదు. ఆ బహుమానము వారికి లభించకమానదు. ఆ బహుమానము మీరే పొందినచో మీరు సుఖింతురు కదా! నన్ను తప్పక తీసుకువెళ్లుడు" అని నిర్బంధించసాగెను. కాని ఆ వృద్ధుడు అంగీకరించలేదు. "మీరు గుహాలోనికి పోయి దాగుకొనుడు. ఎవరైనా చూచినచో బంధించి తీసుకొనిపోవుదురు" అని వృద్ధుడు తొందరపెట్టసాగెను.

ఇంతలో కొందరు మనుష్యులు వచ్చి హాతిమ్‌ను బంధించి, రాజువద్దకు తీసుకువెళ్లిరి. వృద్ధుడు కూడ విచారముతో వారిని వెంబడించెను. హాతిమ్‌ను చూడగానే నౌఫల్ రాజు సంతోషముతో "మీలో ఎవరు వీనినిపట్టి తీసుకునివచ్చితిరి" అని వారి నడగెను.

ఆ గుంపులోని వారందరు 'నేనే తెచ్చితిని, నేనే తెచ్చితిని' అని అరువసాగిరి. కాని, వృద్ధుడు మాత్రము విచారముతో అట్లే ఊరకుండెను.

అంతట హాతిమ్ రాజుతో "రాజా! వీరందరికి వెనుక నున్న వృద్ధుడు మాత్రమే నన్ను పట్టుకొనెను. మిగిలినవారందరు అసత్యము పల్కుచున్నారు." అనెను. రాజు, వృద్ధుని నిజము చెప్పుమని అడిగెను.

వృద్ధుడు, "అయ్యా! హాతిమ్‌ను నేనుగాని, వీరుగాని పట్టుకొనలేదు. నా కష్టమును చూచి, నాకు సహాయము చేయగోరి హాతిమ్, తనను రాజున కప్పగించి బహుమతిని పొందుమని నాతో చెప్పెను. అందులకు నేను అంగీకరించలేదు. ఇంతలో వీరువచ్చి మమ్ములను వెంబడించిరి" అని జవాబిచ్చెను.

ఈ మాటలకు రాజు ఆశ్చర్యచకితుడై "హాతిమ్! నీవు చాల ఉదారస్వభావుడవు. ఇతరుల కష్టము చూచి సహించలేని దయార్ద్రహృదయుడవు. ఇతరుల మేలుకొరకు ప్రాణములు సహితము కోల్పోవ సంసిద్ధుడవైతివి. అందుచే నిన్ను మెచ్చి నీ రాజ్యము నీకు తిరిగి యిచ్చుచుంటిని; సుఖముగా పాలించుకొమ్ము" అని చెప్పి వృద్ధునకు బహుమతి నిచ్చి, అసత్యవాదులను శిక్షించెను.

దీని అనంతరము నౌఫల్ హాతిమ్‌ను తన మిత్రునిగా చేసికొని, ఆతనిని క్షమాపణ వేడుకొనెను.



కలసి కృషి చేదాం!

ఒక బడిపంతులు ఇంటికి ఒక దొంగ కన్నం వేశాడు. చీకట్లో తారట్లాడుతూ ఉండగా, ఆయన మేలుకుని "ఎవరది" అన్నాడు.

"నోరు మెదిపితే చంపేస్తాను. నాక్కావలసింది డబ్బు. అదేదో వెతుక్కుని నా దారిన పోతాను. అడ్డొస్తే జాగ్రత్త." అన్నాడు దొంగ.

"అబ్బే. అడ్డురావడం ఎందుకు? నాక్కావలసిందికూడా డబ్బే. దీపం వెలిగిస్తా ఉండు. ఇద్దరం కలిసి వెతుకుదాం." అన్నాడు బడిపంతులు.

* *

'ఆయన ఇంట్లో ఉంటే'

ఋణదాత: నారాయణరావుగారు ఇంట్లో ఉన్నారండీ?"

నౌకరు: "ఉన్నారు. ఏం కావాలండి."

ఋణ: "అబ్బే నాకు పది రూపాయలు బాకీ అండి. అడుగుదామని."

నౌకరు: "మీకు వెర్రి కాని డబ్బు చేతులో ఉంటే, నారాయణరావుగారు ఇంట్లో ఎందుకుంటారు. సరదాగా ఉంటే వెళ్లి పలకరించి కుశలం అడగండి."

★ పథేర్ పాంచాలీ ★

(19-వ పేజీ తరువాయి)

"ఆ వేస్తున్నవి ఏం పూలవాసన అక్కా?" అని అడిగాడు అపూ.

పెదనాన్నగారి నివేశనంలో ఉన్న పొన్నచెట్టు పూలవాసన అని చెప్పింది వాళ్లమ్మ. అపూ, దుర్గ ఇద్దరూ ఎంతో ఆసక్తితో-"ఆ చెట్టుక్రింది కొకసారి పెద్దపులి వచ్చిందని చెప్పావుకదూ అమ్మా?" అని అడిగారు. కాని వాళ్లమ్మ చేతిలో పేకముక్కలు చటుక్కున క్రిందపడేసి, "అయ్యో, అన్నం మాడుతోన్నట్టుంది. వాసనేస్తోంది. అన్నం దింపివస్తా నుండండి" అన్నది.

దుర్గ అన్నంముందు కూర్చుని, "రామ్మలక్కాయ కూర ఎంతో బావుందమ్మా!" అన్నది. ఆ పిల్ల దానిముఖంలో అపూర్వమైన ఆనందం వ్యక్తమయింది. అపూ కూడా "అచ్చగా మాంసంకూరలా ఉంది. కాదు అక్కా? ఒకచోట చాలా పండి ఉన్నవి కన్పించాయి. పుట్టగొడుగుల్లాంటివేమో అని నేను ముట్టుకోలేదు" అన్నాడు. ఇద్దరూ అలా మెచ్చుకుంటూంటే సర్వజయ మనస్సు గర్వంతో, సంతృప్తితో నిండిపోయింది. వాళ్లకంటె అదృష్టవంతులెవరున్నారు తనకి? ఎవరిళ్లలోనైనా భోజనాలవీ వస్తే చిన్నమ్మమ్మగారిని పిలుస్తారు వంటకి, ఒక్కసారి వాళ్లు కనుక తనని పిలిస్తేనా, వంట అంటే అసలేమిటో తాను చేసి చూపగలదు ఆవిడకి. ఆఁ...

"అపూ చేతిమీద కాసినినీళ్లు పొయ్యవే దుర్గా! అదేంపని?... ఈ దారిలో నేనా అంటమూతి కడుక్కోవటం?... రోజూ రాత్రిళ్లు నువ్వు ఆ దారిలో నే-" అంటున్నది సర్వజయ.

కాని అపూ అక్కడినుంచి అడుగయినా కదలటానికి ఒప్పుకోలేదు. ఎదురుగా మొండిగోడ శిథిలాలు, చీకటి గుయ్యారంలా అడవి...పాడుబడ్డ ఇల్లు...ఇంకా తెలియకుండా భయంకర మైనవి ఏమేమి ఉన్నాయో! ప్రాణాలు పీచుపీచుమంటున్న అలాంటిచోట దారిలో ఎంగిలిమూతి కడుక్కుంటే అంతలోనే ఏం ముంచుకుపోతుందో వాడికేం బోధపడలా.

తర్వాత అందరూ పోయి పడుకున్నారు. రాత్రి ప్రొద్దు పోయినకొద్దీ శీతకాలపు గాలి ఛాతిమ్‌పూలవాసనమయమయేది. అర్ధరాత్రి వెదురుచెట్ల చివళ్లను— కృష్ణపక్షపు కాకివెన్నెల-మంచు తడితో తడిసిన చెట్లకొమ్మలమీద పడి మిలమిలలాడుతూ ఉంటుంది. వెలుగు - నీడల అపురూప లాలనలతో ఈ వనప్రాంతమంతా నిద్రిస్తున్న గంధర్వనగరంలా అత్యాశ్చర్యకరంగా ఉంటుంది. రివ్వురివ్వున ఓ గాలితరగ వచ్చి, కొండగోగుచెట్లను ఊగించి, గొండపొదల చివళ్ళను కదిలిస్తూ పోతూ ఉంటుంది.

వాడికి ఒకొక్క రోజున అలాంటప్పుడు మెలుకువ వస్తూ ఉంటుంది. ఈ గ్రామస్థులు విస్మరించిన విశాలాక్షీదేవి మళ్ళీ ఎదో తిరిగి వచ్చినట్లుంటుంది. ఇసుక మేటలు వేసిన 'ఇచ్ఛామతి' స్వచ్ఛజలాల అంచుల్ని, చిన్నచిన్న నాచుముక్కలు పెరిగిన చల్లటి బురదనేలను అలుముకుపోయిన అడుగుల గుర్తులు కలవారు—ఒడ్డుమీది పురాతనపు పొన్నచెట్టు కూడా ఎన్నడూ చూచి యెరుగనివారు - వారే పూర్వం విశాలాక్షి ఆలయంలో ఒకప్పుడు పూజానైవేద్యాదికాలు నిర్వర్తించి ఉండవచ్చు. ఈ కాలపువాళ్లు ఎవరెరుగుదురు ఆమెని? కాని ఆమెమాత్రం ఈ గ్రామాన్ని ఇంతవరకు మరచిపోలేదు.

ఊరంతా సద్దుమణిగాక—రాత్రి చాలా ప్రొద్దుపోయింతర్వాత ఆమె అడవులవెంట పూలను వికసింపచేస్తూ తిరుగుతూ ఉంటుంది. పక్షిసంతతిని ఒకకంట కనిపెడుతూ ఉంటుంది. వెన్నెలరాత్రుల వేకువవేళల రకరకాల పువ్వులనూ మధువుతో నింపుతూ ఉంటుంది.

ఏపొదలో ఏ 'వాసక' పుష్పపు చివళ్లు దాగి ఉన్నాయో, దట్టంగా ఉన్న అడవిమధ్య పొన్నపూలు ఎక్కడెక్కడ రాలాయో, ఇచ్ఛామతీనది ఏమలుపులో పచ్చని నాచుమధ్య ఏయేపూలు విచ్చాయో చెట్లమీది గూళ్ళలో ఏయేపక్షి పిల్లలు నిద్ర మేల్కొన్నాయో – ఆమెకి తెలుసు

ఆమె సౌందర్యపు స్నిగ్ధకాంతితో అడవి అంతా నిండి ఉంటుంది. రాత్రులు వెన్నెలతో, సువాసనలతో, విచిత్రమైన వెలుగు నీడలతో అపురూపశోభతో ప్రకాశిస్తూ ఉంటాయి.

తూర్పురేఖలు విరిసేలోపుగానే ఆ వనలక్ష్మి ఎక్కడో విలీనమైపోతుంది. స్వరూపచక్రవర్తి తర్వాత ఆమె నెవరూ ఎన్నడూ చూసి యెరుగరు.

—[ఇంకా ఉంది]

న్యూఢిల్లీ లేఖ

(5-వ పేజీ తరువాయి)

నేషనల్ లైబ్రరీలో పనిచేస్తోంది. ఢిల్లీలో భవనం పూర్తి కాగానే ఈ బృందం ఢిల్లీ వస్తుంది. 1956-57 సం॥ బడ్జెట్‌లో ఈ పనికి లక్ష రూ॥ కేటాయింపబడింది.

1955 అక్టోబరు 6వ తేదీన ఐ. రా. విద్యాసాంఘిక సాంస్కృతిక సంఘ గోష్ఠిలో విద్యామంత్రి మౌలానా ఆజాద్ చెప్పిన మాటలు గమనించదగినవి.

"భారతదేశంలో 36 కోట్ల జనులున్నారు. వీరు 5 లక్షలపైగా గ్రామాల్లో, పట్టణాల్లో నివసిస్తున్నారు. కాని ఇంతమందికీ 32 వేల గ్రంథాలయాలే ఉన్నాయి. ఇవి పేరుకు మాత్రమే గ్రంథాలయాలుకాని, నిజంగా ఉండవలసిన లక్షణాలనేకం వీటికి లేనేలేవు. ప్రతి 50 మందికైనా ఒక పుస్తకం లేదు. నూటికి పదిమంతులకుపైగా జనులు ఏడాదికొక పుస్తకంతోనే సరిపుచ్చుకుంటున్నారు. నిరక్షరులు ఎక్కువమందేనని భావించినప్పటికీ అక్షరాస్యులైనవారిలో కూడా సగటున ఒకొక్కడు ఏడాదికి ఒక్క పుస్తకమే చదువుతున్నాడు. ఈ పరిస్థితిని, అమెరికా, బ్రిటన్ పరిస్థితులతో పోలిస్తే మనమెంత వెనుకబడిఉన్నామో తెలుస్తుంది. దాదాపు అక్కడి జనులందరూ విద్యావంతులే. అమెరికాలో సగటున ఒకొక్కడు ఏడాదికి 4 పుస్తకాలు, బ్రిటన్‌లో 7 పుస్తకాలు చదువుతాడు. బ్రిటన్‌లో విద్యావంతుడు భారతదేశపు విద్యావంతునికంటె ఏడురెట్లు ఎక్కువ పుస్తకాలు చదువుతాడన్నమాట. గ్రంథాలయాలు తక్కువగా ఉండడమే మనం విద్యలో వెనకబడి ఉండడానికి ముఖ్యకారణమూ, ఫలితమూ కూడానని నే నిదివరకే చెప్పాను. ప్రజాస్వామికవిధానాన్ని ఎంచుకొన్న దేశాలలో అధిక సంఖ్యాకులు విద్యాహీనులుగా, అజ్ఞానులుగా ఉండడం సహించరాని విషయం. జనాభా ఎక్కువగా ఉండడం కాక, ఉన్న జనాభా ఎటువంటిదీ అనే విషయమే ఒక దేశపు గౌరవాన్ని, భావినీ నిర్ణయిస్తుంది. అందుచేత మన ప్రజలు ఇతర దేశాలవారితో అన్నివిధాలా సమానులుగా పురోగమించాలంటే గ్రంథాలయ సౌకర్యాలను అత్యధికంగా వృద్ధిచేసుకోక గత్యంతరంలేదు."



Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd., by S. Radha Krishna at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras-1. Editor S. Sambhu Prasad.



నవ్వులసొంపు

—ఫొటో: పి. గురుమూర్తి